

అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 120 | ఆదివారం | 30-03-2025 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' ఉగాది శుభాకాంక్షలు

### సెలవు

ఉగాది సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి ఆదివారం సెలవు. సోమవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.

\- ఎడిటర్

### ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న నక్సల్స్ వేట

# 18 మంది ఎన్‌కౌంటర్‌లో హతం

- సుక్మా, బీజాపూర్ జిల్లాలో మరోసారి రక్తసిక్తం
- ఎదురుకాల్పుల్లో నలుగురు భద్రతా సిబ్బందికి గాయాలు
- వరుస ఘటనలతో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి



ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం అడవులు మరోసారి రక్తసిక్తమయ్యాయి. ఆ రాష్ట్రంలోని సుక్మా, బీజాపూర్ జిల్లాలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 11 మంది మహిళా మావోయిస్టులు సహా మొత్తం 18 మంది మావోయిస్టులు హత మయ్యారు. మావోయిస్టు అగ్రనేత కుహ్దామి జగదీష్ ఉన్నట్లు తెలుస్తోంది. 2013 లో జరిగిన జీరామ్ వ్యాలీ దాడిలో అనేక మంది కాంగ్రెస్ నాయకులు మరణించారు. ఈ దాడిలో పాల్గొన్న మావోయిస్టు నేతల్లో ఈయన కూడా తరువాయి 2లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో..

# శ్రవణ్‌రావును విచారించిన సిట్

- ఆరు గంటల పాటు ప్రశ్నల వర్షం
- ఫోన్‌కాల్స్ ఆధారంగా పలు కీలక అంశాలపై ఆరా
- ఇన్నిరోజులు ఎక్కడ దాక్కున్నారో అనే దానిపై కూపీలాగిన అధికారులు



ప్రజాపక్షం/హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏడాది నుంచి తప్పించుకుతిరుగుతున్న ఓ టివి ఛానల్ యజమాని శ్రవణ్‌కుమార్‌ను దర్యాప్తు బృందం (సిట్) విచారించింది. ఫోన్ ట్యాపింగ్‌కు కావాల్సిన సర్వర్లు, ఇతర అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాలు, కంప్యూటర్లు టివి ఛానల్‌లో ఎందుకు ఏర్పాటు చేశారు..? ఎవరి ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్‌కు తరువాయి 2లో



మయన్మార్ భూవిలయం

# 10000 పైనే మృతులు?

- రెండోరోజూ మూడుసార్లు ప్రకంపనలు
- సహాయంకోసం జుంటా అసాధారణ విజ్ఞప్తి
- 1644 మృతదేహాలు వెలికితీత : 3 వేలమందికి గాయాలు
- చైనా, రష్యా సహా విదేశీ సహాయ బృందాలు రాక

05

## సన్నబియ్యం పంపిణీకి

# నేడే శ్రీకారం

### హుజూర్‌నగర్‌లో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

ఉగాది పర్వదినాన ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. దీనిని లాంఛనంగా ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సూర్యాపేట జిల్లాలోని హుజూర్ నగర్ పట్టణానికి నేడు రానున్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయన తొలిసారిగా సూర్యాపేట జిల్లాలో అడుగు పెట్టనుండడంతో పౌర సరఫరాల, తరువాయి 2లో



# కంటికి రెప్పలా కొడంగల్‌ను కాపాడుతా

- బందోబస్తు లేకుండా త్వరలో లగచర్లలో పర్యటిస్తా
- భూముల ధరలు పెరగాలంటే అభివృద్ధి జరగాల్సిందే
- అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే ప్రజలు వదలరు
- బిఆర్‌ఎస్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం

ప్రజాపక్షం / కొడంగల్

కొడంగల్ నియోజకవర్గాన్ని తాను జీవించినంత కాలం కంచె వేసి కంటికి రెప్పలా కాపాడుకుంటానని సిఎం రేవంత్‌రెడ్డి సంచలన వాఖ్యలు చేశారు. శనివారం కొడంగల్‌లో వెలసిన శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి 45వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి నివాసంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ తరువాయి 2లో

## హైదరాబాద్‌లో

# కాల్పుల కలకలం

- వ్యాపారుల మధ్య ఘర్షణ
- గుడిమల్కాపూర్‌లోని ఎక్స్‌పోలో ఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో శనివారం కాల్పుల కలకలం చోటుచేసుకుంది. వ్యాపారుల మధ్య జరిగిన ఘర్షణలో మరో వ్యాపారి ఈ కాల్పులకు తెగబడ్డాడు. అయితే ఈ కాల్పుల్లో ఎవరూ గాయపడక పోవడం గమనార్హం. గుడి మల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్‌లో జరుగుతున్న 'ఆనం మీర్జా' ఎక్స్‌పోలో మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుడి మల్కాపూర్‌లోని ఓ ఎక్స్‌పోలో కాల్పుల మోత తరువాయి 2లో


ఉగాది పర్వదిన శుభాకాంక్షలు



సంగారెడ్డి జిల్లా
పరిశ్రమల యాజమాన్యం, సిబ్బంది,
కార్మికులకు మరియు జిల్లా అధికారులకు
శ్రీవిశ్వావసు నామ సంవత్సర
ఉగాది పర్వదిన
శుభాకాంక్షలు

TGIIC-IALA
Industrial Area Local Authority

PNGPIASS
*Pashamylaram Notified Gram Panchayat Industrial Areas Service Society*

Admin Building, Phase-1, TSIIC Industrial Park,
Pashamylaram, Patancheru, Telangana - 502307.
Email: pngplass23@gmail.com





# ప్రపంచం
WORLD NEWS

## బలూచిస్థాన్‌లో ఆగని దాడులు



**క్వెట్టా :** పాకిస్థాన్ నుండి బూచిస్థాన్‌కు విముక్తి ప్రసాదించాలని కోరుతున్న ఉగ్రవాదులు తమ హింసాత్మక దాడులను ఆపడంలేదు. తాజాలో ఒక రాజకీయపార్టీ ప్రదర్శనపై ఆత్మహత్యాబాంబుదాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ముఖ్యనాయకులు చావునుండి తప్పించుకున్నారు. మస్తంగ్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి యత్నించారు. ఐనప్పటికీ బలూచిస్థాన్ నేషనల్ పార్టీ—ఎంకు చెందిన నాయకులు సర్దార్ అఖ్తల్ మెంగల్, ఇతర కార్యకర్తలు చావు నుండి తప్పించుకున్నారు. బలూచ్ ఏక్‌జహ్తీ కమిటీ (బివైసి) ప్రధాన నిర్వాహకుడు డా.మహ్‌రంగ్ బలోచ్ ఇతర నాయకులు వాధ్ నుండి క్వెట్టా వరకూ లాంగ్ మార్చ్ తలపెట్టారు. క్వెట్టా పాలక యంత్రాంగం ఈ మార్చ్‌కు అనుమతి నిరాకరించింది. కానీ పోలీసులు అడ్డగించి 250 మందిని అరెస్టు చేశారు. ఆ తర్వాత ఆత్మాహుతిదళ బాంబుదాడి మంగళ్ మార్చ్‌పై జరిగింది. ఆయన గాయపడకుండా తప్పించుకున్నారు.

## 12 రోజుల్లో 921 మంది
# పాలస్తీనియన్లు మృతి
### బీరూట్‌పై దాడులు





**గాజా :** గడచిన 12 రోజులుగా గాజాలో కొనసాగుతున్న ఇజ్రాయెల్ దాడులు శనివారంనాడు కూడా ఆగలేదు. ఈ దాడుల్లో ఇప్పటివరకూ 921 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 2,052మంది గాయపడ్డారు. వెస్ట్‌బ్యాంక్‌లోని మసాఫిర్ ఎట్టా ప్రాంతంలో తాజాగా దాడులు జరిగాయి. తాజా దాడుల్లో పలువురు పాలస్తీనియన్లు మరణించారు. మార్చి 18న ఇజ్రాయెల్ ఏకపక్షంగా కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘించి తిరిగి యుద్ధం ప్రారంభించింది. వెస్ట్‌బ్యాంక్‌లో దాడులను పాలస్తినా విదేశీమంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. వెస్ట్‌బ్యాంక్‌లో ఉన్న పాలస్తీనియన్ల ఇళ్ళు కూల్చివేసి ఆ ప్రాంతాన్ని పూర్తిగా ఖాళీ చేయించేందుకు ఇజ్రాయెల్ సైన్యం కుట్ర చేసిందని, ప్రపంచ దేశాలు స్పందించి అడ్డుకోవాలని కోరింది. బతుకుతెరువుకోసం వెస్ట్‌బ్యాంక్‌లో దశాబ్దాలక్రితం స్థిరపడిన పాలస్తీనియన్లపై అత్యంత కిరాతకంగా దాడులు చేస్తున్నారనీ, వారి ఇళ్ళు, ఇతర మౌలిక సదుపాయాలను కూల్చివేస్తున్నారని పేర్కొంది. మిగిలిన బందీలను బేషరతుగా అప్పగించాలని కోరుతూ ఇజ్రాయెల్ సైన్యం గాజాలోకి ఆహారసరఫరాలను అడ్డుకుంది. దాడులను పునరుద్ధరించింది. 2023 అక్టోబరు నుండి ఈ ఏడాది మార్చి 27వ తేదీ వరకూ మధ్యలో 45 రోజులు విరామం తప్ప గడచిన 539 రోజులుగా గాజాపై ఇజ్రాయెల్ గగనతల,భూతల దాడులు కొనసాగిస్తూనే ఉంది. మార్చి 18న దాడులు పునరుద్ధరించిన మొదటిరోజే 400 మంది ప్రజలను బలితీసుకుంది. మరోవైపు ఇజ్రాయెల్‌లో ప్రధానమంత్రి నేతన్యాహూకు వ్యతిరేకంగా ప్రజల నిరసన ప్రదర్శనలు శనివారంనాడు కూడా కొనసాగాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని గౌరవించాలని, మిగిలిన బందీలు 59 మందినీ శాంతియుత పద్ధతులలో విడిపించి తీసుకురావాలని బందీల కుటుంబాలు, మిత్రులతో కూడిన సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. అదేవిధంగా గత ఏడాది నవంబరులో హిజ్బుల్లాతో చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని కూడా ఇజ్రాయెల్ సైన్యం ఉల్లంఘించింది. శనివారంనాడు బీరూట్‌పై దాడులు చేసింది. పొరుగున ఉన్న హదాత్‌పై దాడులు చేయడంతో ప్రజలు ఇళ్ళు వదలి పారిపోయారు. వారం రోజులక్రితం లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఏడుగురు మరణించారు.

## రెండు నెలల్లో
# రికార్డ్ బ్రేక్ చేసిన ట్రంప్



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రికార్డులు బద్దలుకొట్టారు. ఈ ఏడాది జనవరి 20వ తేదీన అధ్యక్ష పదవీబాధ్యతలు చేపట్టినప్పటినుండీ ఇప్పటివరకూ రెండు నెలల్లో 107 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్‌పై సంతకాలు చేసి గతకాలపు రికార్డులన్నింటినీ అధిగమించారు. ఫ్రాంక్లిన్ డి. రూజ్‌వెల్ట్ మొదటి 100 రోజుల పాలనలో 99 కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకాలు చేసి రికార్డు సృష్టించగా ట్రంప్ రెండు నెలల్లోనే ఆ రికార్డును బద్దలుకొట్టారు. జో బైడెన్ కంటే మూడురెట్లు ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ట్రంప్ ప్రధానంగా ప్రభుత్వ ఖర్చులు తగ్గించే విషయంపై దృష్టి సారించారని వైట్‌హౌస్ ప్రకటన పేర్కొంది. విదేశీవాణిజ్యంలో మార్పులు తీసుకువచ్చారనీ, సుంకాల ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నారని పేర్కొంది. ఆయన రెండు నెలల్లో అనూహ్యమైన ప్రకటనలు చేశారు. అవసరమైన చోట వెనక్కుతగ్గారు. అసాధారణ ధైర్యసాహసాలతో ప్రకటనలు గుప్పించారు. ''మాగా'' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) అనే కలను సాకారం చేసేందుకు ఆచరణలో ఎన్ని విమర్శలు వచ్చినప్పటికీ ఆయన కట్టుబడి చర్యలు తీసుకుంటున్నారు. దీంతో యూరప్ సహా అనేక దేశాలనుండి ఆయనకు విమర్శలు ఎదురవుతున్నప్పటికీ ఆ దేశాలు వాణిజ్య అవసరాల నిమిత్తం తలవొగ్గి తగ్గి ఉంటున్నాయి. ఉక్రేన్ యుద్ధం విషయంలో జెలెన్స్కీతో కఠినవైఖరి అనుసరించి యూరప్ దేశాలకు తీవ్ర వేదన కలిగించారు. రష్యాకు అనుకూలంగా వ్యవహరించారు. ఏ దేశాధ్యక్షుడూ చేయనివిధంగా జెలెన్స్కీతో బాహాటంగా ''అరుపులాట''కు దిగారు. ఇది ప్రపంచ చరిత్రలో వైట్‌హౌస్‌లో జరిగిన ఒక అసాధారణ ఘటనగా నమోదైంది. కాగా వైట్‌హౌస్ ఒక ప్రకటన చేస్తూ ఆర్థిక పరిస్థితులను చక్కబెట్టేందుకు ట్రంప్ ఎన్నో కఠిన నిర్ణయాలు తీసుకున్నారనీ, ఇప్పటివరకూ 107 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్‌పై ఆయన సంతకాలు చేశారనీ పేర్కొంది. ఆయనకు ముందు అధ్యక్షుడు జో బైడెన్‌కంటే మూడురెట్లు ఎక్కువగా కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు చేశారని వైట్‌హౌస్ ప్రకటన పేర్కొంది. ప్రభుత్వ వ్యయాల తగ్గింపు, సరిహద్దుల రక్షణ, వలసల నివారణ, ప్రపంచశాంతి పునరుద్ధరణ, అమెరికా ఇంధన వనరుల భద్రత, వనరుల అన్వేషణ వంటి విషయాలపై ట్రంప్ పూర్తిస్థాయిలో గడచిన రెండు నెలలుగా దృష్టి కేంద్రీకరించారని వైట్‌హౌస్ పేర్కొంది.

## గ్రీన్‌లాండ్‌ను చైనా,రష్యా
# ఆక్రమించకుండా రక్షిస్తాం



**కొపెన్‌హాగన్ :** గ్రీన్‌లాండ్స్‌దేశాన్ని కొనుగోలు చేస్తామని, అమెరికా వ్యూహాత్మక భద్రతకు ఇదెంతో ముఖ్యమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో ఆ దేశ ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, ఆయన సతీమణి ఉషా గ్రీన్‌లాండ్స్‌లో పర్యటించారు. గ్రీన్‌లాండ్స్ దేశ అభివృద్ధిని డెన్మార్ పూర్తిగా విస్మరించిందని వాన్స్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.అత్యంత సున్నితమైన వ్యూహాత్మకప్రాంతం గ్రీన్స్‌లాండ్స్‌ను చైనా, రష్యాలు ఆక్రమించేందుకు డెన్మార్క్ అవకాశాలు ఇస్తోందని ఆరోపించారు. ఈ విధమైన చొరబాట్లు, దురాక్రమణల నుండి గ్రీన్‌లాండ్ ప్రజలకు అమెరికా పూర్తి రక్షణ ఇస్తుందని ఆయన అన్నారు. గ్రీన్‌లాండ్‌లో వెలికితీయకుండా ఉన్న అసాధారణమైన చమురు, ఖనిజ వనరులు ఉన్నాయని ఆయన బాహాటంగా చెప్పారు. డెన్మార్క్ నుండి గ్రీన్‌లాండ్‌ను లాక్కునేందుకు అమెరికా ఎంతమాత్రం బలప్రయోగం చేయబోదని ఆయన భరోసా ఇచ్చారు.1721 నుండి గ్రీన్‌లాండ్‌ను డెన్మార్క్ హస్తగతం చేసుకుందని, కానీ వారికోసం ఏమీ చేయలేదని, అందువల్ల ఇప్పటికైనా డెన్మార్క్‌తో గ్రీన్‌లాండ్ తన బంధాన్ని తెంచుకుని స్వాతంత్ర్యం ప్రకటించుకోవాలన్నారు. ఇటీవలి ఎన్నికల్లో గ్రీన్‌లాండ్ ప్రజలు గుం దుగుత్తగా ట్రంప్ ఆలోచనలను తిరస్కరించారు. గ్రీన్‌లాండ్ స్వతంత్రను, స్వయంప్రతిని కాపాడుకోవాలని కోరుతూ వారు ఓటు వేశారు. ఐతే జె.డి.వాన్స్ దంపతుల గ్రీన్‌లాండ్ పర్యటనను డెన్మార్క్ ప్రభుత్వం తీవ్రంగా విమర్శించింది. వాన్స్ భార్య ఉషా తన పర్యటనను సాంస్కృతిక పర్యటనగా అభివర్ణించారు. ఆమె వెంట జె.డి.వాన్స్ కూడా వచ్చి ఈ పర్యటనలో కలిశారు.

## ట్రంప్‌ను ప్రతీకార సుంకాలతో
# ఎదుర్కొంటాం



కెనడా ప్రధానమంత్రి కార్నీ

**ఒట్టావా :** ట్రంప్‌ను ప్రతీకార సుంకాలతోనే ఎదుర్కొంటామని కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ చెప్పారు. ట్రంప్ తనతో ఫోన్‌లో మాట్లాడారని ఆయన ప్రకటించారు. కెనడాదేశ సార్వభౌమాధికారాన్ని ట్రంప్ ఎంతో గౌరవించారని ఆయన చెప్పారు. ఈ రెండు ఇరుగు పొరుగు దేశాలమధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతున్న తరుణంలో ట్రంప్ మొదటిసారి కార్న్‌కు ఫోన్‌చేసి మాట్లాడారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేరిపోవాలని ట్రంప్ సూచించడంతో ఆనాడు ప్రపంచంలో పెద్ద గగ్గోలు చెలరేగింది. అప్పటినుండీ రెండు దేశాలమధ్య సంబంధాలు హాట్ హాట్‌గా కొనసాగుతున్నాయి. వలసల సమస్య కూడా వారిమధ్య ఆటంకంగా ఉంది. వచ్చేనెల ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రచారంలో ఉన్న కార్నీ మాట్లాడుతూ, ట్రంప్‌తో తన ఫోన్ సంభాషణ ఎంతో ప్రయోజనకరంగా సాగిందన్నారు. కార్లపై 25 శాతం సుకంకాలు ఏప్రిల్ రెండో తేదీ నుండీ అమలులోకి వస్తే కెనడా కార్లపరిశ్రమకు తీవ్ర సమస్యలు ఎదురవుతాయి. ఈ పరస్థితుల్లో ఇద్దరిమధ్యా ఫోన్ సంభాషణ జరిగింది. ఎన్నికలు పూర్తయ్యాక వీరిద్దరూ మరోసారి మాట్లాడుకుంటారు. ఈనెల 14వ తేదీన కార్నీ కెనడా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇరు దేశాలమధ్య కొత్త ఆర్థిక, వాణిజ్య భద్రతా సంబంధాలపై సమగ్రస్థాయిలో సంప్రదింపులు చేయాలని ఇరు దేశాలూ నిర్ణయించినట్లు కార్నీ కార్యాలయం ప్రకటించింది.



## కొడంగల్‌ను కాపాడుతా
(మొదటి పేజీ తరువాయి)

సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కొడంగల్ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, మీరు ఓటు వేసి ఇచ్చిన శక్తితో ముఖ్యమంత్రిగా నాకు బలం ఉంది. అందుకు నా మాటలు వినాలంటే అసెంబ్లీకి వస్తే వినాల్సి వస్తుందని, వింటే భయపడాల్సి వస్తుందని కెసిఆర్ రావడం లేదన్నారు. కెసిఆర్ రాకపోవడంతో ఏమీ తెలియని ఓనమాళ్లు రానివారిలా పిచ్చివాడుగు వాగుతున్నారని, చెప్పినా నేర్చుకునే పరిస్థితులలో వాళ్లు లేరని మండిపడ్డారు. సిద్దిపేట, సిరిసిల్లా, గజ్వేల్‌కు ఉండాల్సిన అధికారం కొడంగల్‌కు పోయిందని కళ్లలో కారం పోసినట్లు మండుతుండటంతో కొడంగల్‌ను సర్వనాశనం చేసేందుకు అనేక రకాలుగా కుట్రలు చేసి అభివృద్ధిని అడ్డుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత నేను తీసుకుంటా కొడంగల్‌ను కాపాడుకునే బాధ్యత మీకే వదిలేస్తున్న అన్నారు. మీకు నష్టం వచ్చిన బాధ కలిగినా నేనే బాధ్యత తీసుకుంటానన్నారు. వచ్చే పదేళ్లు కూడా ముఖ్యమంత్రి కుర్చీ కొడంగల్ కే ఉంటుందని కార్యకర్తలలో జోష్ నింపారు. కొడంగల్‌కు 4 వేల కోట్ల నిధులు కాదు మరో 6వేల కోట్ల నిధులు మంజురు చేసి మొత్తం 10 వేల కోట్లతో కొడంగల్‌ను తెలంగాణకు ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మీరందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కొడంగల్‌లో కొంతమంది ప్రజలను రెచ్చగొట్టి చిచ్చు పెట్టాలని భూ సేకరణను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. భూములు పోయిన వాళ్లకు బాధలు ఉంటాయి. కానీ ఒక్కసారి అభివృద్ధి కాకపోతే తరతరాలు మనందరం బాధపడాల్సి వస్తుందని, అందుకు దుఃఖం వచ్చినా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ఆనాడు కెసిఆర్ మల్లన్నసాగర్‌లో భూసేకరణ చేస్తే 3 లేదా 4 లక్షల నష్టపరిహారం ఇవ్వడం జరిగిందని, కానీ మనం ఎకరానికి 20 లక్షలు, ఇందిరమ్మ ఇండ్లు, లేవుట్ ప్లాట్‌లు ఇంటికో ఉద్యోగం ఇవ్వడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఇంటికి రెండు ఉద్యోగాలు కల్పించే బాధ్యత నేను తీసుకుంటానని, అర్హత లేకున్నా ట్రైనింగ్ ఇచ్చి మరి ఉద్యోగాలు కల్పిస్తానని తెలిపారు. మీ కంటే నాకు ఎవ్వరు ఎక్కువ కాదు, నాయకుడిగా మీ ప్రేమ నాకు చాలు అని కార్యకర్తలకు భరోసా కల్పించారు. గత పాలకులు పరిపాలన చేస్తే కార్యకర్తల వద్ద డీజిల్ పైసల్ వసూళ్లకు పాల్పడినట్లు కార్యకర్తలు సిఎం రేవంత్‌రెడ్డికి చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్‌లో భూముల విలువలు పెరగాలంటే ఇక్కడ అభివృద్ధి జరగాలని, పరిశ్రమలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే ఇంటి దొంగలను కొడంగల్ ప్రజలు వదలరని అన్నారు. అసెంబ్లీలో కొంత మంది లగచర్ల ఘటనపై మాట్లాడుతూ, దమ్ముంటే లగచర్ల రా అంటూ సవాల్ చేస్తున్నారని, అతి త్వరలోనే లగచర్లలో ఎటువంటి బందోబస్తు లేకుండా మీటింగ్ పెట్టి అందరితో మాట్లాడుతానని రేవంత్ సంచలన వాఖ్యలు చేశారు. వీరితో పాటు ఎంపి మల్లురవి, తాండూర్, పరిగి ఎంఎల్‌ఏలు రామ్మోహన్‌రెడితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాలొన్నారు.

## కాల్పుల కలకలం
(మొదటి పేజీ తరువాయి)

మోగింది. అకస్మాత్తుగా ఓ షాపు యజమాని తన వద్ద ఉన్న తుపాకీ తో గాల్లోకి కాల్పులు జరిపాడు. ఈ హఠాత్పరిణామంతో ఎక్స్‌పో కు హాజరైన వారంతా అక్కడి నుంచి భయంతో వణుకుతూ బయటకు పరుగులు తీశారు. షాపు యజమాని కాల్పులు ఎందుకు జరిపాడు.. అసలు ఏం జరిగిందనే విషయాలపై పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీస్తున్నారు. ఇద్దరు దుకాణదారుల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో ఒక దుకాణదారుడు గాల్లోకి కాల్పులు జరిపాడు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాల్లోకి కాల్పులు జరిపిన దుకాణదారుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు రెండు రౌండ్లు కాల్పులు జరిపినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా సోదరి ఆనం మీర్జా.... రంజాన్ సీజన్ నేపథ్యంలో ఆమె తన పేరిట ఎక్స్ పో ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది.

## ఎవరు అడ్డుపడినా
# వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఆగదు
### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫైర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** భారత రాజ్యాంగానికి భవిష్యత్తులో ఆర్ఎస్ఎస్ భావజాలంతోనే ముప్పు పొంచి ఉందంటూ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమా ర్ మండిపడ్డారు. శనివారం కరీంనగర్‌లోని జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లోని న్యాయవాదుల డిజిటల్ లైబ్ర రీ కోసం బండి సంజయ్ రూ.15 లక్షలు మంజూ రు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులంతా బండి సంజయ్‌ను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు బిల్లుపై మజ్లిస్ నేత ఓవైసీ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దేశమంతా వక్ఫ్‌బోర్డు బిల్లుకు మద్దతు పలుకుతున్నారని, ఓవైసీ లాంటి ఎంత మంది వచ్చినా వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఆగదన్నారు. మజ్లిస్ పార్టీయే అసలైన దేశద్రోహి పార్టీ అని ఆరోపించారు. అతి త్వరలో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొం దడం తథ్యమన్నారు. ఈ కరీంనగర్‌లోనే ఓ పేద వ్యక్తి తరతరాల నుంచి ఇంటిని నిర్మించుకున్నారని, వాళ్ల తాత, ముత్తాతలు ఆ ఇంట్లోనే ఉంటున్నారని అన్నారు. కానీ వక్ఫ్‌బోర్డు స్థలమని చెప్పి అనుమతులన్నీ రద్దు చేసి ఇబ్బంది పెట్టారని చెప్పుకొచ్చారు. ఇలాంటివి దేశవ్యాప్తంగా ఉన్నాయని, అందుకే దేశ ప్రజలను, ఆస్తిపాస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సవరణ బిల్లు రూపొందించినట్లు వెల్లడించారు. ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసి కేసులు ఎదుర్కొన్నా.. 109 కేసులు నాపై ఉన్నాయి.. పలుమార్లు జైలుకు పోయి న.. ప్రతిసారి నన్ను కాపాడుతోంది న్యాయవాదులే.. వారి సంక్షేమం కోసం అన్ని విధాలా సహకరిస్తా.. న్యాయవాదుల కాన్ఫరెన్స్ కోసం సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి మరో రూ.50 లక్షల సాయం చేసేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్ కుమార్,తదితరులున్నారు.

## విచారించిన సిట్
(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా సహకరించారు..? ఏడాది కాలంగా దర్యాప్తుకు సహకరించకుండా ఎందుకు తప్పించుకు తిరిగారు..? దీని వెనుక ఉన్న శక్తులు ఎవరు..? తదితర ప్రశ్నలను సిట్ బృందం శ్రవణ్‌కుమార్‌పై సంధించింది. ఇదే కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు ఉన్న సంబంధాలపై కూడా సిట్ అధికారులు శ్రావణ్ నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు శ్రవణ్ రావు విచారణ కొనసాగుతున్నది. సిట్ ఇచ్చిన నోటీసులతో శనివారం జూబ్లీహిల్స్ ఎసిపి వెంకటగిరి ముందు విచారణకు హాజరైన శ్రవణ్ రావును అధికారులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు ప్రశ్నించారు. శ్రవణ్ రావు ఫోన్ కాల్స్ డేటా ఆధారంగా పలు కీలక అంశాలపై ఆరా తీసినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ వెనుక ప్రధాన సూత్రధారి ఎవరు? గత ప్రభుత్వంలోని కీలక వ్యక్తులతో మీకున్న పరిచయాలేంటి? ఫోన్ ట్యాపింగ్ పరికరాలు ఎక్కడ కొనుగోలు చేశారు? ఎవరి ఆదేశాలతో ఆఫీస్ లో సర్వర్లు పెట్టుకున్నారు? ఎంత కాలం నుంచి ఫోన్ ట్యాపింగ్ పరికరాలు మీ వద్ద ఉంచుకున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. ఎవరెవరి ఫోన్లను ట్యాపింగ్ చేశారు? ఎన్నికల సమయంలో ఎంత మంది ఫోన్లను ట్యాప్ చేశారని ప్రశ్నించినట్లు తెలిసింది. ఇన్నాళ్లపాటు విదేశాల్లో ఎక్కడ తలదాచుకున్నారు అనే అంశాలపై కూపీ లాగినట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసులో శ్రవణ్ రావు స్టేట్ మెంట్ అత్యంత కీలకంగా మారనుందని తెలుస్తోంది. ఆయన నోరు విప్పితే పలువురు కీలక నేతలు జైలుకు వెళ్లే అవకాశం ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో విచారణలో శ్రవణ్ రావు ఎలాంటి సమాధానాలు ఇస్తున్నారనేది ఉత్కంఠగా మారింది. ఈ కేసులో ఇప్పటికే ఎస్ఐబి డిఎస్పి ప్రణీత్‌కుమార్, మాజీ టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్‌రావు, అదనపు ఎస్‌పిలు భుజంగరావు, తిరుపతన్నలను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

## దక్షిణాది రాష్ట్రాల
# ప్రయోజనాలను కాపాడుకోవాలి




### రాష్ట్రం యూనిట్‌గా, ప్రస్తుతం ఉన్న ఎంపి స్థానాలలో 2:1 నిష్పత్తి ప్రకారం నియోజకవర్గాలను పెంచాలి
### 'తెలంగాణ పీపుల్స్ వాయిస్ ఫర్ ఫెయిర్ డీలిమిటేషన్' అఖిలపక్ష సమావేశం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ''జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ (లోక్‌సభ) నియోజకవర్గాల పునర్ విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. నియోజకవర్గాల పునర్ విభజనను మరో 25 ఏళ్ల పాటు నిలిపివేయాలి. ఒకవేళ కేంద్రం ఇప్పుడే చేపడితే జనాభా ప్రాతిపదికన కాకుండా రాష్ట్రం యూనిట్‌గా, ప్రస్తుతం ఉన్న ఎంపి స్థానాలలో 2:1 నిష్పత్తి ప్రకారం నియోజకవర్గాలను పెంచాలి'' అని 'తెలంగాణ పీపుల్స్ వాయిస్ ఫర్ ఫెయిర్ డీలిమిటేషన్' నిర్వహించిన అఖిలపక్ష సమావేశం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలతో చర్చించిన అనంతరమే నియోజకవర్గాల పునర్ విభజనపై తుది నిర్ణయం తీసుకోవాలని కోరింది. జనాభా నియంత్రణను విజయవంతం చేసి దేశాభివృద్ధికి తొడ్పడుతున్న రాష్ట్రాలకు రాజకీయంగా అన్యాయం చేయాలని చూస్తే సహించేదిలేదని అఖిలపక్షం హెచ్చరించింది. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాలను విభజించి ఉత్తరాదిలో సీట్లను పెంచుకుని తమ రాజకీయ పబ్బం గడుపుకోవాలనే బిజెపి కుట్రను బయటపెట్టి దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుకునేందుకు దక్షిణాది రాష్ట్రాలు ఐక్యం గా పోరాడాలని సమావేశం పిలుపునిచ్చింది. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్ విభజనపై 'తెలంగాణ పీపుల్స్ వాయిస్ ఫర్ ఫెయిర్ డీలిమిటేషన్' అధ్వర్యం లో అఖిలపక్ష సమావేశం శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. సమావేశానికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షత వహించారు. ఎంపి నియోజకవర్గాల పునర్ విభజనపై వివరాలతో ఒక ముసాయిదా నివేదికను మాజీ ఎంఎల్‌సి కె.యాదవ్‌రెడ్డి సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్ విభజనలో కేవంలం జనాభానే కాకుండా జిడిపి, మానవ వనరుల అభివృద్ధి సూచిక, అక్షరాస్యత తదితర అంశాలలో దేశాభివృద్ధికి రాష్ట్రాలు చేస్తున్న కృషిని కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ బిజెపి తన రాజకీయ అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకు జనాభా ఆధారంగా దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్లను తగ్గించాలని అప్రజాస్వామికంగా, దుర్మార్గంగా ఆలోచిస్తుందని విమర్శించారు. టిపిసిసి ఉపాధ్యక్షులు ఎం.ఆర్.జి. వినోద్ రెడ్డి మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్ విభజన చేయడం ద్వారా దక్షిణాదికి సీట్లు తగ్గించి ఉత్తరాదికి సీట్లు పెంచుకోవడం ద్వారా బిజెపి తన రహస్య ఏజెండాను అమలు చేసుకునే కుట్ర దాగి ఉందన్నారు. డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షోపన్యా సం చేస్తూ నియోజకవర్గాల అశాస్త్రీయ పునర్ విభజనపై యాదవ్‌రెడ్డి ఇచ్చిన నివేదికకు అదనంగా అఖిలపక్ష సమావేశంలో వచ్చిన సూచనలతో కలిపి ఒక పుస్తకాన్ని ప్రచురిస్తామని, గ్రామస్థాయిలో సమావేశాలను ఏర్పా టు చేసి ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. సమావేశంలో ఎం.జగన్ (ఐప్సో), మధుసూదన్‌రెడ్డి (విద్యావేత్త), నారాయణ (బ్లాసమ్ విద్యాసంస్థల అధినేత), తిప్పర్తి యాదయ్య (తెలంగాణ విద్యావంతుల వేదిక), మల్లంగి విజయ్, జావెద్ షరీఫ్, డాక్టర్ లక్ష్మ(ఆప్), ఎం.వేణు (టిజెఎస్), సంఘ సేవకులు రాకేష్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు.

## నేడు శ్రీకారం
(మొదటి పేజీ తరువాయి)

నీటిపారుదలశాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్, ఎస్‌పి కె నర్సింహలు భారీ ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5గంటలకు సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించి అనంతరం ప్రజలను ఉద్దేశించి బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా మొత్తం 610 రేషన్ దుకాణాలు ఉండగా వాటి వద్ద మామిడి తోరణాలతో అలంకరించి పండుగ వాతావరణంలో బియ్యం పంపిణీ జరగాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ రేషన్ డీలర్లకు సమాచారం ఏర్పాటు చేసి దిశనిర్ధేశం చేశారు. ప్రతి లబ్దిదారుడికి సన్నబియ్యం అందేలా చూడాలని, పక్కదోవ పట్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిక చేశారు. పౌర సరఫరాల శాఖ అధికారులు దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి స్టాక్ రిజిస్టార్‌లను పరిశీలించాలని ఆదేశించారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అత్యోదయ కార్డులు 19,817, ఆహార భద్రత కార్డులు 3,04,343, అన్నపూర్ణ కార్డులు 36లు ఉండగా మొత్తం 3,24,196ల కార్డులు ఉండగా 9,49,196 మంది లబ్ధదారులకు సన్నబియ్యం అందనున్నాయి. ఇందులో అత్యోదయ కార్డు దారులకు 35కిలోలు, అన్నపూర్ణ కార్డు దారులకు 10కిలోల చొప్పున మొత్తం జిల్లా వ్యాప్తంగా 6042.72 మెట్రిక్ టన్నుల సన్నబియ్యంను ప్రతి నెల పేదలకు పంపిణీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన సన్నబియ్యాన్ని జిల్లాలోని మిల్లర్ల నుండే పౌరసరఫరాల శాఖ అధికారులు సేకరించారు. సిఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా సన్నబియ్యం పథకాన్ని హుజూర్‌నగర్‌లో ప్రారంభించనున్నారు.

**సూర్యాపేట జిల్లాకు సిఎం హోదాలో తొలిసారిగా**

సిఎం హోదాలో ఎనుముల రేవంత్ రెడ్డి తొలిసారిగా సూర్యాపేట జిల్లాకు అడుగు పెడుతున్నారు. దీంతో రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె నర్సింహలు గత వారం రోజులగా హుజూర్‌నగర్‌లోనే తిష్టవేసి ఏర్పాట్లను పూర్తి చేశారు. ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. సిఎం సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా జన సేకరణకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, బాధ్యులు నిమగ్నమయ్యారు.

## ఎన్‌కౌంటర్‌లో హతం
(మొదటి పేజీ తరువాయి)

ఒకరు. ఈ ఘటనలో నలుగురు భద్రతా సిబ్బందికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. మావోయిస్టు పార్టీ నిర్మూలనే లక్ష్యంగా సాగుతున్న ఆపరేషన్ కగార్‌లో ఇదే పెద్ద విజయంగా కేంద్రం అభివర్ణిస్తోంది. సుక్మాలో జరిగిన ఎదురు కాల్పుల్లో మొత్తం 17 మంది హతం కాగా, బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక జవాన్ మృతి చెందినట్లు ఆ రాష్ట్ర పోలీసు వర్గాలు చెబుతున్నాయి. గాయపడిన నలుగురు భద్రతా సిబ్బందిలో ముగ్గురు రాష్ట్ర పోలీస్ యూనిట్ డిఆర్‌జికి చెందిన వారు కాగా, మరోవ్యక్తి సిఆర్‌పిఎఫ్‌కు చెందిన వారిగా తెలిసింది. ఈ ఎన్‌కౌంటర్‌ను ఉద్దేశించి కేంద్ర హోంమంత్రి అమీత్‌షా మాట్లాడుతూ ఆయుధాలతో హింసకు పాల్పడే ప్రాణాలు కోల్పోవడం తప్ప వారు సాధించేది ఏమీ లేదని, శాంతియుతంగా ఉంటే అభివృద్ధికి కారకులవుతారని అన్నారు. ఈ ఎన్‌కౌంటర్ అనంతరం భారీమొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు, 2026 మార్చి 31 నాటికి ప్రధాని మోదీ నాయకత్వంలో నక్సలిజాన్ని నిర్మూలిస్తామని షా ఎక్స్‌లో రాశారు. ఇదిలా ఉండగా గత పది రోజుల క్రితం భద్రతా బలగాలు 30 మంది మావోయిస్టులను కాల్చి చంపారు. సుక్మాజిల్లాలోని కెర్లపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉ.8 గం.లకు ఎదురు కాల్పులు చోటు చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజి సుందర్ రాజ్ ప్రకటించారు. కెర్లపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోగుండ, నెందుమ్, ఇంద్రవల్లి గ్రామాల అడవుల్లో మావోయిస్టులు కదలికలు ఉన్నాయనే పక్కా సమాచారం మేరకు శుక్రవారం రాత్రి డిఆర్‌జి, సిఆర్‌పిఎఫ్ 159వ బెటాలియన్ సిబ్బంది అడవులను జల్లెడ పట్టినట్లు చెప్పారు. మావోయిస్టులు శనివారం ఉదయం తారసపడటంతో హోరాహోరీగా ఇరు వర్గాల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయని, అటువైపు నుండి కాల్పులు ఆగిపోవడంతో ఘటనా స్థలాన్ని భద్రతా బలగాలు శోధించగా 11 మంది మహిళా మావోయిస్టులతో సహా 17 మంది మావోయిస్టుల మృతదేహాలు ఎన్‌కౌంటర్ స్థలం నుండి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఇదే ఘటనలో ముగ్గురు డిఆర్‌జి, ఒక సిఆర్‌పిఎఫ్ జవాన్‌కు కూడా గాయాలైనట్లు స్పష్టం చేశారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నామని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు ఐజి చెప్పారు. ఎకె 47 రైఫల్‌తో సహా పెద్ద ఎత్తున తుపాకులు ఉన్నాయని, సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్ , ఇన్సాస్‌రైఫిల్, 303 రైఫిల్, ఒక రాకెట్ లాంఛర్, బారెల్ గ్రెనేడ్ లాంఛర్, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లుతెలిపారు. మృతి చెందిన మావోయిస్టుల్లో ఏడుగురిని గుర్తించామని, మిగతా వారిని గుర్తించాల్సి ఉ oదని అన్నారు. మావోయిస్టు ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యులు కుహ్డామి జగదీష్, అలియాస్ బుద్రా ఉన్నారని, ఈయనపై 25 లక్షల రివార్డు ఉందన్నారు. అడవుల్లో ఇంకా కూంబింగ్ కొనసాగుతోందని, మరో ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మృతి చెందగా, మొత్తం 18 మంది మావోయిస్టులు వేర్వేరు ఘటనల్లో ప్రాణాలు కోల్పోయారు. వరుస విజయాలతో భద్రతా బలగాలు ఉండగా, ఇప్పటి వరకు ఈ ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్లలో 134 మంది మావోయిస్టులు హతం కాగా కేవలం బస్తర్ డివిజన్‌లోనే 118 మంది హతమయ్యారు. ఇందిలా ఉండగా ఘటనలో ప్రాణాలు కోల్పోతున్న మావోయిస్టు పార్టీ ఉక్కిరిబిక్కిరవుతోంది. అడవులపై పట్టు, సమాచార సేకరణపై పట్టు సాధించిన భద్రతా బలగాలు మావోయిస్టు కదిలికలను గుర్తించి మట్టుపెడుతున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఐదుగురు ఐటి అధికారులపై సిబిఐ కేసు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆదాయపు పన్ను హైదరాబాద్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు అధికారులపై సిబిఐ శనివారం కేసులు నమోదు చేసింది. ఇందులో ఇద్దరు ఐటి ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు సీనియర్ టాక్స్ అసిస్టెంట్లుతో పాటు మరో ప్రైవేటు వ్యక్తి మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేసింది. హైదరాబాద్‌లోని నిందితుల ఇళ్లలో కూడా సిబిఐ సోదాలు నిర్వహించి కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. బషీర్‌బాగ్‌లోని ఆయకర్ భవన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఐటి ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు సీనియర్ టాక్స్ అసిస్టెంట్లు కుమ్మక్కై ఆదాయపు పన్ను అధికారులను మోసం చేసి, తమకు తాముగా అనవసర ప్రయోజనం పొందారని సిబిఐ ఆరోపించింది. ఆదాయపు పన్ను శాఖ ద్వారా పంపిణీ చేయబడిన డేటాను దుర్వినియోగం చేశారని, విచారణ ప్రారంభించడానికి నోటీసులు పంపాలని ఆదేశాలు జారీ చేశారని ఆరోపించారు. ఆ డేటాను దుర్వినియోగం చేస్తూ ఐటి కట్టని అధికారులను ఫోన్లో సంప్రదించి భారీ జరిమానాలు విధిస్తామని బెదిరించారు.అంతేకాకుండా, నిందితులైన చార్టర్డ్ అకౌంటెంట్ (ప్రైవేట్ వ్యక్తి) ఖాతాల్లోకి డబ్బులు జమ చేయించారు. హైదరాబాద్లోని 6 చోట్ల నిందితుల నివాసాలపై సిబిఐ సోదాలు నిర్వహించింది.

## ఆర్‌టిసి హమాలీ పోర్టర్ల కూలీ రేటును పెంచాలి




### అజీజ్ పాషా డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆర్‌టిసి హమాలీ పోర్టర్స్ కూలీ రేటు బస్తాకు రూ.15లు పెంచడంతోపాటు వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్‌పాషా ఆర్‌టిసి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ హమాలీ పోర్టర్స్ కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ టిజిఎస్ ఆర్‌టిసి లైసెన్సు పోర్టర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని బస్సుభవన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి అజీజ్ పాషా మాట్లాడుతూ నిజాం కాలంలో ఆర్‌టిసి సంస్థ ఏర్పాడిన నాటి నుంచి సంస్థలో హమాలీ వ్యవస్థ కొనసాగుతున్నదన్నారు. హమాలీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేటును పెంచాల్సింది పోయి రూ.10లు ఉన్న బస్తా రేటును 2023 రూ.5లకు తగ్గించడం తీవ్ర అన్యాయమని, తక్షణమే రూ.15లకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్‌టిసికి ప్రయాణికులతో పాటు రవాణా వ్యవస్థ ద్వారా మంచి లాభాలు వస్తున్నాయని ప్రస్తుతం కొనసాగుతున్నటువంటి కార్గో సంస్థలో రవాణా సంస్థ లాభదాయకంగా నడుస్తున్నదని కానీ కార్మికుల కూలీ రేట్లు మాత్రం సగానికకి సగం తగ్గించడం ద్వారా వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందని వారు విమర్శించారు. ఎఐటియూసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ హమాలీలకు ప్రతి రెండు ఏళ్లకు ఒకసారి 20 శాతానికి తగ్గకుండా కూలీ రేట్లు పెంచడంతోపాటు కార్మికులకు రెస్టు రూమ్‌లను డిపోలలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోర్టర్ కార్మికుడికి రెండు జతల బట్టలు, ఆర్‌టిసి ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు, పోర్టర్స్ కువారి కుటుంబాలకు ఆర్‌టిసిలో ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రతినిధి వర్గం ఆర్‌టిసి వి.సి.సజ్జనార్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సజ్జనార్ స్పందిస్తూ అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, యూనియన్ ఉపాధ్యక్షులు జి.దాసు, వి.పోచయ్య, కే.కొండ య్య ఇ.దశరథ్, కే చంద్రమౌళి, జి.నరసింహ పాల్గొన్నారు.

## విద్యుత్ వనరుల విస్తరణ, గ్రీన్ పవర్ లక్ష్యసాధనలో హిమాచల్ ఒప్పందం గొప్ప ముందడుగు

### జల విద్యుత్‌తో విశ్వసనీయత, ఆర్థికంగా మేలు : డిప్యూటీ సిఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, విద్యుత్ వనరుల విస్తరణకు, 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025' ప్రకారం పర్యావరణ పరిరక్షణకు హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంతో 520 మెగావాట్ల హైడల్ విద్యుత్ ఒప్పందం చేసుకోవడం గొప్ప ముందడుగు అని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లాలో శనివారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుక్కు, అధికారులతో కలిసి డిప్యూటీ సిఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యుత్తు భద్రతను పెంచుకునే అంశానికి కట్టుబడి ఉందన్నారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర భాగస్వామ్యంతో ప్రతిపాదిత ప్రాజెక్టులు సెలి (400 మెగావాట్లు), మేయర్ (120 మెగావాట్లు) స్వచ్ఛమైన, ఆర్థికంగా మేలైన, విశ్వసనీయమైన విద్యుత్తును పొందడంలో ఉపకరిస్తాయని డిప్యూటీ సిఎం అభివర్ణించారు. జల విద్యుత్తు అత్యంత విశ్వసనీయమైన గ్రీన్ పవర్ అని, థర్మల్ పవర్‌తో పోల్చినప్పుడు హైడల్ పవర్ ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటుందన్నారు. థర్మల్ పవర్ ఉత్పత్తి ఖర్చు ప్రతి సంవత్సరం పెరుగుతుండగా, హైడల్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు క్రమంగా తగ్గుతుందని వివరించారు. హిమాచల్‌ప్రదేశ్ హిమాలయ పరివాహక నదులతో నిండి ఉన్న రాష్ట్రం కావడంతో సంవత్సరంలో 9 నుంచి 10 నెలల పాటు నిరంతరం హైడల్ పవర్ ఉత్పత్తికి అనువుగా ఉంటుంది అన్నారు. హిమాచల్‌తో పోలిస్తే దక్షిణ భారతదేశ నదులపై హైడల్ విద్యుత్ ఉత్పత్తి కాలం పరిమితంగా ఉంటుందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ ప్రభుత్వం హిమాచల్ ప్రదేశ్ సహజ వనరులను వినియోగించుకుని తెలంగాణ ప్రజలకు తక్కువ ధరకు, నమ్మకమైన, పర్యావరణ హితమైన విద్యుత్‌ను అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని ఈ ఒప్పందం ముందుకు తీసుకెళుతుందన్నారు. ఈ ప్రాజెక్టులను తెలంగాణ జెన్కో నామినేషన్ విధానంలో చేపడుతుందని, తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ పవర్ వాటాను పెంచేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. భారతదేశ విద్యుత్ రంగంలో, అంతర్రాష్ట్ర సహకారానికి హిమాచల్ ఒప్పందం గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో తోడ్పాటును అందించడమే కాకుండా హిమాచల్ ప్రదేశ్ హైడ్రో ఎలక్ట్రిక్ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు సహాయపడుతుందని తెలిపారు.

## తెలుగు వారి తొలి పండుగ ఉగాది



యుగానికి ఆది ఉగాది. మన ప్రకృతి లో ప్రతి సంవత్సరం వచ్చే మార్పు కారణంగా వచ్చే మొట్టమొదటి పండుగ ఉగాది. ఈ పండుగ అంటే ప్రతి ఒక్కరి మదిలో సంతోషం వెల్లివిరుస్తుంది. ఈ పండుగ సందర్భంగా పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని చోట్లా తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు అనే ఆరు రుచుల కలయిక గల పచ్చడిని తీసుకుంటారు.

అంతేకాదు ఈ ఉగాది పండుగ మన జీవితంలో ఎదురయ్యే మంచి, చెడు, కష్ట, సుఖాలను ఒకేలా స్వీకరించాలన్న సందేశాన్ని సైతం ఇస్తుంది. అలాగే ఉగాది పండుగ సందర్భంగా అనేక రకాల విషజ్వరాలు, ఆటలమ్మ, ఇంకా చాలా రకాల వ్యాధులు వ్యాపించే సమయమిది. అనేకమంది వీటిబారిన పడి మరణిస్తుంటారు. ఉగాది పండుగ వెనుక ఒక వైజ్ఞానిక అంశం కూడా ఉంది.

ఉగాది పచ్చడిని ఒక మహా ఔషధమని చాలా మంది పెద్దలు చెబుతుంటారు. ఈ ఉగాది పచ్చడిని ఈ పండు గ నుండి శ్రీరామనవమి వరకూ లేదా చైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ స్వీకరించాలి. అలా 9 లేదా 15 రోజుల పాటు ఈ ఉగాది పచ్చడి తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరిగి ఆ సంవత్సరం మొత్తం రోగాలనేవి దరిచేరవు. ఉగాది పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ, అమ్మోరు మొదలైన వ్యాధులను దగ్గరకు రానీయదు. మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉన్నది. ఇది కఫము, వాతము, పైత్యాలనే మూడు దోషాలను అదుపులో ఉంచుతుంది. ఉగాది పండుగ రోజున చేసే తైల అభ్యంగన స్నానం (శరీరానికి నువ్వుల నూనె పట్టించి నలుగుపిండితో చేసే స్నానం)శరీరంలో ఉన్న టాక్సిన్స్ (విషపదార్థాలు)ను తొలగిస్తుంది. ఉగాది కోసం ఇల్లు శుభ్రం చేస్తాం. పాత, చెత్త, పనికిరాని వస్తువులు తీసేస్తాం. ఇళ్ళు చక్కగా కడిగి, గడపకు మామిడి తోరణాలు, బంతిపూలు కడతాం. ఇలా శుభ్రం చేయడం వల్లన మన చుట్టూ ఉన్న వాతావరణం నుంచి మనకు రోగాలు సంక్రమించే అవకాశం తగ్గిపోతుంది. ఉగాది పండుగ సందర్భంగా మన ఇంటిని పూలతో అలంకరించుకుంటాం. బంతిపూలు యాంటీసెప్టిక్, యాంటీ బయోటిక్ లక్షణాలు కలిగినవి. మామిడి ఆకుల గురించి ఇందాకే చెప్పుకున్నాం. ఇవి ఇంట్లోకి రోగకారక క్రిములు రాకుండా ఆపేస్తాయి. ఉగాది స్నానం శరీరంలో మలినాలను, విషాలను తీసేస్తుంది.

మంగళ తోరణాలు బయట నుంచి వ్యాధులు సంక్రమించకుండా రక్షిస్తాయి. ఈ 15రోజుల పాటు నియమబద్ధ జీవితం, పవిత్రమైన, పుష్టికరమైన ఆహారం మంచి ఆరోగ్యానికి హేతువులు. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం ఉగాది పచ్చడిని 'నింబ కుసు మ భక్షణం', 'అశోకకళికా ప్రాశనం' అని పేర్లతో వ్యవహరించేవారు. రుతువులలో వచ్చే మార్పుల కారణంగా మనకు వచ్చే రోగాల నుండి రక్షణగా, ఈ పచ్చడిని ఔషధంగా తీసుకోవడం ఆనవాయితీగా మారింది. ఇంతకుముందు ఉగాది పచ్చడిలో ఉప్పు, వేపపువ్వు, చింతపండు, బెల్లం, మిరపకాయలు, మామిడికాయలు ఉపయోగించేవారు. బెల్లంలోని తీపి సుఖానికీ, లాభానికీ, ప్రేమకు విజయానికి సంకేతంగా భావిస్తారు. వేపలోని చేదు దు:ఖానికి, నష్టానికీ, ద్వేషానికీ, అపజయానికి సంకేతంగా భావిస్తారు. ఈ రెండు కలిపి తీసుకుంటే కష్టసుఖాలు, ప్రేమానురాగాలు, విజయం చేకూరాలని చెప్పడమే.

అద్దంకి ఆంజనేయులు,
9705829859

### ఉగాది వచ్చింది

మామిడి తోరణాలు
పసుపుపచ్చని వాకిళ్లు
యువతుల లంగావోణీలు
మా ఇల్లు పండుగ
పలకరింపుల లోగిళ్ళు
షడ్రుచుల మేళవింపు
చెడును విసర్జింపు

ప్రతి ఏడాది తానొస్తూ.. వస్తూ..
ఎన్నో ఊసులు మోసుకొస్తుంది
కోయిల గానాలతో,
ప్రకృతిని పులకరింపజేసే
సంగీతాన్ని వినిపిస్తుంది

వేపచెట్టు పూతను రాల్చుతూ
వెచ్చగా పలకరిస్తుంది
గడిచిన చేదైన జ్ఞాపకాలను
విసిగిస్తున్న వ్యాపకాలను వదిలేయ్ ...
వెనుదిరిగి పదేపదే చూడకు
తడిపేస్తున్న ఆలోచనలతో తల్లడిల్లక
నీలోని బద్ధకాన్ని వదిలి లే నిద్దుర...
బలవంతంగా బాగుపడమని చెప్పరెవ్వరు
నీకై నువ్వు లేవాలి నీ విజయాన్ని తట్టి లేపాలి

ప్రతి అడుగు నూతన ప్రారంభం కావాలి
వసంతం మారితే బ్రతుకులు మారవు
ఇంటిని అలంకరిస్తే పరిస్థితులు చక్కబడవు
ఉగాది వచ్చిందని సరదాలు కాదు
దగా చేసే.. నీ మనస్తత్వం మారాలి...
నిన్నటిలా రేపుండకూడదన్న అభిరుచుండాలి
నేటి నీ అడుగుల్లో స్థిరత్వముండాలి

వాసి జ్యోత్స్న,
9866843005



శ్రీకృష్ణదేవరాయ సాహిత్య, సాంస్కృతిక సేవా సమితి (ఒంగోలు) శనివారం నిర్వహించిన శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది కవితా మహోత్సవ వేడుకల్లో విశిష్ట సాహిత్యరంగ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న ప్రఖ్యాత కవి, విమర్శకుడు యువి రత్నం. కుర్రా ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, కుర్రా కోటి సూర్యమ్మ స్మారక సాహితీ పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త కప్పగంతుల మధుసూదన్ స్వీకరించారు. డాక్టర్ లంకా ప్రసన్న కుమార్ శర్మ, మెడబలిమి సాంబశివరావు, దన్నారపు మస్తాన్ రావు, సుంకర కల్యాణి, స్వర్ణ హర్షిత విశిష్ట పురస్కారాలు అందుకున్నారు.

## ప్రజావసరాలకు అనుగుణంగా లింక్ రోడ్లు



### భవిష్యత్ అవసరాలకు తగినట్లు విస్తరణ, నూతన రోడ్లు నిర్మించాలి
### హెచ్‌ఆర్‌డిసిఎల్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో ప్రజావసరాలకు అనుగుణంగా అనుసంధాన (లింక్) రోడ్ల నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సూచించారు. రాజధాని నగరంతో పాటు హెచ్‌ఎండిఎ పరిధిలో హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్‌ఆర్‌డిసిఎల్) ఆధ్వర్యంలో చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై ఐసిసిసిలో సిఎం రేవంత్‌రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెంచడం, ప్రజలు ఎటువంటి అవాంతరాలు లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణం ఉండాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఈ క్రమంలో విశాల ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అనుసంధాన రహదారుల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న రహదారుల విస్తరణ విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. వివిధ రహదారుల నిర్మాణం ద్వారా ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు వారికి సమయం కలిసి వచ్చేలా ఉండాలని, ఈ లక్ష్యంతోనే అదనపు భూసేకరణకు కొంత అధిక వ్యయమైనా వెనుకాడవద్దని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, సిఎం ప్రిన్సిపల్ కార్యదర్శులు వి.శేషాద్రి, చంద్రశేఖర్ రెడ్డి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పురపాలక, పట్టణభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ కార్మికుల భరోసాపై డాక్యుమెంటరీ



ప్రజాపక్షం/హైదరాబాద్: గల్ఫ్ కార్మిక కుటుంబాలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గల్ఫ్ భరోసాకు సంబంధించి ప్రవాసీ మిత్ర సంస్థ రూపొందించిన పోస్టర్, డాక్యుమెంటరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. గల్ఫ్ కార్మికుల సామాజిక భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన నేపథ్యంలో ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. కార్యక్రమంలో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, ప్రవాసీ మిత్ర ప్రతినిధులు మంద భీమ్ రెడ్డి, పి.సునీల్ కుమార్ రెడ్డి, చెన్నమనేని శ్రీనివాసరావు, పి.ఎల్.కే.రెడ్డి, కళ్యా ణ్ కుమార్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన

### మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/ఖమ్మం : ఉగాది పర్వదినం నాడు ఖమ్మం జిల్లాలో నూతన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.600 కోట్లు ఖర్చు చేసి ఆరునెలల వ్యవధిలో 1,500 క్యూసెక్కుల పరిమాణంతో రాజీవ్ కెనాల్ లింక్ కాలువను పూర్తి చేయడం జరిగిందన్నారు. సాగునీటి ఇబ్బందులు వచ్చినప్పుడు వైరా, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు మండలాలతో పాటు పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోని పంటలను కాపాడుకోవచ్చునన్నారు. భద్రాద్రి రామాలయ అభివృద్ధికి రూ. 34 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. భద్రాద్రి ఆలయానికి మహర్దశ రానుందని ఆయన తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో నడిచే మైన్స్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా మార్చామని జీయోలాజీకి సంబంధించి విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరగా సిఎం నిపుణులతో చర్చించి ఎర్త్ సైన్స్ విశ్వ విద్యాలయం ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం జరిగిందని త్వరలోనే ప్రభుత్వ ఉత్తర్వులు రానున్నాయన్నారు. ఖమ్మంజిల్లాలో అన్ని నియోజకవర్గాలను కవర్ చేస్తూ జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తుమ్మల తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయితే ఖమ్మంకు రింగ్ రోడ్డుగా ఉపయోగపడుతుందని ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు మూడేళ్లలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. గ్రానైట్ పరిశ్రమ మీద ఆధారపడే యువకులకు లాభం చేకూర్చేలా మార్గదర్శకాలు ఇచ్చిన ముఖ్యమంత్రికి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. పాత నేలకొండపల్లి రోడ్డుకు రూ.20 కోట్లు నిధులు మంజూరు చేడయం జరిగిందన్నారు. సన్న బియ్యానికి బోనస్ డబ్బులు చెల్లించడం జరిగిందని ఎవరికైనా రాకపోతే రైతులు అధికారులను సంప్రదించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపుకలెక్టర్‌పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు, నేషనల్ హైవే మేనేజర్ దివ్య, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పాల్గొన్నారు.















## వ్యసనం.. నైతిక వైఫల్యం కాదు!



నైతిక పతనాన్ని వ్యసనంగా పేర్కోవడం సహజం. మద్యం తాగడం నుంచి జూదం ఆడడం వరకూ ఎన్నో వ్యసనాలు ఉన్నాయి. వాటికి అలవాటుపడిన వారికి నైతికతగానీ, దృఢమైన దీక్షగానీ లేవని కితాబునివ్వడం చూస్తునే ఉంటాం. అయితే, ఇటీవల బ్రెయిన్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా జరిపిన అధ్యయనంలో వ్యసనం అనేది మెదడులోని సంక్లిష్టమైన న్యూరల్ సర్క్యూట్‌ను కలిగి ఉంటుందని స్పష్టమైంది. ఇది కోరిక, భావోద్వేగ నియంత్రణ, నిర్ణయం తీసుకోవడం వంటి అంశాలను ప్రభావితం చేస్తుందని వెల్లడించింది. ఈ అధ్యయన నివేదికను అనుసరించి, వ్యసనాన్ని నైతిక వైఫల్యంగా కాకుండా దీర్ఘకాలిక మెదడు పరిస్థితిగా పేర్కోవాలి. వ్యసనంలో మెదడు కీలక పాత్ర పోషిస్తుందని ఈ అధ్యయనం గుర్తించింది. ఇందుకు కారణమైన మెదడులోని మూడు కీలక ప్రాంతా లు, అంటే బేసల్ గాంగ్లియా, ఎక్స్‌టెండెడ్ అమిగ్డాలా, ప్రిఫ్రంటల్ కార్టెక్స్‌ను హైలైట్ చేసింది. బేసల్ గాంగ్లియా అనేది ఇది మెదడుకు ఆహారం, సామాజిక పరస్పర చర్య లేదా వ్యసనపరుడైన పదార్థాల నుండి ఆహ్లాదకరమైన కార్యకలాపాలను పునరావృతం చేయడాన్ని నేర్పుతుంది. ఇది ఆహ్లాదకరమైన ప్రవర్తనలను బలోపేతం చేయడానికి డోపమైన్, సెరోటోనిన్ వంటి న్యూరోట్రాన్స్‌మీటర్లతో పనిచేస్తుంది. కాగా, ఎక్స్‌టెండెడ్ అమిగ్డాలా పదార్థ వినియోగం ఆగిపోయినప్పుడు ఆందోళన, చిరాకు, అసౌకర్యాన్ని ప్రేరేపిస్తుంది. అంతేగాక, హాని పొంచి ఉందని తెలిసినప్పటికీ, సదరు వ్యసనాన్ని కొనసాగించేలా మనిషిని ప్రోత్సహిస్తుంది. ఇక మెదడులోని మూడో కీలక ప్రాంతమైన ప్రిఫ్రంటల్ కార్టెక్స్ అనేది వ్యసనం యొక్క ముఖ్యలక్షణమైన హానికరమైన ప్రభావాలను గుర్తిస్తుంది. అయినప్పటికీ, వాటి వినియోగం ఎందుకు కొనసాగుతున్నదో వివరిస్తుంది. నిర్ణయం తీసుకోవడం, సమయ నిర్వహణ, ప్రాధాన్యతను నిర్వహించే ప్రిఫ్రంటల్ కార్టెక్స్, త్రయాన్ని పూర్తి చేస్తుంది. కౌమారదశలో ఉన్నవారి మెదడు ఇంకా అభివృద్ధి చెందుతున్నందున, పదార్థ వినియోగానికి కీలకమైన 'ప్రమాదకర కాలం'గా మారుతుంది. ప్రేరణలను, నిర్ణయం తీసుకోవడాన్ని నియంత్రించే ప్రిఫ్రంటల్ కార్టెక్స్ అనేది చివరి వరకు పరిపక్వం చెందుతుంది. దీనివల్ల టీనేజర్లు వ్యసనానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వ్యసనానికి గల కారణాలు పరిశీలిస్తే, కొంతమంది వ్యక్తులు జన్యుపరంగా వ్యసనానికి ఎక్కువగా గురవుతున్నారని స్పష్టమవుతుంది. అదే విధంగా గాయం, ఒత్తిడి, మానసిక ఆరోగ్య రుగ్మతలు దుర్బలత్వాన్ని పెంచుతాయి. కుటుంబ చరిత్ర, తోటివారి ఒత్తిడి, సామాజిక, ఆర్థిక పరిస్థితులు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. వ్యసనం వల్ల కలిగే నిర్మాణాత్మక, జీవరసాయన మార్పులను గుర్తించడంలో ఎంఆర్‌ఐ వంటి బ్రెయిన్ ఇమేజింగ్ సహాయపడుతుంది. మెదడును తిరిగి కోలుకోవడానికి వీలుగా మార్చడంలో కాగ్నిటివ్‌బిహేవియరల్ థెరపీలు (సిబిటి), న్యూరోఫీడ్‌బ్యాక్ పద్ధతులు సహాయపడుతున్నాయి. మొత్తంమీద వ్యసనం అనేది నైతికతకు సంబంధించింది కాదని ఈ అధ్యయనం తేల్చిచెప్తున్నది.

## ఇనుప యుగం నాటి కళాఖండాలు..



'మెల్సన్‌బై హోర్డ్'గా పిలిచే లోహ (ఇనుప)యుగం నాటి 800 కంటే ఎక్కువ వస్తువులు లభించడం శాస్త్రవేత్తలకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. వాటిపై పరిశోధనలు ముమ్మ రం చేసిన పరిశోధకులు, చరిత్ర గురించిన మరింత విస్తారమైన సమాచారాన్ని సంపాదించేపనిలో పడ్డారు. బ్రిటన్‌లోని నార్త్ యార్క్‌షైర్ సమీపంలోని రెండు గంటల్లో మెటల్ డిటెక్టర్ పీటర్ హెడ్స్ ఈ వస్తువులను 2021లో కనుగొన్నాడు. అందులో సుమారు 2000 సంవత్సరాల క్రితం నాటి పురాతన కళాఖండాలు ఉన్నాయి. బొమ్మలు, బండ్ల పాక్షిక అవశేషాలు, ఉత్సవ ఈటెలు, పోనీ పట్టీలు, ఇనుప చక్రాలు ఇక్కడ లభించాయి. జీవితకాలంలో ఒకసారి మాత్రమే ఇలాంటి పురాతత్వ పరిశోధనకు అవసరమైన వస్తువులు లేదా కళాఖండాలు లభిస్తాయని దర్హమ్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ ఎమిలీ విలియమ్స్, ప్రొఫెసర్ టామ్ మూర్ వ్యాఖ్యానిస్తున్నారు. ఇవి ఏ కాలానికి చెందినవో గుర్తించడానికి శాస్త్రవేత్తలు పరిశోధనలు ముమ్మరం చేశారు.

## ఫలితం దక్కని ప్రయత్నం!



అమెరికాలోని ఫ్లోరిడాలో ఓ దొంగ ఎంతో కష్టపడి వజ్రాల దుద్దులు దొంగిలించాడుగానీ, ఫలితం దక్కలేదు. ఆర్లాండో పోలీస్ అధికారులు అతనిని ఒడిసి పట్టుకొని, పొట్టలో దాచిన చెవి కమ్మలను రాబట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఆర్లాండోలోని టిఫానీ అండ్ కంపెనీ స్టోర్స్‌కు ఓ దొంగ వెళ్లాడు. తనను తాను ఆర్లాండో మ్యాజిక్ బేస్ బాల్ జట్టుకు చెందిన ఒక ఆటగాడికి సన్నిహితుడిగా పరిచయం చేసుకున్నాడు. ఆ ఆటగాడు చెవికి పెట్టుకునేందుకు వజ్రాల కమ్మలు కావాలని చెప్పాడు. దీనితో గొప్ప బేరం దొరికిందని స్టోర్‌లోని సిబ్బంది అతనికి రాచమర్యాదలు చేశారు. ప్రత్యేకంగా ఒక గదిలో కూర్చోబెట్టి, వజ్రపు దుద్దులను ఎంపిక కోసం అతని ముందు ఉంచారు. వాటిని పరిశీలిస్తున్నట్టు నటించిన దొంగ, హఠాత్తుగా ఓ నాలుగు దుద్దులు తీసుకొని పలాయనం చిత్తగించాడు. షాపు యజమాని ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, సిసి ఫుటేజీ ఆధారంగా దొంగ పరారైన వాహనం నెంబర్‌ను తెలుసుకున్నారు. ముమ్మరంగా గాలించి, చివరికి ఒర్లాండ్‌కు సుమారు 550 కిలోమీటర్ల దూరంలో పట్టుకున్నారు. విచారణ సమయంలో, దుద్దులను మింగేశానని, పొట్టలో ఉన్న వాటిని ఎలా తీసుకుంటారనీ ఆ తెలివిమీరిన దొంగ ఎదురు ప్రశ్నించాడు. కానీ, పోలీసులు ఎక్స్‌రే తీయించి మరీ వాటిని గుర్తించారు. ఆసుపత్రికి తీసుకెళ్లి, శస్త్రచికిత్స చేయించి వాటిని వెలికితీశారు.

**బిఎస్ఎస్ మైత్రేయి**

## న్యాయవ్యవస్థే రక్ష

ప్రజాపక్షం
30-03-2025, ఆదివారం

నేటి రాజకీయ, సామాజిక, సాంస్కృతిక జీవితాల్లో మతం, కులం, భాష, ఆహారం, అలవాట్ల విషయంలో స్త్రీల దుస్తుల ధారణకు సంబంధించి నిందాపూర్వకమైన వ్యక్తీకరణలు ద్వేషాలు పెంచుతున్నాయి. సాంస్కృతిక జీవనంలో వ్యంగ్యంపట్ల అసహనం పెరుగుతున్నది. రాజకీయ నాయకుల చర్మం ఈ విషయం లో మరీ మొద్దుబారుతున్నది. పర్యవసానంగా చిత్రలేఖనం, అభినయం, వాక్చాతుర్యం రంగాల లో కళాకారుల్లో సృజనాత్మకత సవాళ్లు ఎదుర్కొంటున్నది. వ్యంగ్యాన్ని ఎంజాయ్ చేయలేనివారి అనుచరులైన మూర్ఖులు హింసాయుత దాడులు చేస్తున్నారు. ఫిర్యాదు చేయగానే పోలీసులు ఎటువంటి విచక్షణ, ప్రాథమిక పరిశీలన లేకుండా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి కవులు, కళాకారులను నిర్బంధంలోకి తీసుకుని వేధింపులకు గురిచేస్తున్నారు. పర్యవసానంగా, రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ హరించబడుతున్నది. కొన్ని సందర్భాల్లో న్యాయాధికారులు సైతం నిర్లక్ష్యభావంతో కావచ్చు, సర్వశక్తి సమన్వితంగా మారిన రాజకీయ ఒత్తిళ్లతో కావచ్చు విచక్షణారహితంగా తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారనేది స్పష్టం. అయితే కార్యనిర్వాహకవర్గం కర్కశంగా మారినప్పుడు పౌరుల ప్రాథమిక హక్కులు కాపాడగలిగింది న్యాయవ్యవస్థ ఒక్కటే.

గత దశాబ్దకాలంలో ప్రజాజీవనరంగాల్లో ద్వేషం, అసహనం పెచ్చరిల్లాయి. ఫ్రిడ్జ్‌లో ఆవు మాంసం దాచుకున్నారనే ఆరోపణ తో యుపిలో ఓ ముస్లిం ఇంటిపై దాడితో మొదలిడి గోరక్షణ పేరుతో జరుగుతున్న హత్యలు, అత్యాచారాలెన్నో! ఇక యోగి ఆదిత్యనాథ్ పాలనలో ఎక్కడ మత అల్లర్లు జరిగినా బుల్‌డోజర్లతో ముస్లింల ఇళ్లు, దుకాణాలు కూలగొట్టిస్తున్నాడు. ఆ ఆటవిక న్యాయం ఇతర బిజెపి రాష్ట్రాలకు కూడా పాకింది. అది అన్యాయం, చట్టవిరుద్ధం అని సుమోటోగా చెప్పిన కోర్టు లేదు. ఇటీవలి నాగపూర్ అల్లర్లలో కూడా ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నిందితుని ఇల్లు కూల్చాడు, దుండగుల నుంచి నష్టపరిహారం వసూలు చేస్తానన్నాడు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా, చట్ట పాలనలో ఉన్నామా లేక అరాచక శక్తుల ఆటవిక రాజ్యంలో ఉన్నామా! మతం గూర్చి, సనాతన ధర్మం గూర్చి, దేవుళ్ల గూర్చి కాస్త పేరు ప్రఖ్యాతులున్న ఏ వ్యక్తి అయినా ఎక్కడో ఏదైనా మాట్లాడితే వెంటనే పలు రాష్ట్రాల్లో అనేక కేసులు నమోదవుతాయి. అదే మిటయ్యా అంటే తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటారు. వారికేనా, ఇతరులకు లేవా మనోభావాలు! ఇటువంటివి ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న వేధింపు చర్యలు. ఇటువంటి కేసులు పెట్టేవారు ప్రధానంగా 'రాజభక్తులే'. తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని విమర్శించినందుకు ఆయనపై పెట్టిన కేసులను ఇటీవల కొట్టివేసిన సుప్రీంకోర్టు ఇకపై ఇటువంటి కేసులు పెట్టవద్దని ఆదేశించింది.

ఆ విధంగా భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడిన సుప్రీంకోర్టు తాజాగా మరో కేసులో కూడా ఒక ఎంపి – రచయిత రక్షణకు వచ్చింది. కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గరి తను రాసిన ఒక పద్యాన్ని వీడియో క్లిప్‌లో సోషల్ మీడియా లో అప్‌లోడ్ చేశాడు. ఆ 46 సెకనుల వీడియోలో ఆ రాజ్యసభ ఎంపి నడుస్తూ ఉంటే అతనిపై పూల జల్లు కురుస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆ పద్యం వినిపిస్తూ ఉంటుంది. ఆ పద్య పాదాల్లో కవ్వింపు భాష ఉందని, అది మత మనోభావాలను గాయపరచటంతోపాటు మత సముదాయాలను పరస్పరం మోహరింపజేస్తుందని ఎఫ్‌ఐఆర్ రిజిస్టర్ అయింది. న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓక, ఉజ్జల్ భుయాన్ ఏమన్నారంటే – "ఆ పద్యానికి మతం, కులం, కమ్యూనిటీ లేదా ఏదైనా ప్రత్యేక గ్రూపుతో ఎట్టి సంబంధం లేదు. అటువంటి కేసుల్లో ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసే ముందు పోలీసులు ముందుగా ఆ లిఖిత, ఉచ్ఛారణ పదాల అర్థం అవగాహన చేసుకోవాలి. ఆ పద్య పాదాలు వైషమ్యాన్ని, ద్వేషభావాలను లేదా శతృత్వాన్ని పెంపొందించవు" ఆ ఎంపిపై ఎఫ్‌ఐఆర్ కొట్టివేసింది. ఆ విధంగా ఆతని భావ ప్రకటన స్వేచ్ఛను న్యాయస్థానం కాపాడింది.

ఇక రెండో కేసు – స్థితిస్థాపక హాస్యకారుడు కునాల్ క్రమాపై ముంబయిలోని ఖార్ పోలీసులు రిజిస్టర్ చేసిన కేసు. ఆయన ముంబయిలో ఒక స్టార్ హోటల్ లాన్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక శిబిరంలో చేసిన హాస్య ప్రదర్శనలో రెండేళ్ల క్రితం మహారాష్ట్ర రాజకీయాలను ప్రస్తావిస్తూ శివసేనను చీల్చి బిజెపితో కలిసి ముఖ్యమంత్రి అయిన ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను 'ద్రోహి' అన్నాడు. దానిపై ఆగ్రహించిన శివసైనికులు ఆ శిబిరాన్ని ధ్వంసం చేసి నానాయాగీ చేశారు. పోలీసులు ఓ 20మంది దుండగులను అరెస్టు చేయగా కోర్టు వెంటనే బెయిలు ఇచ్చింది. శివసేన ఎంఎల్‌ఎ ముర్జీ పటేల్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి క్రమాకు సమన్‌లు జారీ చేశారు. పోలీసుముందు హాజరయ్యేందుకు సమయం కోరినా నిరాకరించారు. ఏక్‌నాథ్ షిండే, వ్యంగ్యాన్ని తాను తప్పుపట్టనని అంటూనే తన అనుయాయుల హింసను ఖండించలేదు. క్రమా థియేటర్ నిర్మాణానికి పర్మిషన్ ఉందా అని పోలీసులు వాకబు చేస్తున్నారు. మహారాష్ట్ర పోలీసుల సమన్‌లపై క్రమా మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా న్యాయమూర్తి సుందర్ మోహన్ ఏప్రిల్ 7వరకు తాత్కాలిక బెయిలు మంజూరు చేశారు. తాను 2021 నుంచి తమిళనాడులోని విల్లిపురం జిల్లాలో నివసిస్తున్నానని, ఖర్ పోలీసు సమన్‌లపై మహారాష్ట్ర వెళితే తనను అరెస్టు చేసి, శారీరకంగా హాని కలుగజేస్తారని భయపడుతున్నానని క్రమా తన పిటిషన్‌లో విన్నవించుకున్నాడు. తాత్కాలిక బెయిలు ద్వారా న్యాయమూర్తి హాస్యనటుడు కునాల్ క్రమాకు తాత్కాలిక ఊరట కలిగించాడు.

అయితే రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు నిర్నిబంధమైనవికావని, ఆ హక్కులకు సహేతుకమైన ఆంక్షలు ఉంటాయని మరిచిపోరాదు. అదే సమయంలో పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు, ప్రలోభాలకులోనై కొన్నిసార్లు సుమోటోగా, కొన్నిసార్లు అతి సాధారణ ఫిర్యాదులపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి వేధింపులకు పాల్పడరాదని గుర్తుంచుకోవాలి. అత్యధిక కేసుల్లో పోలీసులు కోర్టులనుండి ఛీవాట్లకు గురికావటం వారి అధికార దుర్వినియోగాన్ని కళ్లకు కడుతుంది.

# జిడిపి వృద్ధికీ...జీవనాభివృద్ధికి సంబంధం ఏదీ?

**డాక్టర్ గ్యాన్ పాథక్**

ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం, రాష్ట్రాల్లోని బిజెపి ప్రభుత్వాలు ఇప్పుడు "అభివృద్ధి చెందిన భారత్", "అభివృద్ధి చెందిన ఢిల్లీ", "అభివృద్ధి చెందిన మధ్యప్రదేశ్" వగైరా బడ్జెట్లు సమర్పిస్తున్నాయి. ఇది ప్రజల్ని హిప్నటైజ్ చేసే టెక్నిక్. బిజెపి వారి పరిపాలన కింద దేశం నిజంగా అభివృద్ధి చెందినట్లు ప్రజల్లో భ్రమలు కల్పించటం ఈ ప్రచారం ముఖ్యోద్దేశం. "ఇండియా జిడిపి 10 సంవత్సరాల్లో 100శాతం వృద్ధి ప్రపంచానికి దిగ్భ్రమగొలుపుతోంది" అన్నది తాజా ప్రచారం. ఇది డంబాచారం, దగాకోరు ప్రచారం. వాస్తవాలను మరుగుపరిచే యత్నం. ప్రపంచంలో పేదలు అతిపెద్ద సంఖ్యలో భారత్‌లోనే ఉన్నారు. జిడిపి వృద్ధిరేటు కొద్దిమంది సంపన్నులకు భారీగా లబ్ది చేకూర్చుతోంది. ప్రజల్లో మెజారిటీని పేదరికంలో ఉంచుతున్నది. సంపద అసమానతలో భారత్ ప్రపంచంలో దారుణంగా 7వ స్థానంలో ఉంది. అసమానతల పెరుగుదలను ఇది సూచిస్తోంది.

2015లో 2.1 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారత్ ఆర్థిక వ్యవస్థ 2025లో 4.3 ట్రిలియన్ డాలర్లకు చేరిందన్నది తాజా వార్త. ఇది ప్రచురణకు తగిన వార్త. అయితే ఇందులో ఆలోచించదగింది ఏమిటన్నది మిలియన్ డాలర్ ప్రశ్న. అనేకమంది తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. 10 సంవత్సరాల్లో జిడిపి రెట్టింపు ద్వారా భారత్ 'చరిత్రాత్మక మైలురాయి' చేరిందన్నారు. త్వరలోనే జపాన్ ఆర్థిక వ్యవస్థను అధిగమిస్తుంది, 2027లో జర్మనీని మించిపోయి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందంటున్నారు. అమెరికా, చైనా మొదటి రెండు స్థానాల్లో ఉంటాయి. తినటానికి తిండిలేని 80 కోట్లమందిని, మంచి ఆరోగ్యంతో బతికేందుకు అవసరమైన పౌష్టికాహారం లేని 97కోట్లమంది ప్రజలను హిప్నటైజ్ చేసే ప్రయత్నం ఇది. నరేంద్రమోదీ అభివృద్ధి విధానం, జిడిపి వృద్ధిరేటు అపూర్వమైన వేగంతో అసమానతను పెంచుతున్నప్పుడు జిడిపి వృద్ధిరేటు పెరుగుదల ఆ అభాగ్యులకు ఏమైనా ప్రయోజనం చేకూర్చుతుందా? జిడిపి వృద్ధిరేటు ఆ విధంగా పెరిగినా మెజారిటీ ప్రజల నిజ ఆదాయం పడిపోవటం తీవ్రంగా ఆందోళన చెందాల్సిన విషయం కాదా?

భారతదేశ జిడిపి వృద్ధి వార్తపై మనం ఏమి ఆలోచించాలి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) విడుదల చేసిన డేటాను లోతుగా పరిశీలించుదాం. ఏ డేటా అయినా సరైన దిశలో నివేదించాలి, ఇతర వాస్తవాలను దాచిపెట్టరాదు, ఇతర పచ్చి నిజాలను విస్మరించేటట్లు మనల్ని పక్కదారి పట్టించరాదు.

వార్తలోని కొత్తదనం ఏమంటే, 2025లో కొద్ది మాసాల్లో భారతదేశం జపాన్ జిడిపిని అధిగమించనుంది, 2027లో జర్మనీని మించుతుంది. జపాన్ జిడిపి ఇప్పుడు 4.4 ట్రిలియన్ డాలర్లు; భారత్ జిడిపి 4.3 ట్రిలియన్ డాలర్లు. భారత్ కొద్దిమాసాల్లో జపాన్ జిడిపిని అధిగమించినా అది భారతీయుల జీవన పరిస్థితిని గణనీయంగా మార్చదు. ప్రపంచబ్యాంక్ జిఎన్‌ఐ ప్రకారం భారత్‌లో తలసరి ఆదాయం పిపిపి ప్రాతిపదికపై (2023) 10,020 డాలర్లు. కాగా జపాన్ తలసరి ఆదాయం 33,766 డాలర్లు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ జపాన్‌ను మించినా, జపాన్ తలసరి ఆదాయం భారతదేశం కన్నా మూడు రెట్లు ఉంటుందని దీని అర్థం. జపాన్‌లాగా భారత్ తన ప్రజల ఆదాయం పెంచటానికి ఏదైనా చేయాలి. 80 కోట్లమందికి ఉచిత రేషన్ ఇస్తూ, 97కోట్లమందికి పౌష్టికాహారం అందని స్థితిలో భారత్ తన సామాన్య ప్రజల నిజ ఆదాయాన్ని నిరాకరించటం కొనసాగించరాదు. జిడిపి వృద్ధి గూర్చిన టాంటాం ధ్వనిలో అభాగ్యుల వాణి మునిగిపోకూడదు.

> **జర్మనీ జిడిపి 4.9 ట్రిలియన్ డాలర్లు. 2027 రెండవ త్రైమాసికంలో భారత్ జర్మనీని అధిగమించుతుంది. భారత్ ప్రస్తుత వృద్ధిరేటు ప్రకారం ప్రతి 1.5 సంవత్సరాలకు తన జిడిపికి 1 ట్రిలియన్ డాలర్లు జతచేస్తుంది. ప్రపంచ బ్యాంక్ ప్రకారం 2023లో జర్మనీ తలసరి ఆదాయం 73,180 డాలర్లు. ఇది భారత్ తలసరి ఆదాయానికి ఏడు రెట్లు. జిడిపి వృద్ధి రేటులో భారత్ జర్మనీని మించిపోయినా భారత్‌లోని సామాన్యుల తలసరి ఆదాయం జర్మనీ ప్రజలకన్నా ఎంతో తక్కువలోనే ఉంటుంది.**

ఇక జర్మనీ విషయానికొస్తే, జర్మనీ జిడిపి 4.9 ట్రిలియన్ డాలర్లు. 2027 రెండవ త్రైమాసికంలో భారత్ జర్మనీని అధిగమించుతుంది. భారత్ ప్రస్తుత వృద్ధిరేటు ప్రకారం ప్రతి 1.5 సంవత్సరాలకు తన జిడిపికి 1 ట్రిలియన్ డాలర్లు జతచేస్తుంది. ప్రపంచ బ్యాంక్ ప్రకారం 2023లో జర్మనీ తలసరి ఆదాయం 73,180 డాలర్లు. ఇది భారత్ తలసరి ఆదాయానికి ఏడు రెట్లు. జిడిపి వృద్ధి రేటులో భారత్ జర్మనీని మించిపోయినా భారత్‌లోని సామాన్యుల తలసరి ఆదాయం జర్మనీ ప్రజలకన్నా ఎంతో తక్కువలోనే ఉంటుంది.

భారత్ 2027లో ప్రపంచంలో మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుందనుకున్నా, దాని అర్థమేమిటి? సంఖ్యల్లో చూదాం. అమెరికా ఆర్థిక వ్యవస్థ 30.3 ట్రిలియన్ డాలర్లు. చైనా ఆర్థిక వ్యవస్థ 19.5 ట్రిలియన్ డాలర్లు. దీని అర్థం చైనా ఆర్థిక వ్యవస్థ భారత్ కన్నా 5 రెట్లుకు కొంచెం తక్కువ; అమెరికా ఆర్థిక వ్యవస్థ సుమారు 7.5రెట్లు.

ప్రపంచ బ్యాంక్ ప్రకారం చైనాలో తలసరి ఆదాయం 24,360 డాలర్లు, అమెరికా తలసరి ఆదాయం 82,340డాలర్లు. అవి భారత్ తలసరి ఆదాయం కన్నా వరుసగా 2.5, 8 రెట్లు. భారతదేశం గత 10 సంవత్సరాల్లో తన జిడిపిని రెట్టింపు చేసుకున్నా, అది ప్రపంచంలోని ఐదు అగ్ర ఆర్థిక వ్యవస్థలకు ఎంతో దూరంలో ఉంది.

మరో విషయం, ప్రపంచంలోని అతిపెద్ద ఐదు ఆర్థిక వ్యవస్థలో లేని అనేక దేశాలు మెరుగైన తలసరి ఆదాయం కలిగివున్న విషయాన్ని గమనించాలి. ఉదాహరణకు, కెనడాను తీసుకుందాం. దాని తలసరి ఆదాయం 53,431 డాలర్లు. అంటే భారత్ కన్నా ఐదు రెట్లు. అప్పుడు మెరుగైన జీవితం ఎవరిది? భారతీయులదా, కెనడియన్‌లదా? ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కెనడా స్థానం 9 కాగా భారత్ 5లో ఉంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్‌లో జరుగుతున్నట్లుగా, ప్రజల నిజవేతనం పెరగనిదే ఆర్థిక వ్యవస్థ పరిమాణం వల్ల ప్రయోజనం లేదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అది కెనడాలాగా ప్రజల నిజ ఆదాయం (కొద్దిమంది సంపన్నులది కాదు) పెంచవచ్చు. భారత్ ఆర్థిక వ్యవస్థ కెనడాకన్నా పెద్దదిగా ఉన్నప్పటికీ ఆ పనిచేయటానికి మోదీని నిరోధిస్తున్నదేమిటి?

చైనా జిడిపితో పోల్చటానికి భారతదేశ ప్రస్తుత పరిణామం ఆర్థిక వ్యవస్థతో మరో మూడు భారత్‌లను కలపాలి. అమెరికాతో పోల్చాలంటే 6 భారత్‌లను జతచేయాలి. అందువల్ల, భారత్ ఆర్థిక వ్యవస్థ పరిణామం, తలసరి ఆదాయం రెండింటి విషయంలోనూ క్షేత్రస్థాయిలోని వాస్తవికతను ఎదుర్కోవాలి.

యుఎన్‌డిపి గ్లోబల్ మల్టీడైమెన్షనల్ దారిద్ర్య సూచీ (2024)ని చూదాం. దాని ప్రకారం దారిద్ర్యరేఖకు కింద అతిపెద్ద సంఖ్యలో ప్రజలు నివసిస్తున్న ఐదు దేశాలు : భారత్ (234 మిలియన్‌లు), – ఇది మానవాభివృద్ధి సూచీ (హెచ్‌డిఐ)లో మధ్యస్థాయి; పాకిస్థాన్ (93 మిలియన్‌లు), ఇథియోపియా (86 మిలియన్‌లు), నైజీరియా (74 మిలియన్‌లు), డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (66 మిలియన్‌లు). ఇవన్నీ హెచ్‌డిఐలో తక్కువస్థాయిలో ఉన్నాయి. ఈ ఐదు దేశాల్లో కలిపి ప్రపంచంలోని 110 కోట్ల పేద ప్రజల్లో దాదాపు సగం (48.1 శాతం) ఉన్నారు. అటువంటప్పుడు, ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతున్నామని భారత్ చంకలు చరుచుకోవటం వల్ల ప్రయోజనమేముంది?

సంపద అసమానత విషయంలో 2023 జినీ సూచీలో భారత్ స్కోరు 73. అట్టడుగున్న ఆరు – దక్షిణాఫ్రికా 82, బ్రెజిల్ 81, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 77, సౌదీ అరేబియా 77, స్వీడన్ 75, అమెరికా 75. భారత్ పరిస్థితి శీఘ్రంగా క్షీణిస్తున్నది – 2008లో దాని స్కోర్ 62.

భారతదేశం 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా శీఘ్రంగా వృద్ధి చెందుతున్నది – అయితే పేదరికంలో ప్రపంచంలో అతి ఎక్కువ, సంపద అసమానతలో 7వ స్థానం అనేది టాగ్‌లైన్. అందువల్ల ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో జిడిపి ఏ దిశలో వృద్ధి చెందుతున్నదో — తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం.

(ఐపిఎ సర్వీస్)

# దక్షిణాది సందేహాలకు కొన్ని పరిష్కారాలు




గత శనివారం తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె.స్టాలిన్ అధ్యక్షతన చెన్నైలో జరిగిన జెఎసి సమావేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పు నర్విభజనను మరో పాతికేళ్ళు ఆపేయాలని విపక్షాలు కోరాయి. ఈ సమావేశానికి తెలంగాణ, కేరళ, పంజాబ్ ముఖ్యమంత్రులు, కర్నాటక ఉపముఖ్యమంత్రి, ఇతర ప్రతిపక్షపార్టీల నాయకులు హాజరయ్యారు. జెఎసి భేటీలో జనాభా ప్రాతిపదికన లోక్‌సభ పునర్విభజనతో జనాభా నియంత్రించిన రాష్ట్రాలకు ముఖ్యంగా దక్షిణ భారత రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై లోతుగా చర్చించడం జరిగింది. అదే ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాదివాసులు దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులయ్యే ఆస్కారముందని, దీనికి ప్రజలను చైతన్యపరిచేందుకు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళేందుకు పలు నిర్ణయాలు తీసుకోబడ్డాయి. తదుపరి జెఎసి సమావేశాన్ని వచ్చే నెలలో హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు వచ్చారు. ఆయన చెన్నై నుంచి వచ్చిన తరువాత శాసనసభ బడ్జెట్ సమావేశాల చివరి రోజున గురువారం నాడు లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా సీట్ల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543నే కొనసాగించాలని ప్రతిపాదించిన తీర్మానాన్ని శాసనసభ ఆమోదించింది.

**విచిత్ర పరిస్థితులు :** ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ వ్యవస్థ పరిణతి చెందుతూ ఉండడం, అనుభవాలు పొందుతుండడంతో అనేక కొత్త అంశాలు ముందుకు వస్తున్నాయి. ప్రజాస్వామ్యం అంటేనే పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం. అందులో ప్రతి ఒక్కరి ఓటుకు విలువ ఉంటుంది. జనాభా పెరిగినప్పుడు అందుకు అనుకూలంగా నియోజకవర్గాలు కూడా పెరగాల్సిందే. ఇప్పుడున్న సంఖ్యలోనే నియోజకవర్గాలను కొనసాగిస్తే కొన్ని లోక్‌సభ స్థానాలలో ముఖ్యంగా ఉత్తర భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల స్థానాలలో జనాభా 40 లక్షలు నుంచి 50 లక్షల వరకూ దాటే అవకాశం లేకపోలేదు. ఒక పార్లమెంటు సభ్యుడికి అంతమంది జనాభాకు ప్రాతినిధ్యం వహించడం కష్టంగానే ఉంటుంది. అదే సమయంలో జనాభాకు అనుగుణంగా లోక్‌సభ స్థానాలు పెంచాలంటే అది 800 లేదా 1000 స్థానాలకు చేరుకొని, పార్లమెంటు సమావేశాల నిర్వహణ సైతం కష్టమయ్యే అవకాశం ఉంటుంది. ఇది నిర్వహణకు సంబంధించిన అంశం. మరో వైపు దక్షిణాది రాష్ట్రాల విషయానికొస్తే, ఇక్కడ జనాభా నియంత్రణ నినాదాన్ని తూచా తప్పకుండా పాటించి జనాభా తరుగుదల ను ఎదుర్కొంటున్నాయి. ఆ ప్రభావం నియోజకవర్గాల పునర్విభజనపై పడి లోక్‌సభ స్థానాలు కోల్పోయే పరిస్థితి తలెత్తుతోంది. అంతేకాకుండా ప్రణాళికాబద్ధంగా జనాభా నియంత్రణతో ఆర్థిక అభివృద్ధి సాధిస్తూ దేశ జిడిపికి తమ జనాభా లేదా విస్తీర్ణ శాతం కంటే ఎక్కువ నిధులను సమకూరుస్తూ, ఉత్తరాదిలో వెనుకబడిన అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలకు నిధుల ద్వారా చేయూతనిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం విషయంలో అన్యాయం జరుగుతోంది. అటు ప్రాతినిధ్యంలో, ఇటు నిధుల విషయంలో దక్షిణాది రాష్ట్రాలు వివక్షతకు గురవుతున్నాయి. విచిత్రం ఏమిటంటే గతంలో వెనుకబడిన రాష్ట్రాలు, ప్రాంతాలకు అధిక నిధులు ఇవ్వాలని డిమాండ్ ఉండేది. అందుకు అనుగుణంగా బ్యాక్‌వర్డ్ రీజియన్ గ్రాంట్స్ ఫండ్(బిఆర్‌జిఎఫ్) కింద నిధులను కూడా ఇస్తున్నారు. ఇప్పుడు అధిక అభివృద్ధి జరుగుతున్న రాష్ట్రాలు(ప్రధానంగా దక్షిణాది) తాము మరింత అభివృద్ధి చెందాలంటే, తమకు తాము కేంద్రానికి ఇస్తున్న పన్నుల్లో మరింత వాటా కావాలని కోరుతున్నాయి. అలా ఇస్తే మరిం త అభివృద్ధికి ఊతమిచ్చి, జిడిపికి తమ వంతుగా మరింత అందించగలమని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఇది కూడా సమంజసమే.

**రాజకీయాలకు తావివ్వొద్దు :** ఇప్పటికే చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు అమలులోకి రావాల్సి ఉంది . అలాగే తమ జనాభా కు తగిన ప్రాతినిధ్యం చట్టసభల్లో ఉండాలని, అందుకు చట్టసభల్లో రిజర్వేషన్లు కావాలని దేశవ్యాప్తంగా బిసిలు ఉద్యమిస్తున్నారు. డీలిమిటేషన్ జరిగితే తమ ప్రాతినిధ్యం తగ్గి దేశ రాజకీయ ముఖచిత్రంలో, అలాగే నిధుల కేటాయింపులు ప్రాధాన్యత కోల్పోతామని ఆందోళనలు దక్షిణాది ప్రజల్లో ఉన్నాయి. చట్ట సభల్లో ప్రజల భాగస్వామ్యం పెరగాలంటే చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం, బిసిలకు సరైన ప్రాతినిధ్యం, వివిధ ప్రాంతాలు అస్తిత్వాల ప్రాతినిధ్యం ఉండాల్సి ఉంది. ఎస్‌సి,ఎస్‌టిలకు చట్టబద్ధంగా చట్టసభల్లో రిజర్వేషన్ ఉన్నందున ఆ వర్గాలకు పెద్దగా ఇబ్బంది ఉండబోదు. వీటన్నిటికీ సరైన పరిష్కారం లభించాలంటే అసలు కేంద్ర ప్రభుత్వం మనసులో ఏముందో బయటికి చెప్పాలి. జాతీయస్థాయిలో ప్రధాన ప్రతిపక్షపార్టీగా ఉన్న కాంగ్రెస్‌కు చెందిన దక్షిణాది ముఖ్యమంత్రులు, నాయకులు జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయి. అఖిల భారత కాంగ్రెస్ అధికారిక వైఖరి ఇంకా వెల్లడి కాలేదు. ఈ అంశంపై ఆ పార్టీ అంతర్గత కమిటీ వేసుకుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య భాగస్వామ్యానికి సంబంధించిన ఇంతటి కీలక అంశంపై విస్తృత చర్చలు అన్ని వర్గాల అభిప్రాయం వివేచనతో కూడిన మేథోమదనం అవసరం. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం ఆలస్యం చేయకుండా దక్షిణాది రాష్ట్రాల అనుమానాలు, జనగణన, కుల గణన, డీలిమిటేషన్ వంటి అంశాలపై తమ ప్రతిపాదనలను ప్రజల ముందు ఉంచాలి. అలాగే అన్ని వర్గాలకు చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం, కొత్తగా తలెత్తుతున్న అంశాలపై పరిష్కారా న్ని కనుగొనేందుకు వివిధ దేశాలలోని పాలన, చట్టసభల వ్యవస్థలను అధ్యయనం చేసేందుకు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రంగంలోని నిపుణులు, మేధావులు నిష్ణాతులు, రాజకీయవేత్తలతో ఒక కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. శీఘ్రగతిన మంచి సిఫార్సులతో నివేదిక ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావివ్వకూడదు. ఎన్ని చేసినా ఎన్నికల్లో ధన ప్రభావం విపరీతంగా పెరిగి సామాన్యుడు పోటీ చేయలేని పరిస్థితి బాధాకరమే. ఇందుకు పరిష్కారంగా దామాషా పద్ధతిలో చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలనే అంశం కూడా గత కొన్నేళ్లుగా చర్చలో ఉంది. అలాగే ప్రభుత్వమే ఎన్నికల ఖర్చు చేయాలనే ఇంద్రజిత్ గుప్తా పార్లమెంటరీ కమిటీ సిఫార్సు ఉండనే ఉంది. ఇవి ప్రస్తుత పరిస్థితులకు ఎంతవరకు సరిపడుతుందోచర్చించాలి.

> అన్ని వర్గాలకు చట్టసభల్లో సముచి త ప్రాతినిధ్యం, కొత్తగా తలెత్తుతున్న అంశాలపై పరిష్కారాన్ని కనుగొనేందుకు వివిధ దేశాలలోని పాలన, చట్టసభల వ్యవస్థలను అధ్యయనం చేసేందుకు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రంగంలోని నిపుణులు, మేధావులు నిష్ణాతులు, రాజకీయవేత్తలతో ఒక కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. శీఘ్రగతిన మంచి సిఫార్సులతో నివేదిక ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావివ్వకూడదు. ఎన్ని చేసినా ఎన్నికల్లో ధన ప్రభావం విపరీతంగా పెరిగి సామాన్యుడు పోటీ చేయలేని పరిస్థితి బాధాకరమే. ఇందుకు పరిష్కారంగా దామాషా పద్ధతిలో చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలనే అంశం కూడా గత కొన్నేళ్లుగా చర్చలో ఉంది.

**దక్షిణాది ఆందోళనలకు కొన్ని సూచనలు :** దక్షిణాది ఆందోళనలను పరిగణనలోనికి తీసుకుని కొన్ని ప్రతిపాదనలను పరిశీలించవచ్చు. కేంద్ర ప్రభుత్వ మాట విని దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రించినందుకు, ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగే ఒక లోక్‌సభ స్థానానికి బదులుగా దక్షిణాది రాష్ట్రాలకు ప్రోత్సాహకంగా ఒక టిన్నర లేదా రెండు లోక్‌సభ స్థానాలను పెంచాలి. తమ విస్తీర్ణం, ప్రాతినిధ్యం కంటే దేశ జిడిపికి అధిక శాతం (36 శాతం) తమ వంతుగా దోహదపడుతున్నందుకు కూడా సీట్లు పెంచే విషయంలో ఆర్థిక అంశాన్ని ఒక ప్రాతిపదికగా పరిశీలించాలని దక్షిణ రాష్ట్రాల ప్రతిపాదన కూడా ఉంది. ఆర్థికాంశాలను లోక్‌సభ స్థానాలతో ముడిపెట్టడం వల్ల చిన్న రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు నష్టపోయే అవకాశం ఉంది. కాబట్టి నిధుల గురించి ఇతర మెకానిజాన్ని పరిశీలించాలి. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇచ్చిన మాదిరిగానే ప్రగతిపథంలో ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు అభివృద్ధికి మరింత ఊతమిచ్చేందుకు ప్రత్యేక నిధులను కేటాయించాలి. అలాగే దక్షిణ భారత ప్రజలకు భరోసానిచ్చేందుకు లోక్‌సభ శీతాకాల సమావేశాలను ఒక దక్షిణాది రాష్ట్రంలోని ప్రధాన నగరంలో నిర్వహించడం, మరో దక్షిణాది రాష్ట్రంలో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవచ్చు. దక్షిణ భారత రాష్ట్ర వాసులకు కూడా కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వరంగ ఉద్యోగాలలో సరైన ప్రాతినిధ్యం ఉండేలా చూడాలి. రాష్ట్రాలకు నిధుల సమస్య పరిష్కారం కోసం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వచ్చే 16వ ఆర్థిక కమిషన్ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు ట్యాక్స్ డెవెల్యూషన్‌లో సమానంగా 50:50 నిష్పత్తిలో సిఫార్సు చేయాలి.

**సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయడమే కారణం :** అసలు దక్షిణాది రాష్ట్రాల ఆందోళనకు అసలు మూలాన్ని లోతుగా చూస్తే కేంద్రంలో ఉన్న ప్రభుత్వం రాజ్యాంగం ప్రవచించిన సమాఖ్య స్ఫూర్తిని తుంగలో తొక్కడమే కారణం. భిన్నత్వంలో ఏకత్వంగా ఉండే భారతదేశాన్ని ఒక గొడుగు కింద ఉంచేందుకు సమాఖ్య విధానం దోహదం చేస్తోంది. అలా కాకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వన్ నేషన్,వన్ ఎలక్షన్, వన్ నేషన్ వన్ లాంగ్వేజ్, వన్ నేషన్ వన్ ట్యాక్స్(జిఎస్‌టి) వంటి ఏకశిలా వ్యవస్థను బలవంతంగా దేశ పౌరులపై రుద్దుతోంది. నూతన జాతీయ విద్యా విధానంలో దక్షిణాది రాష్ట్రాలపై హిందీని బలవంతంగా రుద్దడం కూడా ఈకోవలోకి వస్తుంది. హిందీని నేర్చుకోవడంలో తప్పులేదు. కానీ, కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం ఉద్దేశ్యపూరితంగా ఉంది. దక్షిణాది రాష్ట్రాల సంస్కృతి, భాష, భావాలకు పాతర వేసి, ఒకే భాష, ఒకే సంస్కృతి నిదేశ వ్యాప్తం చేసే కుట్ర ఇందులో కనపడుతుంది. బిజెపి వచ్చిన తరువాతే సమాఖ్య స్ఫూర్తికి చిహ్నంగా ఉండే వ్యవస్థలను క్రమంగా కనుమరుగవడమో, నిష్క్రియగా మారడమో కనపడుతోంది. అందులో భాగమే ప్రణాళికా సంఘం రద్దు. నేషనల్ డెవెలప్‌మెంట్ కౌన్సిల్ సమావేశాలు జరగకపోవడం వంటివి ఉన్నాయి. ప్రస్తుతం దేశం ముందున్న మెజార్టీ సవాళ్లు, సమస్యలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కేంద్రీకృత విధానమే కారణం. కాబట్టి రాజ్యాంగ నిర్మాతలు సూచించిన సమాఖ్య విధానాన్ని బలోపేతం చేయడం ద్వారా దేశం ఎదుట ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఇందుకు అధికార వికేంద్రీకరణ అత్యంత ప్రధానమైంది. కేంద్రం నుంచి అధికారాలు, హక్కుల వికేంద్రీకరణను రాష్ట్రాలు ఏ విధంగా కోరుకుంటున్నాయో, రాష్ట్రాలు సైతం స్థానిక సంస్థలకు అదే విధంగా అధికారాలు, హక్కులను వికేంద్రీకరించాలి.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్రజలకు సిఎం రేవంత్‌రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నేటి నుంచి శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని, ధర్మబద్ధమైన కోరికలు నెరవేరాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి అభిలాషించారు. ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. ఈ ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి, సంక్షేమ పథకాల అమల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటి చెప్పేలా ప్రతి ఒక్కరు ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సిఎం పిలుపునిచ్చారు.

# శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

### అధికారులు కట్టుదిట్టమైన చర్యలు: డిజిపి డాక్టర్ జితేందర్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉగాది, రంజాన్ పండుగలు వరుసగా రావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు డిజిపి డాక్టర్ జితేందర్ తెలిపారు. ప్రజలందరు శాంతియుతంగా, సంతోషంగా ఈ రెండు పండగలు జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా చేపట్టవలసిన భద్రతా ఏర్పాట్లు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి డిజిపి అన్ని జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు. ఈ సమావేశంలో అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ, రాష్టరంలో సమస్యాత్మకమైన, సున్నితమైన ప్రదేశాలు ఉన్నాయని, ఉగాది ,రంజాన్ వేడుకల సమయంలో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన



చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొనే సామూహిక ప్రార్థనల వంటి కార్యక్రమాల బందోబస్తు సమయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని, ఇప్పటికే అవసరమైన అదనపు పోలీసు బలగాలను కూడా తరలించడం జరిగిందన్నారు. అధికారులు తమ పరిధిలో శాంతి మతసామరస్యానికి కృషి చేస్తున్న మతపెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని, వారి సహకారంతో వేడుకల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు శాంతియుతంగా, సంతోషంగా తమ పండుగలు జరుపుకోవాలని, తమ చర్యల ద్వారా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసులతో సహకరించాలని తెలిపారు. అన్ని ప్రముఖ మసీదుల ప్రాంగణాల్లో వాహనాల నంబర్ ప్లేట్ల చెకింగ్, పత్రాల చెకింగ్ నిర్వహించాలని, అవసరమైన ప్రదేశాల్లో బాంబు తనిఖీ బృందాల ద్వారా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కల్లోలాలు రెచ్చగొట్టే పాత నేరస్తుల మీద నిఘా వేసి ఉంచాలని, వారు ఎటువంటి నేరాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లు చేసే సందర్భంలో తగిన సమర్థవంతమైన అధికారులకు విధులు అప్పగించాలని, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో సిసిటివిల పనితీరును పరిశీలిస్తూ ఉండాలని సూచించారు.

# హైదరాబాద్ మెట్రో వేళల్లో మార్పులు

### మెట్రో రైలు ఎం.డి ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చోటు చేసుకున్నాయని మెట్రో ఎం.డి ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం రాత్రి 11 గంటల వరకు నడుస్తున్న మెట్రో రైలు సేవలు, ఏప్రిల్ 1వ తేదీ నుంచి రాత్రి 11.45 గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ మారిన వేళలు సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే అమల్లో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. టెర్మినల్ స్టేషన్ల నుంచి ఆదివారం మొదటి రైలు ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. నగర రవాణాలో అగ్రగామిగా ఉన్న మెట్రో ఆవిష్కరణ, సామర్థ్యం, అవకాశాలు అందించటం ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు కల్పించడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఉగాది సందర్భంగా మెట్రో రైలు సమయాలను పొడి



గిస్తూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి ఇప్పుడు ఈ స్థితికి మెట్రో వచ్చిందన్నారు. ఎల్ అండ్ టి చేపట్టిన ప్రతి ప్రాజెక్టు విజయవంతంగా ముందుకు వెళుతుందన్నారు. మెట్రో ఫెస్ట్, మెట్రో మెడ్లీ, ఆర్ట్ ఫెస్ట్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను తమ రవాణా వ్యవస్థలో చేర్చడం ద్వారా, ప్రజా రవాణా వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడంలో తాము కీలక పాత్ర పోషిస్తున్నామని అన్నారు. ప్రతి 3 నుంచి 6 నిమిషాలకోసారి మెట్రో రైలు వస్తుండటంతో ప్రయాణికులు పెద్ద ఎత్తున వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. మెట్రో రైలు సౌకర్యవంతమైన ప్రయాణమని ఎల్ అండ్ టి మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ ఎండి, సిఈఓ కెవిబి రెడ్డి అన్నారు. టి సవారీ యాప్, ప్రయాణికుల కోసం వెబ్‌సైట్‌ను ప్రారంభించడం ద్వారా హైదరాబాద్ మెట్రోను డిజిటల్‌గా సుసంపన్నమైన రవాణా వ్యవస్థగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఏప్రిల్ 2024లో ప్రారంభమైన సూపర్ సేవర్ హాలిడే ఆఫర్, ఆఫ్‌పీక్ వేళల్లో స్మార్ట్ కార్డులపై ఇచ్చే తగ్గింపు మార్చి 31వ తేదీతో ముగియనుంది. ఈ ఆఫర్‌తో 20 ట్రిప్పులకు డబ్బులు చెల్లించి 30 ట్రిప్పులు ప్రయాణించేలా మెట్రో యాజమాన్యం అవకాశం కల్పించింది. తాజాగా ఈ ఆఫర్ను మరో ఏడాది పొడిగిస్తూ మెట్రో యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. 2026 మార్చి 31వ తేదీ వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని ప్రకటించారు.

## నక్సలైట్లు పట్టణాల్లోనే తిష్ట వేశారు




ప్రజాపక్షం/హైదరాబాద్: నక్సలైట్లు వారి రంగు మార్చుకొని అర్బన్ నక్సలైట్ల పేరు మీద పట్టణాల్లో తిష్ట వేశారు అని మాజీ డిజిపి అరవింద్‌రావు అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆడిటోరియంలో మార్టైర్స్ మెమోరియల్ రీసెర్చ్ ఇన్స్‌స్టిట్యూట్ (ఎంఎంఆర్ఐ) ఆధ్వర్యంలో 'చేంజింగ్ కలర్స్ ఆఫ్ నక్సలిజం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ, మాజీ డిజిపి అరవింద్ రావు, మాజీ ఐఏఎస్ దాసరి శ్రీనివాసులు, సామాజిక సమరసత అఖిల భారత సంయోజక్ శ్యాంప్రసాద్, నెహ్రూ యువ కేంద్ర మాజీ ఉపాధ్యక్షులు పెరల శేఖర్, ఎంఎంఆర్ఐ అధ్యక్షులు పుట్టి మురళి మనోహర్, ఎంఎంఆర్ఐ కార్యదర్శి రంజిత్ మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 2026 మార్చ్ నెల వరకు దేశంలో నక్సలిజం అంతం చేస్తాం అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారన్నారు. అందుకు అనుగుణంగా కార్యచరణ ప్రారంభించారన్నారు. ఎంఎంఆర్ఐ 1991లో స్థాపించబడిందని, ఈ సంస్థ నక్సల్స్ బాధితులు, అమరవీరుల గురించి రీసెర్చ్ చేస్తుంది అని అన్నారు. దేశ ఐక్యత సమాజం కోసం ప్రాణాలర్పించిన ప్రజలకు అధికారులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఐక్యత ,శాంతి లేకుండా స్వేచ్ఛ సాధ్యం కాదన్నారు.

## ఏప్రిల్ 2,3,4 తేదీలలో వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. రోజు రోజుకు రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఓ వైపు మండే ఎండలు, మరోవైపు తీవ్ర వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు చల్లని కబురు అందింది. వచ్చే నెల (ఏప్రిల్) 2, 3, 4వ తేదీల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అశాకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ తరుణంలో రాష్ట్రంలోని ప్రజలకు ఎండల నుంచి కాస్త ఉపశమనం కలుగుతుందన్నారు. శనివారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే 3 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 23 డిగ్రీల వరకు పెరుగుతాయని అంచనా ఉందని అధికారులు చెప్పారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం రాష్ట్రంలో 3641 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపారు.

## తప్పడు లెక్కలు చెబుతున్నారు : అనిల్

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్ఎస్ హయంలో 10 ఏళ్లలో లక్షల కోట్ల అప్పులు చేసిన ఆ పార్టీ నాయకులు తప్పుడు లెక్కలు చెబుతున్నారని ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఈరవర్తి అనిల్ విమర్శించారు. గాంధీ భవన్ శనివారం ఈరవర్తి అనిల్ మీడియాతో




మాట్లాడుతూరాష్ట్ర అప్పుపై తప్పు డు చెబుతున్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాదని, గత 10 ఏళ్లలో రూ. 7.28 లక్షల కోట్ల అప్పు చేసి బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు తప్పుడు లెక్కలతో తప్పించుకోవాలని చూస్తున్నారన్నారు. లెక్కలు తప్పడంతోనే ప్రజలు వారిని ఇంటికి పంపించిన విషయన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 90వేల కోట్లు.. ఎఫ్ఆర్‌బిఎం 78వేల కోట్లు. ఎస్‌పివి రూ.11 వేల కోట్లు. కార్పొరేషన్ లోన్లు రూ.5వేల కోట్లు. రాష్ట్రాన్ని మీకు అప్పగిస్తే.. 10 ఏళ్ల కాలంలో మీరు చేసింది ఏమిటని ప్రశ్నించారు. రూ.7లక్షల 28వేల కోట్ల అప్పు చేయడమే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదు.. విరమణ రోజునే వచ్చేది. కానీ అలా చేయలేదు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్, పెండింగ్ బిల్లులు, వ్యవసాయ ఉచిత కరెంట్ బిల్లులు పెండింగ్ ఇలా పదేళ్ల కాలంలో రూ.8లక్షల 19 వేల ఒక వంద 58 కోట్లు అప్ప చేశారని తెలిపారు.

## బిఆర్ఎస్ పోరాటాన్ని జీర్ణించుకోలేకే అణిచివేత : ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా పోరాడటాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే అణిచివేతకు పాల్పొడుతున్నారని బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బిఆర్ఎస్ సభ లోపలా బయటా గణాంకాలతో సహా రేవంత్ తీరును ఎండగట్టిడడంతో పాటు ఆధారాలతో సహా ప్రభుత్వాన్ని నిలదీసిందన్నారు. సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నవారిని సిఎం టార్గెట్ చేస్తున్నారని, ఈనెల 15 ,16 తేదీల్లో 15 కేసులు పెట్టారని, చివరికి రీట్వీట్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. ఉఐటీ యాక్ట్‌కు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్‌లు నమోదు అవుతున్నాయని, సైబర్ సెక్యూరిటీ బ్యూరోను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపిచారు. కాంగ్రెస్ బిజెపిలు కలిసి రాష్ట్రంలో వ్యవస్థీకృత నేరాలు చేస్తున్నాయని ఆ పార్టీపై ముందు మీద కేసులు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

**బల్మూర్ వెంకట్ వాఖ్యలు ఖండిస్తున్నాం : గెల్లు శ్రీనివాస్ యాదవ్**

ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితపై ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్‌వి అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బిసిల గొంతుక అవుతున్నందుకే కవితపై కాంగ్రెస్ కక్ష గట్టిందన్నారు. ఈ ప్రెస్ మీట్‌లో బమ్మెర రామమూర్తి ,అభిలాష్ రంగినేని, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# పురపాలక సంఘాలలో.. రూ.1010 కోట్ల ఆస్తిపన్ను వసూలు

### నేడు, రేపు చెల్లించేందుకు అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై 'వన్ టైమ్ సెటిల్మెంట్'కు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. జిహెచ్ఎంసి తరహాలో ఆస్తి పన్నుపై వడ్డీలో 90శాతం రాయితీ ఇవ్వాలని పురపాలక శాఖ నిర్ణయించింది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో ఆస్తిపన్ను వసూళ్లు రూ.వెయ్యి కోట్లు దాటిందని రాష్ట్ర పురపాలక శాఖ వెల్లడించింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కలిపి ఇప్పటివరకు రూ.1010 కోట్ల మేర ఆస్తిపన్ను వసూలైనట్లు అధికారులు చెప్పారు. మార్చి 31 నాటికి ఆస్తి పన్ను బకాయిలపై 10 శాతం వడ్డీ చెల్లించిన వారికి ఓటిఎస్ వర్తిస్తుందని పురపాలకశాఖ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ క్రమంలో మార్చి 30, 31న సెలువులైనప్పటికీ ప్రజలు ఆస్తి పన్ను చెల్లించవచ్చని అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో ఆస్తిపన్ను చెల్లించి వడ్డీపై 90 శాతం రాయితీ సద్వినియోగం చేసుకోవాలని పురపాలక శాఖ అధికారులు సూచించారు.

**రెండు రోజులే గడువు**

జిహెచ్ఎంసి కల్పించిన ఓటిఎస్ పథకానికి ఇంకా రెండు రోజులే గడువు ఉందని జిహెచ్ఎంసి కమిషనర్ డాక్టర్ ఇలంబర్తి శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెల 31లోపు బకాయి ఉన్న ఆస్తిపన్నును చెల్లించి, ఓటిఎస్ ద్వారా వడ్డీపై 90 శాతం పన్ను రాయితీ పొందాలని సూచించారు. ఆస్తిపన్నును ఆన్లైన్, సిటీజన్ సర్వీస్ సెంటర్లు, ఈసేవా కేంద్రాల ద్వారా చెల్లించవచ్చునని, సర్కిల్, ప్రధాన కార్యాలయాలలో ఉన్న సిటిజన్ సర్వీస్ సెంటర్లు ఉదయం 8 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తాయన్నారు. ఇంటి వద్దకు వచ్చే బిల్ కలెక్టర్లకు కూడా నేరుగా ఆస్తి పన్ను చెల్లించి, రాయితీతో కూడిన రశీదులను పొందాలన్నారు. ఆన్‌లైన్, మై జిహెచ్ఎంసి యాప్ ద్వారా ఆస్తి పన్ను చెల్లించే వెసులుబాటు ఉందన్నారు. బకాయి ఉన్న ఆస్తి పన్నుపై 90 శాతం రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ సూచించారు. పన్ను చెల్లించిన వారు నగర అభివృద్ధికి దోహద పడిన వారవుతారని కమిషనర్ కోరారు.

# నేడు, రేపు పనిచేయనున్న రిజిస్ట్రార్ కార్యాలయాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో మార్చి 31న సెలవుగా ప్రకటించినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) అమల్లో భాగంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పించింది. ఎల్ఆర్ఎస్ ఫీజులోనూ 25 శాతం రాయితీ ఇస్తున్న విషయం తెల్సిందే. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులోనే నేరుగా క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించింది. మార్చి 31లోగా ఫీజు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుంది. 30, 31 సెలవు దినాలు కావడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపునకు 31న కూడా అవకాశం కల్పించాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు రావడంతో ప్రభుత్వం స్పందించింది. 31న బ్యాంకులు కూడా పనిచేయనున్న నేపథ్యంలో ఆ రోజు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని ప్రభుత్వం తెలిపింది.

**సెలవు దినాల్లోనూ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపునకు అవకాశం**

ఈ నెల 30,31 సెలవు దినాల్లోనూ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపునకు పురపాలక శాఖ అవకాశం కల్పించింది. ఈ నెల 30,31 సెలవు దినాల్లోనూ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించవచ్చునని పురపాలక శాఖ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లింపునకు ప్రభుత్వం మార్చి 31 వరకూ అవకాశం ఇచ్చిన విషయం తెల్సిందే. ఈ లోపు చెల్లించిన వారికి ఫీజులో 25 శాతం రాయితీని ఇస్తుంది. ఈ నెల 30వ తేదీన ఉగాది, 31న రంజాన్ పండుగల దృష్ట్యా ప్రభుత్వం ఇది వరకే సెలవులు ప్రకటించింది. ఫీజు చెల్లింపు తుది గడువు ఇంకా రెండు రోజులు మాత్రమే ఉన్నందున ప్రజల సౌలభ్యం కోసం ఈ రెండు సెలవుదినాల్లోనూ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఇస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, రాయితీతో లేఔట్ ఫీజులు చెల్లించి, తమ ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలాని పురపాలక శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

**దరఖాస్తుల వివరాలు**

– 25,67,107 మొత్తం దరఖాస్తులు అందాయి.
– 20,00,493 ఫీజు సమాచారం అందించారు.
– 3,25,538 దరఖాస్తుల ఫీజు చెల్లించారు.

# కాంగ్రెస్ 6 గ్యారెంటీల అమలుపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి

### సిపిఐ(ఎం) డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల అమలుపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజా ఉద్యమం తప్పదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 11 రోజుల పాటు జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ఎ ఒక్క పద్దుపై కూడ సమగ్ర చర్చ జరపకుండనే అసెంబ్లీని ముగించారని జాన్ వెస్లీ అన్నారు. ఆరు గ్యారంటీలను ఎలా అమలు చేస్తారో, నిధులను ఎలా కేటాయిస్తారో చెప్పలేదని, చివరికి ప్రశ్నోత్తరాలను కుదించడమే కాకుండా జీరో అవర్లోనూ ప్రజా సమస్యలు ఎక్కువగా ప్రస్తావనకు లేకుండ పోయిందని తెలిపారు. విద్యారంగానికి బడ్జెట్లో 7.57 శాతం నిధులను మాత్రమే కేటాయించిడమంటే ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడమే అన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం చేస్తామంటూ హామీ మాటే ఎత్తలేదని, వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్నారనీ, దాని అమలు గురించి ప్రస్తావన లేదని చెప్పారు. దళితులు, గిరిజనులకు రూ.12 లక్షల చొప్పున ఇస్తామని, బిసిలకు రూ.20 వేల కోట్లు కేటాయిస్తామన్నారు



కాని బడ్జెట్లో రూ.11,400 కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయడాన్ని ఆహ్వానిస్తున్నామని జాన్‌వెస్లీ అన్నారు.

**ఏప్రిల్ 2 నుంచి 6 వరకు తమిళనాడు మధురైలో సిపిఐ(ఎం) జాతీయ మహాసభలు :**

ఏప్రిల్ 2వ తేదీ నుంచి 6 వరకు తమిళనాడు మధురైలో సిపిఐ(ఎం) జాతీయ మహాసభలు జరుగుతున్నాయని జాన్ వెస్లీ చెప్పారు.ఈ మహాసభల్లో ప్రజా వ్యతిరేక విధానాలు, భవిష్యత్ కారాచరణపై చర్చలు జరుగుతాయని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము బలంగా ఉన్నచోట ఒంటరిగా పోటీ చేస్తామని, కలిసొచ్చే వామ పక్ష, లౌకిక, అభ్యుదయ శక్తులతో కలిసి పనిచేస్తామని చెప్పారు. ప్రజా సమస్యల విషయంలో సిపిఐ కలిసి రావాలని ఆయన కోరారు.

## త్వరలోనే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా టిడిపి



టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తెలుగుదేశం అవతరిస్తుందని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్ అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో శనివారం టిడిపి ఆవిర్భావ వేడుకలు పార్టీ సికింద్రాబాద్ అధ్యక్షుడు పి.సాయిబాబా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు చీరలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లెల్ల కిషోర్, బాలరాజు గౌడ్, ఎస్.ప్రకాష్, ఎం. రాజు, ఝాన్సీ, ప్రమీల, మహానంది, గండికోట విజయ్ కుమార్, సి.విట్టల్, పరశురామ్, భాను ప్రకాష్, కిరణ్, సత్యనారాయణ, అడ్డగుట్ట విజయ్, అమ్మి నాయుడు, ప్రదీప్ గౌడ్, శ్యాంసుందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**టిడిపికి తెలంగాణ పురిటిగడ్డ :నందమూరి రామకృష్ణ**

తెలుగుదేశంకు తెలంగాణ పురిటిగడ్డ అని పార్టీ జాతీయ నాయకులు నందమూరి రామకృష్ణ అన్నారు. టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్ సీతాఫల్ మండిలో పార్టీ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సికింద్రాబాద్ ఇన్‌చార్జ్, రాష్ట్ర నాయకులు వల్లారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.



**సామాజిక న్యాయం టిడిపితోనే సాధ్యం**

'ప్రజలే దేవుళ్లు.. సమాజమే దేవాలయం' అనే నినాదంతో ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఎన్‌టిఆర్ తెలుగుదేశం స్థాపించారని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్ అన్నారు. టిడిపి పార్టీ కార్యాలయం ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో శనివారం టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అరవింద్ కుమార్ ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అజ్మీరా రాజునాయక్, పోలంపల్లి అశోక్, సూర్యదేవర లత, ఎపి మాజీ ఎంఎల్ఏ దివి శివరాం, ముంజా వెంకట్రాజం గౌడ్, జలమోని రవీందర్, రత్నాకర్ రావు, అమర్నాద్ బాబు, కట్టా రాములు పాల్గొన్నారు.

# రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల తనిఖీ

ప్రజాపక్షం/హైదరాబాద్: మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శనివారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో జిఎంతో పాటు హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, ఇతర సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏబిఎస్ఎస్) కింద, ప్రయాణీకులకు ఆధునిక సౌకర్యాలను అందించడానికి, వాటిని వృద్ధి కేంద్రాలుగా మార్చడానికి సుమారు రూ. 27.61 కోట్ల వ్యయంతో మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ పునరాభివృద్ధిని చేపట్టారు. ఇప్పటివరకు ప్రతిపాదిత పనులలో 70శాతం వరకు పనులు పూర్తయ్యాయి. అన్ని పనులు వేగంగా జరగడంతో పాటు పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ సంవత్సరంలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జనరల్ మేనేజర్ వివిధ పునరాభివృద్ధి పనులు మరియు స్టేషన్ మూడు భాగం, 12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబి) నిర్మాణంతో పాటు లిఫ్టు & ఎస్కలేటర్ల ఏర్పాటు వంటి మెరుగుదల



లను సమీక్షించారు, వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను కూడా సందర్శించి, అక్కడ అమ్ముతున్న వివిధ ఉత్పత్తుల గురించి తెలుసుకున్నారు. ప్రయాణీకుల సజావుగా రాకపోకలను నిర్ధారించడానికి హైదరాబాద్ డివిజన్ అధికారులు చేపట్టిన సమగ్ర చర్యలను కూడా ఆయన సమీక్షించారు. స్టేషన్‌లో గణనీయమైన మౌలిక సదుపాయాల మార్పులతో కూడిన పునరాభివృద్ధి పనుల దృష్ట్యా తగిన భద్రతా మెరుగుదల మరియు ప్రయాణీకులకు ఇబ్బందులు కల్గకుండా తగు చర్యలు చేపట్టాలని జిఎం అధికారులకు సూచించారు.

# ఒక్కరోజులో 3.25 లక్షల టన్నుల బొగ్గు రవాణా

### సింగరేణి చరిత్రలో శుక్రవారం ఆల్ టైమ్ రికార్డ్ నమోదు
### ఉద్యోగులకు అభినందనలు తెలిపిన సిఎండి ఎన్.బలరామ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : సింగరేణి చరిత్రలో శుక్రవారం బొగ్గు రవాణాలో ఆల్ టైమ్ రికార్డు నమోదైంది. మూడు షిఫ్టులలో కలిపి సింగరేణి మొత్తం మీద 3,25,243 టన్నుల బొగ్గును వినియోగదారులకు రవాణా చేశారు. దీనిలో రైల్వే రేకుల ద్వారా గత ఏడాదితో పోల్చితే అత్యధికంగా బొగ్గు రవాణా చేయటం కూడా మరో ఆల్ టైమ్ రికార్డు సాధించింది. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్, ఎం.డి. ఎన్. బలరామ్ హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి శనివారం ఉదయం డైరెక్టర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో సమావేశం ద్వారా అభినందనలు తెలిపారు. అందరూ సమష్టిగా కృషి చేయడం వల్లనే ఈ అరుదైన రికార్డు సాధ్యమైందని, ఇదే ఒరవడితో వర్షాకాలం వరకు అత్యధిక బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించాలని వారికి ఆయన సూచించారు. తద్వారా విద్యుత్ డిమాండ్‌కు తగినంత బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాలన్నారు. రానున్న మూడు నెలల కాలంలో ఇదే విధంగా పని చేస్తూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధనకు గట్టి పునాది వేయాలన్నారు. దేశంలో విద్యుత్ డిమాండ్ గరిష్ట స్థాయికి చేరుతున్నప్పటికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు వీలుగా మన రాష్ట్రంతో పాటు మనతో ఇంధన సరఫరా ఒప్పందం ఉన్న అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ప్రణాళికాబద్ధంగా సరిపడా బొగ్గును సరఫరా చేయగలిగామన్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేనంతగా థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద 7.24 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని చెప్పారు. రానున్న రోజుల్లోనూ ఇదే విధంగా అన్ని థర్మల్ కేంద్రాలకు సమృద్ధిగా బొగ్గు సరఫరా చేయడానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కొత్తగూడెం నుంచి ఎక్కువ పరిమాణంలో బొగ్గు సరఫరా చేయడంపై ఆ ఏరియా ఉద్యోగులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

**కొత్తగూడెం వి.కె ఖనికి పర్యావరణ అనుమతులు..**

ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్తగూడెం వెంకటేశ్ ఖని(వికె) ఓపెన్ కాస్ట్‌కు పూర్తిస్థాయి పర్యావరణ అనుమతులు లభించాయని బలరామ్ చెప్పారు. ఈ మేరకు ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఎన్వీరాన్‌మెంట్ అప్రైజల్ కమిటీ సమావేశంలో అనుమతులు లభించినట్లు వెల్లడించారు. వి.కె. ఓపెన్ కాస్ట్‌ను అతి త్వరలో ప్రారంభించుకోబోతున్నామని, అనతి కాలంలోనే రొంపేడు ఓపెన్ కాస్టు (ఇల్లందు) గనికి కూడా అనుమతులు రానున్నాయని, కనుక వచ్చే ఏడాది నిర్దేశిత 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్.వి. సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (పా, పి అండ్ పి), ఈ.డి. (కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం. సుభాని, జిఎం(సిపిపి) మనోహర్, జిఎం( మార్కెటింగ్) ఎన్.వి.రాజశేఖరరావు, అన్ని ఏరియాల జిఎంలు పాల్గొన్నారు.

## దమ్మాయిగూడలో చికెన్ వ్యర్థ పదార్థాల వేలం

**ప్రజాపక్షం/దమ్మాయిగూడః** దమ్మాయిగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో 2025–26 సంవత్సరానికిగాను చికెన్ వ్యర్థ పదార్థాల వేలం పాటను శనివారం నిర్వహించారు. ఇందులో అయేషా ట్రెడర్స్, ఖురేషీ ఎంటర్‌ప్రైజెస్, అజ్లాన్ ఎంటర్‌ప్రైజెస్ వారు ముగ్గురు వేలం పాటలో పాల్గొన్నారు. 5 లక్షల 60 వేల 786 రూపాయలకు పాట పాడి అయేషా ట్రేడర్స్ వారు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశం, కార్యాయల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ

**ప్రజాపక్షం/దుండిగల్ :** కొంపల్లి ఎంపీపీఎస్ పాఠశాల లో విద్యార్థులకు షూస్ పంపిణి చేసిన అంతర ఫౌండేషన్ ఛైర్మెన్, తెలంగాణ విద్య కమిషన్ సభ్యురాలు కందాడి జ్యోత్స్న శివ రెడ్డి, అంతర ఫౌండేషన్ సభ్యురాలు కందాడి పద్మా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కందాడి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక

**ప్రజాపక్షం/అల్వాల్ :** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత మత సామరస్యానికి ప్రతీక అని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రహమత్ ఖాన్ హారిఫ్ గౌస్ ఖాన్ ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడుతూ, ముస్లిం సోదరులు రంజాన్ మాసం అంతా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని, పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లిం సోదరులు ఇచ్చే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రత్యేకంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, దోలి రమేష్, ఢిల్లీ పరమేష్, పవన్ కుమార్, ప్రశాంత్ రెడ్డి, చరణ్ గిరి, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్ర

**ప్రజాపక్షం/అల్వాల్ :** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల చైతన్య యాత్రకు స్వాగతం పలికిన అల్వాల్ జెఎసి నాయకులు ఉద్యమకారులకు ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారులకు ఇంటి స్థలం ఇవ్వాలని, పెన్షన్లు అమలు చేయాలని ఎన్నికల హామీ మేరకు అమలు పరచాలని గ్రేటర్ హైదరాబాద్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలలో చైతన్య బస్సు యాత్రను నిర్వహిస్తున్నామని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఉద్యమకారులకు పెన్షన్ ఉద్యమకారుల కార్పొరేషన్ హెల్త్ కార్డులు ఉద్యమకాలకు వివిధ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ పట్లోళ్ల సురేందర్ రెడ్డి, మల్కాజ్గిరి ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు పుట్నాలకృష్ణ, శోభన్ బాబు, దోలి సుధీర్, సంతోష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు శాఖలో సమర్థవంతంగా విధులు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పలు ఒడిదుడుకులను సైతం లెక్క చేయకుండా పోలీసు విభాగంలో సమర్థవంతంగా విధులు నిర్వహించారంటూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అభినందించారు. కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన పదవీ విరమణ చేస్తున్న వారిని సన్మానించి వారందరికి రావల్సిన అన్ని రకాల ప్రయోజనాలను త్వరలో అందేలా చూస్తానన్నారు. స్పెషల్ బ్రాంచ్ ఎస్సై పి.అచ్చయ్య, ఉప్పల్ ట్రాఫిక్ ఎస్సై అక్బర్ షరీఫ్, సిఎఆర్ ఎఆర్ఎస్సై రవికుమార్, భువనగిరి హెడ్ క్వార్టర్ ఎఆర్ఎస్సై సౌభాగ్య రావు, వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకొన్న మీర్పేట్ ఏఎస్ఐ అంజయ్యలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిపి ఎస్‌బి నరసింహారెడ్డి, అడిషనల్ డిసిపి అడ్మిన్ శివకుమార్, ఎసిపి స్పెషల్ బ్రాంచ్ రవీందర్‌రెడ్డి, సిఏఓ అకౌంట్స్ సుగుణ, సిఏఓ అడ్మిన్ పుష్పరాజ్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు భద్రారెడ్డి, కృష్ణారెడ్డి, పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ రవీంద్రరెడ్డి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సహకారంతో సహకార సంఘాల అభివృద్ధి : లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/పెద్దేముల్ః**సహకార సంఘాల అభివృద్ధికి రైతులు సహకరించాలని తట్టేపల్లి ప్రాథమిక వ్యవసాస సహాకార సంఘం చైర్మన్ పి. లక్ష్మారెడ్డి అన్నారు. పెద్దేముల్ మండల పరిధి తట్టేపల్లి పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి అధ్యక్షతన కార్యాలయం ఆవరణలో రైతు మహాజన సభను నిర్వహించారు. ఈ మహాజన సభలో సహకార సంఘం అస్తి అప్పుల పట్టికను సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు ఎవ్వరు నిరూత్సహ పడవద్దని, ప్రభుత్వం అందరికి సహకరిస్తుందన్నారు. రైతులు అభివృద్ధి చెందినప్పుడే సహకార సంఘాల అభివృద్ధి సాధ్యమన్నారు. సహకార సంఘం రైతులదని, రైతులకు సహకాలంలో వ్యవసాయ రుణాలను అందించాలని సూచించారు. సహకార సంఘంలో తీసుకున్న వ్యవసాయ రుణాలు అందరికి మాఫికాక పోవడంతో సంబంధిత వ్యవసాయ శాఖ మంత్రికి కలవడం జరిగిందని చైర్మన్ అన్నారు. వైస్ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ రూ.30వేలు అప్పు ఉన్న రైతులకు సహితం రుణమాఫి కాలేదని ఆవేధన వ్యక్తం చేశారు. అందరికి రైతులకు రుణామాఫి అయ్యే విధంగా చూడాలని కోరారు. డైరక్టర్ మల్లేశం మాట్లాడుతూ రైతులు వ్యవసాయ రంగంపైనే ఆదారపడకుండా మల్టిపుల్ రంగాలపై దృష్టి సారించాలని, అప్పుడే రైతులు ఆర్థికంగా ఎదుగుతారని అన్నారు. ఈ సమావేశం లో వైస్ చైర్మన్ అంజ య్య, డైరక్టర్‌లు మాజీ చైర్మన్ నరేందర్, నారాయణగౌడ్, డైరక్టర్‌లు రహిం, సుక్కమ్మ, దిగంబర్‌లతో సిఈఒ రాజమౌళి, సిబ్బంది రాములు, మల్లేశం, తదితరులు పాల్గోన్నారు.

## బాధితులకు చెక్కులు అందజేత

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజవర్గం బిఆర్ఎస్వి సీనియర్ నాయకులు కొర్ర ప్రవీణ్ నాయక్ దుండిగల్ తండా 2 లోని నివసించే రమావత్ సుగుణ బాయ్ ఆరోగ్య సమస్యతో హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద తెలుపడంతో వెంటనే సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.23,500 మంజూరు చేసిన చెక్కు ని కొర్ర ప్రవీణ్‌నాయక్ బాధితులకు అందజేశారు.

# కుర్చీ పోయిందని బాధపడే వాళ్లను పట్టించుకోవద్దు

### వక్ఫ్ బిల్లు అంశాన్ని అక్బరుద్దీన్ కంటే మొదటగా లేవనెత్తింది నేను
### ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లాని కొడంగల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నాడు శ్రీ మహలక్ష్మి వెంకటేశ్వర స్వామి 45వ వార్షిక బ్రాహ్మోత్సవాల సందర్భంగా ఆలయ వేద పండితులు పూర్ణ కుంభంతో భజా భజంత్రీలతో స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వామివారికి శేష వస్త్రాలు సమర్పించారు. తిరుమల తురునతి స్వామి వారి శేష వస్త్రాలు ముఖ్యమంత్రి బహుకరించారు. ముందుగా జిల్లా కలెక్టర్లు ప్రతీక్‌జైన్, నారాయణపేట్ కలెక్టర్ సిక్త పట్నాయక్, జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి స్వాగతం పలికారు.

అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గోన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కొడంగల్ ప్రజలు నాకు తెలంగాణ రాష్టాన్ని పరిపాలించే శక్తి నిచ్చారు అని అన్నారు. కొందరికి వాళ్ల కుర్చీ పోయిందని దు:ఖం ఉండచ్చు వాళ్లను పట్టించుకోవద్దని ప్రజలకు సూచించారు. నేనేం చేస్తానో ఏంచేయనో మీకంటే ఎక్కువగా ఎవరికి తెలియదు అని అన్నారు. ముస్లింలకు సంబంధించిన వక్ఫ్ బిల్లు అంశాన్ని అక్బరుద్దీన్ కంటే మొదటగా లేవనెత్తింది నేను అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అనాటి



నుండి ఇప్పటివరకు ముస్లింలకు ఎక్కువగా అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కొడంగల్ లో ముస్లింల అభివృద్ధికి ఎమ్మెల్యే నిధుల నుంచి 25శాతం మంజురు చేశాం అన్నారు. ముఖ్యమంత్రిగా నేను ఒక సంతకంతో కొడంగల్ కు అన్ని వస్తాయి. మీరు వెళ్లి ఎవరినో అడగాల్సిన పని లేదు అని తెలిపారు. ఒక దరఖాస్తు రాసి ఇస్తే నేను కొడంగల్‌కు వచ్చి అన్నీ పూర్తి చేయిస్తా అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ శాసన సభ్యులు మనోహర్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, దేవదాయ శాఖ కమీషనర్ శ్రీధర్. టెంపుల్ ఇఓ రాజేందర్‌రెడ్డి వేద పండితులు పాల్గోన్నారు.




## ఇఫ్తార్ విందులో స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:**వికారాబాద్ జిల్లా కేంద్రలో నియోజకవర్గం స్థాయిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో తెలంగాణ శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ఇఫ్తార్ విందు అని అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గోని ముస్లిం సోదరులకు ఖర్జురం తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, ఆర్ఐ నరేష్‌కుమార్, వికారాబాద్ నియోజకవర్గంలోని మండల పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హాజీమియ, హాజీఫాషా, ముస్లిం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గోన్నారు.

## వైద్యవృత్తిని పవిత్రంగా నిర్వర్తించాలి

### మమతా అకాడమీ 'గ్రాడ్యుయేషన్ డే'లో వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** వైద్య వృత్తిని పవిత్రంగా నిర్వహించాలని కెఎన్ఆర్ విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నంద కుమార్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి లోని మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ హాస్పిటల్ కళాశాలలో 2019 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కెఎన్ఆర్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నంద కుమార్ రెడ్డి, మమతా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పువ్వాడ అజయ్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ పువ్వాడ నయన్ రాజ్‌లు విచ్చేసి విద్యార్థులకు గ్రాడ్యుయేట్ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ నంద కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, డాక్టరేట్‌ను అందుకు న్న విద్యార్థులు దుర్వినియోగం చేయకూడదని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివితే అనుకున్నది సాధిస్తారని అన్నారు. కార్యక్రమంలో




కళాశాల డీన్ పీ.హరికృష్ణ, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ సురేశ్ కుమార్ పటేల్, డిప్యూటీ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ ప్రణీత్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ షంషాద్ బేగం, వైస్ ప్రిన్సిపల్‌లు నవీన్ కుమార్, పోకల నవీన్, నర్సింగ్ సూపరిండెంట్ శశికళ, వివిధ విభాగాల అధ్యాపకులు, మెడికల్ గ్రాడ్యుయేట్‌లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 133 మంది విద్యార్థులు మెడికల్ గ్రాడ్యుయేట్ పట్టాలను మరియు 42 విద్యార్థులు నర్సింగ్ పట్టాలను అందుకున్నారు.



## ప్రభుత్వ నిధులతో ఇఫ్తార్

**ప్రజాపక్షం/కాప్రా :** రంజాన్ మాసం సందర్భంగా మల్లాపూర్ డివిజన్‌లోని ఓల్డ్ మల్లాపూర్‌లోని జమా మసీద్, అశోక్‌నగర్ కాలనీలోని ఉస్మాన్ ఎ మసీద్‌లలో ప్రభుత్వ నిధులతో శనివారం ఇఫ్తార్ విందులు జరిగాయి. స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి పాల్గొన్న ఈ కార్యక్రమంలో మసీద్ కమిటి సభ్యులు రహ్మాన్ అలీ, ఇర్ఫాన్ ఖాన్, జహంగీర్,జాకీర్ అలీ, హఫీజ్, బాసిత్ సయ్యద్ ఉమర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది, రంజాన్‌లకు పటిష్టమైన బందోబస్తు

### కమిషనర్ సుధీర్‌బాబు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:**వరుసగా వస్తున్న ఉగాది, రంజాన్ పర్వదినాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రణాళికాయుక్తంగా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు సూచించారు. శనివారం ఆయన కమిషరేట్‌లోని అధికారుల తో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ కమిషనరేట్ పరిధిలో పలు సున్నితమైన ప్రదేశాలు ఉన్నాయని, రెండు మతాలకు చెందిన పర్వదినాల సందర్భంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.

ముస్లింలు భారీ సంఖ్యలో సామూహిక ప్రార్థనల సమయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికే అవసరమైన మేరకు రిజ ర్వ్ పోలీసులను అదనంగా అన్ని పోలీస్ స్టేషన్‌లకు పంపించామని, వారిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తమ పరిధిల్లోని శాంతి మతసమరాస్యానికి కృషి చేస్తున్న మత పెద్దలు, శాంతి కమిటి సభ్యులతో సమావేశాలు ఏర్పాటుచేసి వారిని సమన్వ య పరుస్తూ సత్ఫలితాలు సాధించాలన్నారు. అన్ని ప్రముఖ మసీదు ప్రాంగణాల్లో వాహనాల నంబర్ ప్లేట్ల చెకింగ్, లైసెన్సులు, ఆర్‌సిల చెకింగ్‌లను ఉధృతం చేయాలన్నారు.

పాత నేరస్తులపై నిఘా వేసి ఉంచాలన్నారు. మహిళలు పాల్గొనే సామూహిక ప్రార్థనా స్థలాల వద్ద షీటీమ్స్ బృందాలతో సిద్ధంగా ఉండాలన్నారు. మత వైషమ్యాలను రెచ్చగొట్టే విధంగా ఉండే సోషల్ మీడియా పోస్టులపై నిఘా తీవ్రం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిసిపి క్రైం అరవింద్, డిసిపి స్పెషల్ బ్రాంచ్ జి.నరసింహ రెడ్డి, అదనపు డిసిపి అడ్మిన్ శివకుమార్, ఎసిపి ఐటి సెల్ సెల్ నరేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





## జై బాపు–జై భీమ్–జై సంవిధాన్ కార్యక్రమం

**ప్రజాపక్షం/దుండిగల్ :** ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సూచనల మేరకు ప్రజాస్వా మ్య పరిరక్షణ, మహాత్మా గాంధీ మరియు బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచనా విధానాలను ప్రజలకు చేరవేసేందుకు నిర్వహిస్తున్న జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కొంపల్లి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్ అధ్యక్షతన కొంపల్లి మల్టీపర్పస్ హాల్ లో మరియు 131 డివిజన్ అధ్యక్షులు ఇరుగు రాధాకృష్ణ, 132 డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్ అధ్యక్షతన టి. ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో, ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఇంచార్జ్ కోలన్ హనుమంత్‌రెడ్డి, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నర్సారెడ్డి భూపతిరెడ్డి పాల్గొన్నా రు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకు లు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అమావాస్యరోజు అన్నదాన వితరణ

**ప్రజాపక్షం/అల్వాల్ :** అల్వాల్ మండల కేంద్రంలోని ఐస్ ఫ్యాక్టరీ రోడ్డులో సాయి బృందావన్ కాలనీ కమాన్ పక్కన శనివారం ఆర్య




వైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షుడు బెలిదే రమేష్ గుప్తా ప్రధాన కార్యదర్శి బచ్చు నాగేష్ కుమార్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని అమావాస్య రోజు అన్నదానం చేయడం ఎంతో శ్రేష్టమైనదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అల్వాల్ మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మంచాల రవీందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి జి.జగ్గయ్య, కోశాధికారి ఉప్పల నరేందర్, అయితే సత్యం, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి అందజేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామ పంచాయతీలోని ఎల్లారెడ్డిపల్లికి చెందిన వీరాంజనేయులుకు రూ.37,500 ముఖ్యమంత్రి సహాయనిధి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని, అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్సపొంది వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికి సిఎం రిలీఫ్ ఫండ్ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచు వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు నర్సింలు తదితరులు పాల్గోన్నారు.

**అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే :** దోమ మండలం గుండాల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు విస్లావత్ చందర్‌నాయక్, అనారోగ్యంతో మృతిచెందారు. స్థానిక నాయకుల ద్వారా విష యం తెలియడంతో డిసిసి అధ్యక్షులు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌కరెడ్డి పరిగి ఆసుపత్రికి చెరుకొని నివాళులు అర్పించారు.

అనంతరం గుండాల్ గ్రామంలో విస్లావత్ చందర్‌నాయక్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటామన్నారు. పాడే మోసి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటి డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి భరత్‌కుమార్ తదితరులు పాల్గోన్నారు.

## యువ వికాస పథకాలకు గడువు పెంచాలి

### బొడ్డుపల్లి కృష్ణ

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బిసిలకు రుణాలు మంజూరు చేసే పథకాలతో పాటు యువ వికాస ఉపాధి పథకాలకు గడువు తేదీలను పొడిగించాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణా రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ కోరారు. ఈ పథకాలకు సంబంధించి ధరఖాస్తు చేసుకొనేందుకు ఆదాయ పత్రాలు, కుల పత్ర ధృవీకరణపత్రాలు త్వరితగతంగా జారీ చేసే విధంగా రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

# టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పుట్టిందే తెలుగుదేశం పార్టీ అని జిల్లా టిడిపి సంయుక్త కార్యదర్శి రుద్రగోని రాంచందర్ గౌడ్ అన్నారు. తెలుగు దేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో రాంచందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించి టిడిపి జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పండ్ల ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కె ప్రేమ్ కుమార్‌గౌడ్, కె.కృష్ణారావు, ఆర్ నాథం గౌడ్, సత్యం యాదవ్, ఎన్ బాలకృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**కుషాయిగూడలో....**

చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ బస్టాండ్‌లో టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కె కృష్ణారావు, నేమూరి బాలకృష్ణగౌడ్, శీలం సత్యం యాదవ్, కె ప్రేమ్‌కుమార్ గౌడ్, కాసుల నందం గౌడ్, అల్లం నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

**నాగారంలో :** నాగారం మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షులు కొండ జంగారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో టిటిడి ట్రస్టు బోర్డు మెంబర్ నర్సిరెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలు వేలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె అశోక్‌గౌడ్, సుంకరి వెంకటేష్,కంటెస్టెంట్ కౌన్సిలర్ కొండ సుజాత, ఆశాబిందు, ఉమాశంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



**మల్కాజిగిరిలో:** మల్కాజిగిరి నియోజకవర్గంలోని పాత సఫిల్‌గూడ, మల్కాజిగిరి ప్రాంతాల్లో శనివారం తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. పాత సఫిల్‌గూడ దర్గా వద్ద బత్తిని నరసింహా గౌడ్, మున్సిపల్ కార్యాలయం వద్ద టిఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు రామ్‌మోహన్‌లు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. చింతల నరేష్ ముదిరాజ్, ప్రణయ్ చంద్ర, వెంకటరమణ, అవినాష్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్‌లో :** తెలుగుదేశం పార్టీకి మళ్లీ పూర్వ వైభవం వస్తుందని మల్కాజ్గిరి పార్లమెంట్ అడక్ కమిటీ అధ్యక్షులు మాజీ సర్పంచ్ వేముల సంజీవ గౌడ్ అన్నారు. అంబేద్కర్ చౌరస్తాలోని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలు వేసి టిడిపి జెండాను సంజీవ గౌడ్ ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబరాలు



జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంజీవ గౌడ్ మాట్లాడుతూ తెలుగుదేశంలో హయాములో బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికోసం తెలుగుదేశం పార్టీ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ఏర్పాటు చేసిందని అన్నారు. మహిళలకు సమాన హక్కులతో పాటు ప్రజలను చైతన్య వంతం చేసిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని ఎంతో మంది రాజకీయ చైతన్యంతో ప్రజాప్రతినిధులుగా ఎమ్మెల్యే, ఎంపీలుగా కలిసి పనిచేసే అవకాశం తెలుగు దేశంద్వారా లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడిపి మాజీ అధ్యక్షుడు సామల జగన్మోహన్ రెడ్డి, పాటి సురేందర్ రెడ్డి, వేణుగోపాల్‌రావు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధి కుశలతతో జీవిత లక్ష్యాలను సాధించవచ్చు : ఎంఆర్. సునీత

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** బుద్ధి కుశలతతో జీవిత లక్ష్యాలను సాధించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. శనివారం వనపర్తి మండల కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెల రోజుల పాటు ఉచితంగా అందించిన ఆత్మ రక్షణ విద్య శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యి మాట్లాడారు. విద్యార్థులు సమాజంలో ఉన్న మంచిని గ్రహించి చెడును విస్మరించాలని తల్లిదండ్రుల పట్ల గురువుల పట్ల పెద్దల పట్ల గౌరవప్రదంగా నడుచుకోవాలని సూచించారు. అదేవిధంగా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వి. రజని మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కొవడానికి ఆడ పిల్లలు మహిళలు ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలని సూచించారు. ఉత్తమ ఆత్మరక్షణ విద్యను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సఖి లీగల్ కౌన్సిల్ డి. కృష్ణయ్య ,కారాటే మాస్టర్ శేఖర్ , శివ, పాఠశాల ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

## విపత్తుల సమయంలో జాగ్రత్తలపై అవగహన



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** విపత్తుల సమయంలో తీసుకోవలసి జాగ్రత్తలపై నేషనల్ డిసస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్ఎఫ్) టీం అవగహాన కార్యక్రమంను నిర్వహించారు. శనివారం సమీకృత రంగారెడ్డి జిల్లా కార్యాలయాల సముదాయంలో నేషనల్ డిసస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్ డిఆర్ఎఫ్) టీం ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు,అగ్ని ప్ర మాదాలు, వరదలు వంటి సంఘటనలు సంభవించినప్పుడు వారు చేపట్టే సహాయక చర్యలు,ప్రమాదాల నుండి ప్రజలను ఏ విధంగా రక్షించడం జరుగుతుందనే అంశములపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఆర్ఎఫ్ టీం సభ్యులు,కలెక్టరేట్ ఎఒ సునీల్,జిల్లా కలెక్టర్ సిసి జనార్దన్,జిల్లా సివిల్ సప్లయ్ అధికారి గంప శ్రీనివాస్,కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## జల సంరక్షణకు అందరూ కృషి




**ప్రజాపక్షం/ఎల్బీ నగర్ :** జల సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలని హస్తినాపురం డివిజన కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. శనివారం డివిజన్‌లోని ఆర్‌కెఆర్ ఎంక్లేవ్‌లో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు జలమండలి సేవ్ ఎర్త్ ఫౌండర్ ఆధ్వర్యంలో అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ సుజాత నాయక్, జలమండలి మేనేజర్ సత్యనారాయణ, సేవ్ ఎర్త్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ టి.సురేందర్ పాల్గొని మాట్లాడారు. జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలని తెలిపారు. మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇంకుడు గుంతల నిర్మాణం వాటి నిర్వహణ పద్ధతుల గురించి కావలసిన సాంకేతిక సలహాలు సూచనల కోసం తమ సిబ్బందిని లేదా జలమండలి సౌజన్యంతో పనిచేస్తున్న సేవ్‌ఎర్త్ ఫౌండర్ ప్రతినిధులను సంప్రదించవచ్చు అని తెలియపర్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేరంగుల కృష్ణ, గొపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జలమండలి అధికారులు టిఒ నర్సింగ్ రావు, అఖిల్, కాలనీ వాసులు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



**ప్రజాపక్షం/ఎల్బీ నగర్ :** అభివృద్ధి పనుల్లో ప్రమాణాలు పాటించాలని బివిన్‌రెడ్డి నగర్ డివిజన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం డివిజన్‌లోని సాయి గార్డెన్స్ కాలనీలో 14లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను జిహెచ్‌ఎంసి డిఇ దామోదర్ రావులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ పనుల్లో జాప్యత లేకుండా పనులు పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతపరంగా పనులు చేపట్టలని సంబంధిత అధికారులను సూచించారు. అభివృద్ధి పనులపై అధికారుల పరివేక్షణ ఉండాలని, కాలనీ వాసులు అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం దేవిరాజ్ కుమార్, కాలనీ అధ్యక్షులు డాక్టర్ గన్నా, మహిళ నాయకులు భ్రమరాంబ, ప్రకాష్, వర్క్ ఇన్స్‌పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిదశ నుంచే సేవాభావం అవసరం



**ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ :** చదువుకునేటప్పడే విద్యార్థులకు సేవాభావాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఎస్‌కె మహమూద్ అన్నారు. పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని తట్టి అన్నారంలోని వార్డు కార్యాలయంలో బేగంపేటలోని ప్రభుత్వ మహిళ డిగ్రి కళాశాల ఎన్ఎస్ఎస్4 విద్యార్థుల అధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వాహించిన శిభిరం ముగింపు కార్యక్రమం శనివారం జరిపినారు. ఈ కార్యక్రమంకు అయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రణాళిక బద్దంగా ముందుకు వెలుతు కష్టపడితే ఎప్పటికైనా లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. సేవా దృప్పదాన్ని పెండడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం అన్నారు. నేను నాకోసం కాదు సమాజం కోసం అనే నినాదంతో పెరగాలని అప్పడే మనతోనే సమాజం అభివృద్ధి చెందుతున్నారు. విద్యార్థులుగా కాలేజీని వదిలి పల్లె బాట పట్టడంతో క్షేత్రస్థాయిలో ప్రజల తీరుతెన్నలు తెలుస్తాయని సేవ చేయడం అలవాటుగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియ యూనివర్సిటీ రిపెర్స్ ఈసోసియేట్ రవితేజ,కాలేజీ ప్రిన్సిపాల్ కే పద్మావతి,మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అఫిసర్ కే వేంకటేశ్వర్లు మాజీ కౌన్సిలర్ దేవిడి గిత వేణుగోపాల్‌రెడ్డి,కే సుదర్శన్ తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పేదల పక్షాన తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టిడిపి సీనియర్ నాయకులు చల్లా వెంకటేశ్వర రెడ్డి అన్నారు. శనివారం షాద్‌నగరలో టిడిపి పార్టీ 43 అవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్‌టిఆర్ చిత్ర పట్టానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. బడుగు బలహీన వర్గాలకు తెలుగు వారిని చైతన్యం కల్పించిన ఘనత కేవలం తెలుగు దేశం పార్టీకే దక్కుతుందన్నారు. తెలుగు దేశం హయంలో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారని వివరించారు. టిడిపి పార్టీ బలోపేతానికి తెలంగాణ ప్రజలంతా ఎకం అవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బక్కని నర్సింలు, తెలుగు దేశం పార్టీ నాయకులు బూర్గుల కుమార్ గౌడ్, వెంకటయ్య గౌడ్, రమేష్, అంజయ్య, కమ్మదనం శివ, బాలరాజ్, భాస్కర్ రెడ్డి, యాదగిరి, దాసరి అనంతయ్య, యాదయ్య, సత్యనారయణ, అశోక్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## పెరిగిన ఆస్తి పన్నులను తగ్గించాలి

### అర్కల కామేష్‌రెడ్డి

**ప్రజాపక్షం / సరూర్‌నగర్ :** మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో భారీగా పెరిగిన ఆస్తి పన్నులను తగ్గించాలని మీర్‌పేట బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల భూపేష్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు పటోళ్ల సబితాఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు కామేష్‌రెడ్డి పలువురు నాయకులతో కలిసి శనివారం సిడియంఏ కార్యాలయంలో డైరెక్టర్ టి.కే.శ్రీదేవికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి లేఖ ప్రకారం గత నెల 14 వ తేదిన సిడియంఎ నుండి వివరాలు పంపాలని మీర్‌పేట కార్పొరేషన్ కమీషనర్ కి లెటర్ వచ్చిందన్నారు. త్వరలో మన టాక్స్ సమస్య తీనుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొక్క రాజేందర్‌రెడ్డి, ఏనుగు అనిల్ కుమార్‌యాదవ్, సిద్దల బీరప్ప, పద్మఅంజయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఏఎస్ శిక్షణ బృందం జలమండలి సందర్శన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన 2023 బ్యాచ్‌కి చెందిన ఏడుగురితో కూడిన శిక్షణలో ఉన్న ఐఏఎస్ బృందం జలమండలిని సందర్శించింది. ఒకరోజు ఓరియంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయానికి వచ్చి, జలమండలి కార్యకలాపాల గురించి వారు తెలుసుకున్నారు. జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి బోర్డు పనితీరు, నగరానికి నీటి సరఫరా, ఎస్‌టిపిలు, మురుగు శుద్ధి నిర్వహణతో పాటు భవిష్యత్తు ప్రణాళికలు, ప్రాజెక్టుల గురించి వారికి వివరించారు. కోటి 30 లక్షలకు పైగా జనాభా ఉన్న హైదరాబాద్ మహా నగరానికి భారీ పైపు లైన్ల ద్వారా మంచి నీరు సరఫరా చేస్తున్న పద్ధతిని తెలిపారు. దీంతో పాటు నీటి శుద్ధి, వివిధ దశలలో నీటి శుద్ధీకరణ జరిగే ప్రక్రియ, క్లోరినేషన్, తుది దశగా హైదరాబాద్‌కు భారీ మోటర్లతో పంపింగ్ వంటి అంశాల గురించి వివరించారు. ఈఎన్‌సి, డైరెక్టర్ ఆపరేషన్ 2 వి.ఎల్. ప్రవీణ్ కుమార్ జలమండలిలో చేపట్టిన వివిధ సంస్కరణలు, రెవెన్యూ, ఐటితో పాటు ఇప్పటి దాకా చేపట్టిన ప్రాజెక్టులు కృష్ణా, గోదావరి, హడ్కో రిజర్వాయర్లు, ఓఆర్ఆర్ ఫేజ్ 1, 2 ప్రాజెక్టులు, వంద శాతం మురుగుశుద్ధి కోసం చేసే ఎస్‌టిపిల ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్, ఆపరేషన్స్1 డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సిజిఎం (పి అండ్ ఏ) మహ్మద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.



## తక్కువ ఖర్చుతో ఇందిరమ్మ ఇండ్లు

### జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ఇందిరమ్మ ఇండ్లను తక్కువ ఖర్చుతో నిర్మించేందుకు గాను నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జిల్లాకు 40 మంది నైపుణ్యం కలిగిన మేస్త్రీలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఎన్ఏసి బండ్లగూడ ద్వారా శిక్షణ పొందిన 40 మంది మేస్త్రీలకు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ తొలి విడత ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ మేస్త్రీలు ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారని శిక్షణలో రోజుకు 300 రూపాయల చొప్పున, డ్రెస్సులు,హెల్మెట్లు కూడా ప్రతి మేస్త్రీకి ఇవ్వడం జరిగిందని అన్నారు. ఎంపిక చేయబడిన గ్రామాల్లో శిక్షణ పొందిన మేస్త్రీలు ప్రతి గ్రామంలో నాలుగు నుండి పది ఇండ్ల వరకు వీరే నిర్మిస్తున్నారని తెలిపారు. రాబోయే కాలంలో ప్రతి నియోజక వర్గంలో 3,500 ఇండ్లు నిర్మించడం జరుగుతుందని,ఇంకా కొంత మందికి శిక్షణ ఇచ్చి మేస్త్రీల కొరత ఉన్న గ్రామాలకు పంపడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. రెండో విడత శిక్షణలో డిఆర్‌డిఏ ద్వారా మహిళలకు కూడా మేస్త్రీలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.సి. నాయక్, ఎన్ ఎసిఏ డి, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం, మేయర్ ఉగాది శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర బిసి సంక్షేమం, రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ తెలుగు ప్రజలందరికీ శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ శ్రీ విశ్వావసు నామ ఉగాది పండగ సందర్భంగా అందరికీ శుభం జరగాలని, తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్స ర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని, నగర ప్రజలకు గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటి మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ డాక్టర్ ఇలంబర్తి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పచ్చడి మనిషి జీవితం అనేక రుచుల సమ్మేళనం అనే సందేశాన్ని అందిస్తుందని అన్నారు. ఈ ఉగాది అందరి జీవితంలోనూ ఆనందం, అభివృద్ధి, ఆరోగ్యం, శాంతి, సంపదలు చేకూర్చాలని ఆమె ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరం అభివృద్ధిలో మరింత ముందుకు వెళ్లేందుకు జిహెచ్‌ఎంసి నిరంతరం కృషి చేస్తోందని, నూతన సంవత్సరంలో మరిన్ని అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రజల సహకారంతో నగరాన్ని మరింత మెరుగుపరిచేందుకు కృషి కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా నగర ప్రజలంతా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, శుభ్రమైన, ఆరోగ్యకరమైన హైదరాబాద్ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

## మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలి



**ప్రజాపక్షం/ ఖైరతాబాద్ :** త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి చోటు కల్పించాలని ఎస్‌సి, ఎస్‌టి నేషనల్ ఇంటెలెక్చువల్ ఫోరం ఉపాధ్యక్షులు చింతా భగవాన్ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని ఎంపిలు, ఎంఎల్‌సి, కార్పొరేషన్ల పదవులలో మాలలే ఉన్నారని, అందులో ఒక్క మాదిగ బిడ్డ లేరని తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ ఇంటెలెక్చువల్ ఫోరం, బహుజన విద్యార్థి సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డికి మాదిగలపై అభిమానం ఉన్నదని, కానీ, కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద కొంత మంది మాల సోదరులు లాబీయింగ్ చేయడంతో మాదిగలకు అన్యాయం జరుగుతుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు అండగా నిలిచేందుకు మాదిగలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో టిపిసిసి ఎస్‌సి సెల్ కన్వీనర్ హెచ్.ఆర్.మోహన్, ప్రొఫెసర్ పత్తుకుల శ్రీనివాస్, సంజయ్, నరేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిసిలకు 21శాతం కోటా కేటాయించాలి



**ప్రజాపక్షం/ ఖైరతాబాద్ :** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల 42శాతం రిజర్వేషన్లలో ఎంబిసిలకు 21శాతం కోటా కేటాయించాలని తెలంగాణ ఎంబిసి సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఐతరాజు అభేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 136 బిసి కులాల్లో 70కిపైగా ఎంబిసి కులాలున్నాయని తెలిపారు. బిసి బడ్జెట్‌లో ఎంబిసిల అభివృద్ధికి 50శాతం నిధులు కేటాయించాలని, సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. ఇళ్లు లేని ఎంబిసిలకు ఇంటి స్థలంతోపాటు ఇళ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ యువతకు రూ.10లక్షల వరకు సబ్సిడీ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు సిఎం రేవంత్‌రెడ్డిని, మంత్రులను కలుస్తామని తెలిపారు. సమావేశంలో గంగపుత్ర యువజన సంఘం నాయకులు అంబటి సుధాకర్, ఎంబిసి సంఘం నేతలు అమంచి అంజయ్య, అంజయ్య, దామర నాగేశ్వర రావు, నలపరాజు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 21, 22 తేదీలలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్రమహాసభలు

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు



**ప్రజాపక్షం/గండిపేట:** శంషాబాద్‌లో ఏప్రిల్ 21,22 తేదీలలో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాలుగవ మహాసభలను విజయవంతంగా నిర్వహించాలని ఎఐటియుసి జిల్లా నాయకత్వానికి జిల్లా కార్మిక వర్గానికి ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ పిలుపునిచ్చారు. శనివారం శంషాబాద్ జిల్లా పార్టీ ఆఫీసులో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు లక్షల మంది ఉన్నారని వారందరిని ఎఐటియుసిలోకి ఆహ్వానించి మండలాల వారీగా కమిటీలు వేసి కార్మిక వర్గాన్ని ఐక్యం చేయాలని వారు పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక రంగంలో పనిచేస్తున్న అధిక శాతం కార్మికులు ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన కార్మికులేనని వారు తెలిపారు. వలస కార్మికుల సమస్యల పైన ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహించి వారికి న్యాయం జరిగే విధంగా పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ఎఐటియుసి పోరాటాల ఫలితంగా వచ్చిన చట్టాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కి తీవ్రమైన అన్యాయం చేసిన నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడంలో జిల్లా నాయకత్వం బాగా పనిచేయాల్సి ఉందని తెలిపారు.ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు గడిచిన కార్యక్రమాల రిపోర్టును ప్రవేశపెట్టారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి,జిల్లా కార్యదర్శి. దత్తు నాయక్ ,కే చందు యాదవ్,ఎం శ్రీను ,టి నరసింహారెడ్డి,రంగారెడ్డి, కన్య గారి నర్సింహా రెడ్డి, దాసరి ప్రసాద్, నర్రగిరి, కేతరాజు నరసింహ, సక్రు నాయక్,స్వామి,తుపాకుల రాములు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థికి లయన్స్ క్లబ్ చేయూత




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** చదువులలో రాణిస్తున్న ఉత్తమ విద్యార్థికి లయన్స్ క్లబ్ హోప్ ఏల్లప్పుడు చేయూత అందిస్తూ ఉంటుందని, పెదరికం చదువుకు అడ్డు కాకుడదని ప్రతి ఒక్కరు చదువుకొని తమ బంగారు భవిష్యత్తుతో జీవితంలో ముందుకు వెళ్ళాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపకుడు కొండా విజయ్ కుమార్ తెలిపారు. విద్యలో రాణిస్తున్న కార్తిక్ పదవ తరగతి చదువు కొరకు రూ.25 వేల అర్థిక సహాయం అందచేయడం జరిగినదని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్థిక ఇబ్బందులలో ఉన్న విద్యార్థులను చదివించాడానికి లయన్స్ క్లబ్ ఆఫ్ హోఫ్ ఎల్లపుడు ముందుంటుందని , లయన్స్ క్లబ్ మరిన్ని సేవా కార్యక్రమాలు అందించాడానికి ఏల్లపుడు ముందుంటుందని కొండా విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ ట్రెజరర్ మర్రి ప్రవీణ్, క్యాబినెట్ కార్యదర్శి లయన్ శ్రీధర్, రీజియన్ అధ్యక్షుడు కరుణాకర్ గౌడ్, లయన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.153.90 కోట్ల బడ్జెట్ ఆమోదం



**ప్రజాపక్షం/గండిపేట:**బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ కార్యాలయ కౌన్సిల్ హాల్ కిస్మత్ పూర్ యందు 2025–2026 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ ప్రత్యేక సమావేశం ప్రత్యేక అధికారి శ్రీధర్, అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. శనివారం బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ రూ. 153.90 కోట్లు ప్రత్యేక అధికారి పి శ్రీధర్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్రతో కలిసి ఆమోదించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపులో భాగంగా నెలసరి జీతాలు, పారిశుధ్య నిర్వహణ,విద్యుత్ బిల్లులు , హరిత నిధి ఇంజనీరింగ్ విభాగంలో వివిధ అభివృద్ధి పనులకు,సాధారణ పరిపాలన విభాగంలో వివిధ ఖర్చులు ,టౌన్ ప్లానింగ్ విభాగంలో వివిధ ఖర్చులు , కేటాయించడం జరిగిందన్నారు.1/3 వంతు నిధుల మిగులు వ్యయం ప్రజా సౌకర్యాల నిమిత్తం వార్డు వారీగా వివిధ అభివృద్ధి పనుల ఖర్చుల గురించి కేటాయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిఈ యాదయ్య,మేనేజర్ నిర్మల, వివిధ సెక్షన్ల అధికారులు,సెక్షన్ అసిస్టెంట్లు,వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు,వర్క్ ఇన్స్పెక్టర్లు, జవాన్లు తదితరులుపాల్గొన్నారు.

## అమావాస్య రోజున అన్నదానం ఎంతో శ్రేష్టమైంది

### ఉప్పల శ్రీనివాస్‌గుప్త

**ప్రజాపక్షం / సరూర్‌నగర్ :** అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని అమావాస్య రోజు అన్నదానం చేయడం ఎంతో శ్రేష్టమైందని ఇంటర్‌నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, టిపిసిసి ప్రచార కమిటీ కన్వినర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. శనివారం సరూర్‌నగర్ లోని శ్రీ బంగారు మైసమ్మ కాశీ వైద్యనాథ ఆలయంలో ఆర్యవైశ్య గ్రూప్, గోల్డెన్ వాకర్స్ టీం ఆధ్వర్యంలో సుమారు 500 మంది అన్నదాన ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు స్వయంగా అన్నదాన వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరూర్‌నగర్ పట్టణంలో అనతి కాలంలోనే ప్రతి రోజుసు 200 మందికి భక్తి శ్రద్దలతో నిత్య అన్నధానం చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న దేవాలయ ట్రస్టీలు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్ లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ నిర్వాహకులు సూరిశెట్టి శ్రీనివాస్‌గుప్త, సాంబమూర్తి గుప్త, వరగంటి వేణుమాదవ్‌గుప్త, ఆనంద్‌గుప్త, నాయకులు కృష్ణ, నాగేష్‌గుప్త, కూర శ్రీనివాస్, కబీర్‌దాస్‌గౌడ్, జక్కుల శ్రీశైలం యాదవ్, జయప్రకాష్, నవీన్‌గుప్త, రమణ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



## కుల మతాలకు అతీతంగా రంజాన్ పండగ జరుపుకోవాలి

### షాద్‌నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** కుల మతాలకు అతీతంగా రంజాన్ పండగ జరుపుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముస్లీం నిరుపేదలకు నిత్యవసర వస్తువులు అందజేశారు. ముస్లీంలకు ఇష్టమైన వంటకాలు శీర్, ఖూర్మా, అనేక రకాల పండ్లతో విందు ఏర్పాటు చేసి రంజాన్ శుభాకాక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. షాద్‌నగర్ పట్టణంలో సుమారుగా 1500 మంది నిరుపేదలకు రంజాన్ తోఫా అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి అందేలా చూస్తామని చెప్పారు. రంజాన్ సందర్భంగా ప్రజలందరికి అల్లా ఆశీర్వాదం ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైజ్ చైర్మెన్ మహమ్మద్ అలీఖాన్, మైనార్టీ నేతలు బాబర్, ఖదీర్, అన్వర్, కొత్తూర్ మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌వ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

ఫరుక్ నగర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు సేవలు అందించడంలో అధికారులు నిర్ల క్ష్యం చేస్తున్నారని ప్రజల నుండి సమాచారం వచ్చిన వెంటనే తహసీల్దార్ కార్యాలయాని ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రాజీవ్ యువ వికాస్ పథకానికి ప్రజలకు సకాలంలో కులము, ఆదాయం ధృవ పత్రాలు ఎందుకు ఇవ్వడం లేదని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. సాకేంతిక లోపం కారణంగా రాలేదని చెప్పడంతో వెంటనే రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కారించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వెంటనే ధృవ పత్రాలు అందించాలని అధికారులను ఆదేశించారు. యువత దరఖాసు చేసుకోవాడానికి అదనంగా సమయం ఇవ్వాలని కోరారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఐదుగురు అరెస్ట్

**ప్రజాపక్షం/మియాపూర్:** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధీలో అన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న 5గురిని అరెస్ట్ చేయగా ఇద్దరు పరారీలో ఉన్నారని మియాపూర్ పోలీసులు తెలిపారు. పక్కా సమాచారం ప్రకారం మాదాపూర్, మియాపూర్ పోలీసులు కలసి మియాపూర్‌లోని హాఫిజ్‌పేట్‌లోని ఓక ఇంటిపై దాడి చేయగా అన్‌లైన్‌లో 7 మంది కలిసి బెట్టింగ్ నిర్వహిస్తున్నారని ఎ1. బాస్పుల్ పల్లి గ్రామం, రాజస్థాన్‌కు చేందిన సురేష్ గావల (46) ,ఏ4. మిద్దిశేట్టి కార (25) ఇద్దరు పరారీలో ఉండగా, ఏ2 మియాపూర్ కు చేందిన మద్దిశేట్టి అజయ్ (46), ఏ3. మిద్దిశేట్టి సంధ్య అజయ్ (40), ఏ5. జెట్టి శర్మ (30) రాజస్థాన్, ఏ6. బాసిబోయిన సమంత్(28) సెల్స్ మెన్, ఏ7. బీర గణేష్ కుమార్(31) బిజినెస్ మాన్‌లను అరెస్ట్ చేశామని తెలిపారు. వారి వద్ద 53 వెల రూపాయల నగదుతో పాటు 5 సెల్ పోన్లు, ఓక ఐ 20 కారును స్వాధినపరుయుకున్నామని దానితో పాటు అన్‌లైన్‌లో ఇరవై లక్షల అరవై వేల ఆరు వందల మూడు (20,60,603 ) రూపాయలను స్థాంబింపజేసి కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నామని తెలిపారు.

ఫోకస్

# క్రీడ




## కనువిందు చేసే 'ఈక్వెస్ట్రియన్'

గుర్రపు స్వారీ అనగానే 'హార్స్ రేస్' గుర్తుకురావడం సహజం. కానీ, ఒకవైపు గుర్రాలను అదుపుచేస్తూ, వాటితో విన్యాసాలు చేయించడం కూడా 'గుర్రపు స్వారీ' కిందకే వస్తుంది. ఇదొక గొప్ప కళ. స్విట్జర్లాండ్‌లోని బాసెల్ నగరం, సెయింట్ జాకబ్‌షల్లేలో ఏప్రిల్ 2 నుంచి 6వ తేదీ వరకు జరిగే ఈక్వెస్ట్రియన్ ప్రపంచ చాంపియన్‌షిప్ ప్రేక్షకులకు కనువిందు చేయనుంది. ఫెడరేషన్ ఈక్వెస్ట్రే ఇంటర్నేషనలే (ఎఫ్ఇఐ) నిర్వహిస్తున్న ప్రపంచ కప్ చాంపియన్‌షిప్స్‌లో, ఈక్వెస్ట్రియన్ కళలో అద్భుతంగా రాణిస్తున్న హేమాహేమీలు ప్రపంచ చాంపియన్‌షిప్ కోసం పోటీపడనున్నారు. జంపింగ్, డ్రెస్సేజ్, వాల్టింగ్ విభాగాల్లో పోటీలు జరుగుతాయి. ఈక్వెస్ట్రియన్ అనే పదం 'ఈక్వెస్టర్' లేదా 'ఈక్వస్' అనే పదం నుంచి ఉద్భవించింది. లాటిన్‌లో ఈ పదానికి రౌతు అని అర్థం. గుర్రాన్ని రౌతు నియంత్రించే ప్రక్రియనే గుర్రం స్వారీ అంటారు. విస్తృత వివరణలో దీనిని ఆచరణాత్మక పని ప్రయోజనాల కోసం గుర్రాలను వినియోగించడంగా పేర్కోవచ్చు. ఉదాహరణకు రవాణా, వినోద కార్యకలాపాలు, కళాత్మక లేదా సాంస్కృతిక విన్యాసాలు, క్రీడలు తదితరాలు. కళాత్మక, సాంస్కృతిక విన్యాసాలుగా ఈక్వెస్ట్రియన్ పోటీలను చెప్పుకోవచ్చు. గుర్రాలను నియంత్రించడం, వాటితో విన్యాసాలు చేయించడం అనుకున్నంత సులభం కాదు. ధైర్యం, సమయస్ఫూర్తి, జంతు వైఖరిపై అవగాహన వంటి అనేక లక్షణాలు ఉన్న రౌతుకే ఈక్వెస్ట్రియన్ సాధ్యమవుతుంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ వరకూ చేరాలంటే ఎంతటి ప్రజ్ఞ అవసరమో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. అశ్వదళం ఒకప్పుడు రాచరిక వ్యవస్థలో కీలకంగా ఉండేది. ఆ ఆనవాయితీ నేటికీ కొనసాగుతునే ఉంది. అయితే, అంతకంటే ముందే సాధారణ మనిషి కూడా తన అవసరాలకు గుర్రాలను మచ్చిక చేసుకున్నాడు. సరుకుల రవాణా, ప్రజల ప్రయాణాల కోసం గుర్రాలను వాడేవారు. వాటికి ప్రత్యేక శిక్షణ నిచ్చి సైనిక విభాగంగా మార్చారు. క్రీడల్లో ఒకప్పుడు కేవలం గుర్రం రేసులు మాత్రమే ఉండేవి. కానీ, కాలానుగుణంగా అశ్వక్రీడల్లోనూ మార్పులు చోటు చేసుకున్నాయి. పోలో (ఒక రకంగా గుర్రం స్వారీ చేస్తూ ఆడే హాకీ), బుజ్‌కాషి (మాంసం ముద్ద కోసం మైదానంలో జరిగే పోరు) వంటి ఆటలు వచ్చాయి. డ్రెస్సేజ్, ఎండ్యూరెన్స్ రైడింగ్, ఈవెంటింగ్, రైనింగ్, షో జంపింగ్ వంటి కళాత్మక అశ్వక్రీడలు రంగప్రవేశం చేశాయి. టెంట్ పెగ్గింగ్, వాల్టింగ్, పోలో, డ్రైవింగ్, రోడియో, రేస్ వంటి క్రీడల్లోనూ గుర్రాలే కీలకం. గుర్రపు ప్రదర్శనలలో కొన్ని ప్రసిద్ధ రకాల పోటీలు ఉంటాయి. ఇక్కడ గుర్రాలు విస్తృత శ్రేణి విభాగాలలో ప్రదర్శన ఇస్తాయి. నక్కల వేట, ట్రైల్ రైడింగ్ లేదా హ్యాకింగ్ వంటి పోటీ లేని వినోద ప్రధానమైన స్వారీ కోసం అశ్వాలను ఉపయోగిస్తున్నారు. వ్యవసాయం నుంచి ప్రయాణం వరకూ... రేసింగ్ నుంచి పరేడ్‌ల వరకూ... అనేకానేక విధాలుగా అశ్వాలను ఉపయోగిస్తున్నారు. కేవలం వినోదం కోసమే కాదు.. మానసిక ఒత్తిడిని తగ్గించు కోవడానికి కూడా ఈక్వెస్ట్రియన్ పోటీలను తిలకిస్తారు.





గుర్రాలను ఎప్పుడు పెంపుడు జంతువుగా మార్చారు లేదా మొదటి స్వారీ ఎప్పుడు చేశారనే ప్రశ్నలకు భిన్నమైన సమాధానాలు వస్తాయి. అయితే, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధారాలను అనుసరించి క్రీస్తు పూర్వం 3500 ప్రాంతంలోనే గుర్రాలను స్వారీ చేయడం నేర్చుకున్నారు. డ్నీపర్, డాన్ తదితర నదుల సమీపంలో ప్రజలు గుర్రాలను క్రీస్తుపూర్వం 3000 ప్రాంతంలోనే ఉపయోగించేవారని చెప్పడానికి ఆధారాలు ఉన్నాయి. క్రీస్తుపూర్వం 2500 కాలానికి చెందినవిగా పేర్కొంటున్న సాక్ష్యాధారాలను అనుసరించి, రథాలకు గుర్రాలను వినియోగించేవారని స్పష్టమవుతున్నది. అంతేగాక అశ్వికదళం కూడా అప్పట్లో ఉండేదని తెలుస్తున్నది. యుద్ధం, రవాణా, వాణిజ్యం, వ్యవసాయం వంటి అనేక కార్యకలాపాల్లో అశ్వం ఒక భాగమైంది. 1493లో కొలంబస్ రెండవ సముద్రయానంతో ప్రారంభించినప్పుడు, యూరోపియన్ అన్వేషకులు గుర్రాలను ఉత్తర అమెరికాకు తిరిగి తీసుకువచ్చారని అంటారు. 1900 సమ్మర్ ఒలింపిక్స్‌లో జంపింగ్ ఈవెంట్‌లతో కూడిన ఒలింపిక్ క్రీడగా గుర్రపు స్వారీని ప్రవేశపెట్టారు. డ్రెస్సేజ్ నిజమైన ఒలింపిక్ గేమ్‌గా మారే ప్రారంభ దశలలో, రైడర్ భద్రతకు సంబంధించిన కొన్ని అనుమానాలు వ్యక్తమయ్యాయి. 1910 స్టాక్‌హోమ్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో, డ్రెస్సేజ్ రింగ్‌పై 4 జంప్‌లను ప్రవేశపెట్టారు. వాటిలో అత్యధిక అడ్డంకి (హర్డిల్) 1.10 మీటర్లు. ఈ పోటీ వల్ల ఎలాంటి సమస్యలు ఎదురుకాకపోవడంతో, తర్వాతి ఒలింపిక్స్‌లో ఈక్వెస్ట్రియన్ ఒక భాగమైంది. కాగా, 'పవర్' అనేది షో జంపింగ్ ఉప విభాగం. ఇక్కడ జంప్ చేయాల్సిన ఎత్తు క్రమంగా పెరుగుతూ ఉంటుంది. ఒక అడ్డంకిని సమర్థంగా పూర్తి చేసినప్పుడు, ఎత్తును పెంచుతారు. అలా, అశ్వం శక్తిని, రైడర్ సామర్థ్యాన్ని పరీక్షిస్తారు.



## ఈ హ్యాట్రిక్‌లు ప్రత్యేకం..

క్రికెట్‌లో హ్యాట్రిక్ అంటేనే ప్రత్యేకం. మూడు వరుస బంతుల్లో ముగ్గురిని అవుట్ చేయడం సామాన్యమైన విషయం కాదు. హ్యాట్రిక్‌లోనూ కొన్ని అరుదైన ప్రత్యేకతలను సంపాదించుకున్నాయి. ఉదాహరణకు ఆస్ట్రేలియా పేసర్ మెర్వ్ హ్యూస్ సాధించిన హ్యాట్రిక్. 1988, డిసెంబర్ 2న, పెర్త్ మైదానంలో వెస్టిండీస్‌తో ప్రారంభమైన రెండో టెస్టు మ్యాచ్ మొదటి రోజు ఆటలో, తన ఓవర్ చివరి బంతికి కర్ట్‌లీ ఆంబ్రోస్‌ను అవుట్ చేశాడు. తర్వాతి ఓవర్ మొదటి బంతిలో పాట్రిక్ ప్యాటర్సన్ వికెట్ సాధించాడు. దీనితో వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది. విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో, హ్యూస్ మళ్లీ బౌలింగ్‌కు వచ్చినప్పుడు, తన మొదటి బంతిలోనే గార్డన్ గ్రీనిడ్జ్‌ని ఎల్‌బిడబ్ల్యుగా పెవిలియన్‌కు పంపి, హ్యాట్రిక్ పూర్తి చేశాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో ఈ విధంగా మూడు వేరువేరు ఓవర్లలో హ్యాట్రిక్ సాధించిన తొలి బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఇప్పటి వరకూ ఈ రికార్డు పదిలంగానే ఉంది. ఇక, 1844లో, అండర్ ఆర్మ్ బౌలర్ విలియం క్లార్క్ , ఇంగ్లాండ్ తరపున ఆడుతూ, కెంట్‌పై రెండు ఇన్నింగ్స్‌లలో హ్యాట్రిక్ సాధించాడు, కెంట్ బ్యాట్స్‌మన్ జాన్ ఫాగ్‌ను రెండుసార్లు హ్యాట్రిక్‌లో అవుట్ చేశాడు. ఫాగ్ మొదటి ఇన్నింగ్స్‌లో 11వ స్థానంలో, రెండవ ఇన్నింగ్స్‌లో 3వ స్థానంలో బ్యాటింగ్ చేశాడు. 1988–89 సీజన్‌లో హిమాచల్ ప్రదేశ్‌పై ఢిల్లీకి చెందిన శంకర్ సైనీ తన హ్యాట్రిక్‌లో భాగంగా శక్తి సింగ్‌ను రెండుసార్లు ఔట్ చేయడం ద్వారా ఈ ఫీట్‌ను పునరావృతం చేశాడు. హ్యాట్రిక్ పూర్తి చేసే క్రమంలో ఒకే ఆటగాడిని రెండు పర్యాయాలు అవుట్ చేయడం అత్యంత అరుదు. కాగా, మెల్‌బోర్న్ క్లబ్ క్రికెటర్ స్టీఫెన్ హిక్‌మాన్ మార్చి 2002లో పవర్ హౌస్‌కి ఆడుతున్నప్పుడు, రెండు రోజులు... రెండు ఇన్నింగ్స్.. మూడు వేరువేరు ఓవర్లలో హ్యాట్రిక్ సాధించాడు. ఇందులో ఒక బ్యాట్స్‌మన్‌ను రెండుసార్లు అవుట్ చేయడం విశేషం. సౌత్ యారాలోని ఫాక్నర్ పార్క్‌లో జరిగిన మెర్కాంటైల్ క్రికెట్ అసోసియేషన్ 'సి' గ్రేడ్ సెమీఫైనల్‌లో, గన్‌బోవర్ యునైటెడ్ క్రికెట్ క్లబ్ 109 పరుగులకు 8 వికెట్లు కోల్పోయినప్పుడు హిక్‌మాన్ తన ఆఫ్ స్పిన్ బౌలింగ్‌కు దిగాడు. అతను తన మూడో ఓవర్ చివరి బంతికి వికెట్ తీసి, తర్వాత 11వ నంబర్ బ్యాట్స్‌మెన్ రిచర్డ్ హిగ్గిన్స్‌ని తన తర్వాతి ఓవర్ మొదటి బంతికి బౌల్డ్ చేయడంతో గన్‌బోవర్ ఇన్నింగ్స్ ముగిసింది. క్రిస్ టేకిస్ నాటౌట్ బ్యాట్స్‌మన్‌గా మిగిలిపోయాడు. పవర్ హౌస్ 361 పరుగులు చేసి, గేమ్‌ను గన్‌బోవర్‌కు అందుబాటులో లేకుండా చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో, హిక్‌మాన్ తిరిగి దాడికి దిగి, తన మొదటి బంతిలో హిగ్గిన్స్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. అప్పుడు నాన్‌స్ట్రయికింగ్ ఎండ్‌లో ఉన్నది క్రిస్ టేకిస్ కావడం విశేషం.


మెర్వ్ హ్యూస్

## పట్టుదలకు మారుపేరు రాయ్‌క్రాఫ్ట్

ఆస్ట్రేలియాకు చెందిన బిల్ రాయ్‌క్రాఫ్ట్ (17 మార్చి 1915–29 మే 2011)కు గుర్రపు స్వారీ అంటే ఎంతో ఇష్టం. రైతుగా, పాడిపరిశ్రమదారుడిగా రెండుచేతులా ఆర్జిస్తున్నప్పటికీ, ఆ రంగాన్ని విడిచిపెట్టి, అశ్వక్రీడలపై దృష్టి పెట్టాడు. అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ, జాతీయ ఈక్వెస్ట్రియన్ జట్టుకు ఈవెంటర్‌గా ఎంపికయ్యాడు. 1960 రోమ్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నప్పుడు, ప్రమాదవశత్తు క్రాస్ కంట్రీ ట్రాక్‌పై పడిపోవడంతో అతని మెడకు బలమైన గాయమైంది. దీనితో విశ్రాంతి అవసరమని, మెడకు ఏమాత్రం ఒత్తిడి తగిలినా ఫలితం తీవ్రంగా ఉంటుందని వైద్యులు హెచ్చరించారు. కానీ, పట్టుదలకు మారుపేరైన రాయ్‌క్రాఫ్ట్ విశ్రాంతి తీసుకోవడానికి నిరాకరించాడు. మరుసటి రోజే ఆసుపత్రి నుంచి బయటకు వచ్చి, నేరుగా స్టేడియం చేరుకున్నాడు. పోటీలో పాల్గొన్నాడు. ఆస్ట్రేలియాకు ఈక్వెస్ట్రియన్‌లో స్వర్ణ పతకం అందించడంలో కీలక పాత్ర పోషించాడు.





## ఇంజినీరింగ్ కళాశాలను హుస్నాబాద్‌కు తరలించొవద్దు

ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీల డిమాండ్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** శాతవాహన యూనివర్సిటీ క్యాంపస్‌లోనే ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని, హుస్నాబాద్‌కు తరలిస్తున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్‌లు మాట్లాడారు. కరీంనగర్ జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల కలగానే మిగిలిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర తెలంగాణలో కరీంనగర్ విద్యా కేంద్రంగా మారుతున్న తరుణంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడం వల్ల విద్యార్థులు, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో చేరి డొనేషన్ ఫీజులు కట్టలేక విద్యకు దూరమైన పరిస్థితి ఉందన్నారు. దశాబ్ద కాలంగా విద్యార్థి సంఘాల పోరాట ఫలితంగా వచ్చిన ఇంజనీరింగ్ కళాశాలను రాజకీయ స్వలాభాల కోసం హు స్నాబాద్‌కు తరలించడం విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్రలో భాగమేనన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమవుతోందన్నారు. ఇప్పటికైనా నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని శాతవాహన యూనివర్సిటీ క్యాంపస్‌లోనే ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఇళ్లు ముట్టడించి కరీంనగర్‌కు రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపల్లి అరవింద్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్ తదితరులున్నారు.

## తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** హెచ్‌పిసిఎల్‌లో తొలగించిన డ్రైవర్లను వెంటనే తిరిగి విధుల్లో తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాస్ రావులు డిమాండ్ చేశారు. శనివారం హెచ్‌పిసిఎల్ ఎదుట సిపిఐ, ఎఐటియుసి అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించుకున్నప్పటికి ట్రాన్స్‌ఫోర్ట్ యాజమాన్యంపై వత్తిడి తీసుకవచ్చి 16 మంది డ్రైవర్లను తొలగించడం సరైంది కాదన్నారు. ఇద్దరు డ్రైవర్లను హెచ్‌పిసిఎల్ డిజిఎం పేరుతో రూ.20ల బాండ్‌పై యూనియన్‌తో సంబంధం లేకుండా బెదిరించి పలు ఒప్పందాలను రాయించుకోని విధుల్లో తీసుకున్నారని చెప్పారు. కార్మికుల హక్కులకు భంగం కల్పించేలా యాజమాన్యం వ్యవహరించడం హేయమైన చర్య అన్నారు. ట్రాన్స్‌ఫోర్ట్ యాజమాన్యం వర్కర్ల మధ్య జరిగిన ఒప్పంద ప్రకారంగా జీతాలు చెల్లించాలని, స మ్మె కాలంలో జీతాలు యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ధూళిపాల ధనుంజయనాయుడు, రేమిడాల రాజు, ఎఐటియుసి అధ్యక్షులు జడల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, రాజారాం నాయక్, చామల అశోక్, సుధాకర్ రెడ్డి, బూర వెంకటేశ్వర్లు, పాపిరెడ్డి, ఖమ్మంపాటి రాము, రేగట్టి లింగయ్య, దేవరం మల్లేశ్వరి, లక్ష్మి, పద్మరేఖ, వెంకటమ్మ, హేమలత, వెంకన్న పాల్గొన్నారు.



## పోరాటాలతోనే హక్కులు సాధించుకుందాం

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా సివిల్ సప్లై హమాలీ యూనియన్ 4 జిల్లా మహాసభలు నిర్మల్ మండల్ లెవెల్ పాయింట్ వద్ద నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ హాజరైనారు. ఈ సందర్భంగా ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ పోరాటలతోనే కార్మికుల హక్కులను సాధించుకుందామని అన్నారు. సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ పోరాటం వల్లే హమాలీ రెట్లు పెరుచాయన్నారు. ఏరియర్స్ కూడా ఇప్పించమన్నారు. బోనస్, కుట్టుకులి, పండగకి స్వీట్‌లు కూడా ఇప్పిస్తున్నామన్నారు. మహిళా స్వీపర్‌కి కూడా, ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించామని, పెన్షన్ ఇచ్చే విధంగా ఒప్పందం చేశామన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి సర్కారు కార్మికులకు సంబంధించి 42 చట్టాలను 01 ఏప్రిల్ 2025 నుండి తొలగించి కొత్త నాలుగు కార్మిక వ్యతిరేక కోడ్లను అమలు పరుస్తున్నారని వీటివలన కార్మికుల హక్కులకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. ఈ నెల 18న జరిగిన ఢిల్లీ సమావేశంలో దేశవ్యాప్తంగా మే 20న జాతీయ సమ్మె చేపట్టాలని నిర్ణయించారన్నారు.ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం పోలీసులను, అధికారులను ఉపయోగించి సమ్మెను విఫలం చేయడానికి ప్రయత్నించారని కానీ కార్మికులు దీనిని సంఘటితంగా ఎదుర్కొన్నారని అన్నారు. ఎస్.విలాస్ మాట్లాడుతూ సివిల్ సప్లై కార్మికులు చేసినటువంటి నాలుగు రోజుల సమ్మె విజయవంతమైనదన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి సర్కారు కార్మిక వ్యతిరేక కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ చారి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్. రెడ్డి, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు కామ్రేడ్ భూక్య రమేష్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు కామ్రేడ్ రాథోడ్ పుండలిక్, జిల్లా ప్రధా న కార్యదర్శి సివిల్ సప్లై హమాలీ యూనియన్ పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక...

గౌరవాధ్యక్షులుగా కె.శ్రీనివాస్ చారి, అధ్యక్షులుగా పెండారి ముత్యం,ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ పుండలిక్ కోశాధికారిగా ఎస్.సాయి, ఉపాధ్యక్షులుగా కోండిబా, విట్టల్, మాలన్ భా య్ సహాయ కార్యదర్శిగా కామ్రేడ్ భీమేష్, సోమేష్, ప్రతి మండల పాయింట్ నుండి ఒక్కొక్కరిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. రాథోడ్ పుండలిక్ వందన సమర్పణతో మహాసభ ముగిసింది.

## ముందస్తు అడ్మిషన్లు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు ఏవీ?

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి : ఎఐఎస్ఎఫ్




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** రాష్ట్రంలో ఇంకా విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్‌లలో, ఇంటర్మీడియట్ కళాశాలలు 2025–26విద్యా సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తున్న అధికారులు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదని ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల శరత్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవన్ లో ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం సాగర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ల్యాదల్లా శరత్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్ , ఇంటర్మీడియట్ కళాశాలలో అప్పుడే అడ్మిషన్ పూర్తయినట్టు ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు చెప్పడం బాధాకరమన్నారు.ప్రైవేట్ కార్పొరేట్ కళాశాల పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్ చేస్తే ఫీజులో రాయితీ కల్పిస్తామంటూ విద్యార్థులు తల్లిదండ్రులను మాయమాటలుతో బురుడి కొట్టిస్తున్నారని ఆయన వి మర్శించారు. ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో పుట్టగొడుగుల పుట్టకొస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలు నియంత్రించడంలో ప్రభుత్వాలు, ప్రభుత్వాధికారులు గాని దొంద వైఖరిని ప్రదర్శిస్తున్నాయన్నారు. విద్యను సంతలో సరుకుగా మార్చేశాయని అడ్మిషన్ తీసుకోవాలంటే డొనేషన్ల బుక్స్ కు సపరేటు, యూనిఫామ్ సపరేట్ అని, ఐఐటి ఫౌండేషన్ సపరేట్ సపరేట్ అని ఇలా రకరకాల బ్రోచర్స్‌లో లేని పేర్లతోనే అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తుందే తప్పా, ఫీజులు నియంత్రించడంలో విఫలమైందన్నారు. విద్య హక్కు చట్టం సెక్షన్ 6 నిబంధనలో ప్రకారం అడ్మిషన్ జరగాలని, సెక్ష న్ 11 ప్రకారం ప్రైవేట్ యాజమాన్యాలు, గవర్నింగ్ బాడీ నిర్ణయించే ఫీజు కంటే ఎక్కువ వ సూలు చేయకూడదని ప్రభుత్వ నిబంధనలు ఉ న్నా, ఆ నిబంధన ప్రకారం విద్యార్థుల నుంచి వ సూలు చేస్తున్న ఫీజులు, వివరాలను నోటీసు బో ర్డులో పెట్టాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ముందస్తుగా అడ్మిషన్స్ నిర్వహించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనియెడల ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ హరీష్, శరత్, శివ తదితరులు పాల్గొన్నారు..

## ఎండదెబ్బకు గురైన ఉపాధిహామీ కూలీకి మెరుగైన వైద్యం

కొయ్యడ సృజన్ కుమార్ డిమాండ్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తీవ్ర ఎండతో ఉపాధిహామీ పనులకు వెళ్లి పడిపోయిన సిరిసిల్ల గణపతికి మెరుగైన వైద్యం అందించి వారికి ఆర్థిక సహాయంతో కుటుంబాన్ని ఆదుకోవాలని బికెఎంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఎండదెబ్బకు గురైన గణపతిని 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ శంకరపట్నం మండలం చింతలపల్లి గ్రామంలో రోజులాగే ఉపాధిహామీ పనికి వెళ్లిన కార్మికులు పని ప్రదేశం గట్టిగా ఉండడం వల్ల ముందు రోజే ఆ ప్రదేశంలో నీటితో తడిపి శుక్రవారం పనికి వెళ్లగా ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో అక్కడే కల్లు తిరిగి పడిపోవడంతో 108కు ఫోన్ చేయగా అంబులెన్స్ వచ్చి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారని తెలిపారు. ఇప్పటికీ సంబంధిత అధికారులు ఆసుపత్రికి రాలేదని, పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే ఉపాధి హామీ అధికారులు స్పందించి వారికి మెరుగైన వైద్యం అందించాలని, వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బ్రాహ్మణపల్లి యుగేందర్, నాయకులు నల్లగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభల కరపత్రావిష్కరణ

నల్లగొండ జిల్లా 7వ మహాసభను జయప్రదం చేయాలి:ఎఐటియుసి




**ప్రజాపక్షం/నల్లగొండ :** ఏప్రిల్ 12 శనివారం నల్లగొండలోని ఎస్‌విఆర్ ఫంక్షన్ హాల్ మిర్యాలగూడ రోడ్‌లో జరిగే భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఏడవ మహాసభ జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా దేవేందర్ రెడ్డి కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభల కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి 1996లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తీసుకురావడం కోసం కృషి చేయటం జరిగింది. ఆన్లైన్ పొరపాటు వల్ల చాలా తప్పులు దొర్లుతున్నాయని ఆధార్ అప్డేట్ల కోసం రెన్యువల్స్ కోసం రోజుల తరబడి కార్మికులు లేబర్ కార్యాలయాల చుట్టు తిరిగిన పనులు కావడం లేదు. కావున భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో జరగబోయే పోరాటాల గురించీ ఈ మహాసభలలో చర్చించి భవిష్యత్ పోరాట కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుంది. ఏప్రిల్ 12 శనివారం నల్లగొండలోని ఎస్‌విఆర్ ఫంక్షన్ హాల్ మిర్యాలగూడ రోడ్ లో జిల్లా 7వ మహాసభ జరుగుతుంది. కావున జిల్లాలోని భవన,ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా ఉపాధ్యక్షులు కెఎస్ రెడ్డి, పాణం వెంకట్ రాములు,జిల్లా నాయకులు సకినాల అంజయ్య,పట్టణ అధ్యక్షులు గుండె రవి, పట్టణ కార్యదర్శి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు 3 నెలల వేతనబకాయిలు చెల్లించాలి




**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** నగరపాలక సంస్థ నస్పూర్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని, వాటిని వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు కోరారు. శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ శివాజీకి వినతిపత్రం అందజేసిన ఆయన, ప్రతి నెలా వేతనాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని, పిఎఫ్, ఇఎస్ఐ పెండింగ్ లేకుండా చూడాలని, కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మేకల దాసు, అధ్యక్షుడిగా నాగపూరి రవి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బొడ్డుపెల్లి గోపి, ఎండి జాఫర్, గొలుసుల వెంకటస్వామి, సురిమిల్ల సందీప్ బాధ్యతలు స్వీకరించగా, కారం గంటి భాస్కర్ ప్రధాన కార్యదర్శిగా, కామెర కళ్యాణ్, చిట్యాల ప్రశాంత్, చింత రాజేష్, కొయ్యల లింగయ్య సహాయ కార్యదర్శులుగా, బెక్కం కిరణ్ కోశాధికారిగా, కన్నూర్ సమ్మయ్య, చిక్కుడు వినయ్, వెల్కటూరి అనిల్, మంతెన సంజీవ్, రేగుంట రాజకుమార్ ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. 18 మంది సభ్యులతో కలిపి మొత్తం 31 మంది కమిటీకి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ ఆలీ ఖాన్, మున్సిపల్ సంఘం అధ్యక్షుడు రవి, కార్యదర్శి భాస్కర్, గోపి తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## జ్యోతిరావు పూలే జయంతి కరపత్రం విడుదల

ప్రజాపక్షం/ ఎర్రపల్లి : మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాణి కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎర్రపల్లి మండల కేంద్రంలో జిల్లా కేంద్రంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలను పురస్కరించుకొని పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యాభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో హంటర్ కమిషన్ సంప్రదించి విద్య కోసం నిరంతరం కృషి చేసిన మహాపురుషుడు మహాత్మ జ్యోతిబాపూలే అని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను వచ్చే నెల 11వ తేదీన వడ్డేపల్లి మండలం శాంతి నగర్ పట్టణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కార్యకర్తలు, హాజరై విజయవంతం చేయాలన్నారు. కరపత్రాలు విడుదల చేసిన వారిలో ధర్మవరం రాముడు, దేవన్న , నాగేంద్ర, దేవదాస్, తిక్కయ్య ఇతరులు పాల్గొన్నారు.



## ప్రశాంత వాతావరణంలో పండుగలు

ప్రజాపక్షం/సూర్యాపేట: రాష్ట్రంలోని అన్ని మతాల్లో ఐక్యత పెంచిన ఘతన మాజీ సిఎం కెసిఆర్‌దేనని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో రంజాన్ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు స్వయంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలకు ప్రత్యేక విందులు మొదలైంది తెలంగాణలోనే అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇఫ్తార్‌ను ఆ నాడు కెసిఆర్ ప్రారంభించారని గుర్తు చేశారు. స్వరాష్ట్రం సాధించాకా అధికారికంగా నిర్వహించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఈ సంస్కృతి కొనసాగాలని కోరారు. అన్ని మతాల పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకొని ఐక్యతను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, 5వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ బాషామీయా, మాజీ గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ తాహేర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, మైనార్టీ నాయకులు సయ్యద్ సలీం, రఫీ పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా కులగణన చేయాల్సిందే



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఛలో ఢిల్లీకి సంబంధించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించిన బీసీ బిల్లును యదావిధిగా ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం ఆమోదించి చట్టం చేయాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బాధ్యతను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీసుకోవాలని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ పోరుగర్జన పేరుతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నందున బీసీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, కొమ్ము శ్రీనివాస్, గుండెబోయిన నాగేశ్వర్‌రావు, ఎర్రబెల్లి దుర్గయ్య, మాదుగుల శ్రీనివాస్, నక్క నాగరాజు, దొనేటి శేఖర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ ఆలయ హుండీ లెక్కింపు



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటిలోని కనకదుర్గ ఆలయంలోని హుండీ లెక్కింపు అధికార యంత్రాంగం సమక్షంలో శనివారం జరిగింది. హుండీలోని నగదును అమ్మవారి భక్తులు లెక్కించారు. గత సంవత్సరం ఆగష్టు 7వ తేది నుండి ఈ రోజు వరకు గల హుండీ నగదు రూ. 87,660 వచ్చినట్లు ఆలయ అధికారి అంబటి నాగరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారగోని అంజనేయులు, సభ్యులు గంజి వెంకటేశ్వర్లు, బుద్ధ విమలకృష్ణమూర్తి, వరకాంతం నర్సిరెడ్డి, రుద్రారపు లింగయ్య, జిట్ట సాయిలు, పట్టణ ప్రముఖులు పాటి మాధవరెడ్డి, పొన్నం లక్ష్మయ్యగౌడ్‌లు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ పరిశీలకురాలు సుమతి, అధికారులు మేడబోయిన శ్రవణ్‌కుమార్, కె నాగరాజు, జె సత్యనారాయణ తదితరులు హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

## ఈద్గావద్ద అన్ని ఏర్పాట్లు

ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్: రంజాన్ పర్వదినాన ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించేందుకు ఈద్గా వద్దకు వచ్చే ముస్లిం సోదరులకు ఇలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అధికారులను కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని జనగాం రోడ్డులోని ఈద్గా వద్ద కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆదేశాలతో అధికారులతో కలిసి అక్కడికి వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ వేడుకలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. ఈద్గాకు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా తలెత్తకుండా చూడాల న్నారు. పట్టణ, రూరల్ సిఐలు వీరరాఘవులు, రాజశేఖర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, మాజీ కౌన్సిలర్ చిన్న జహీర్ ఉన్నారు.

## సువెన్ సేవలు అభినందనీయం

ప్రజాపక్షం/సూర్యాపేట: విద్యారంగ అభివృద్ధిలో సువెన్ సేవలు అభినందనీయమని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని 1వ వార్డు కుడకుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సువెన్, అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, షూ, టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన శ్రీపాల్ రెడ్డి మాజీ మమంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవగా తన నిధులను నియోజకవర్గంలోని పాఠశాలల అభివృద్ధికి కేటాయించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధరావత్ వీరన్న నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, మాజీ కౌన్సిలర్ వేములకొండ పద్మ, సువెన్ ఫార్మసుటికల్ హెచ్‌ఆర్ వెంకటరమణ, అక్షర ఫౌండేషన్ కార్యదర్శి కాళిదాసు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత పాల్గొన్నారు.



# విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

ఎంజియు ఆకస్మిక పర్యటనలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్/ నార్కట్‌పల్లి : మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ సర్వతోముఖాభివృద్ధికి సర్వదా సిద్ధమని ఆకస్మిక పర్యటనలో పునరుద్ఘాటించారు.సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల ను బడ్జెట్ గా మార్పునకు,కొత్త కోర్సుల ప్రవేశ పెట్టే ప్రణాళికలను అందించాలని సూచించారు.ఉత్తమ పరిశోధనలు జరగాలని, విశ్వవిద్యాలయ అభివృద్ధి కి మరిన్ని ప్రణాళికలతో ముందుకు రావాలని సూచించారు. నాణ్యమైన విద్యనందిస్తూ విశ్వవిద్యాలయ ప్రతిష్ట పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమములో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐక్యూ ఏసి డైరెక్టర్ డా మిర్యాల రమేష్, ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ వై ప్రశాంతి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి, ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె ప్రేమ్సాగర్, సుధారాణి,డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి, డాక్టర్ నీలకంఠం శేఖర్, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

**ఏప్రిల్ 25 నాటికి ఎన్‌టిపి పనులను పూర్తి చేయాలి:**

ఏప్రిల్ 25 నాటికి నల్లగొండ సమీపంలోని శేషమ్మ గూడెం వద్ద చేపట్టిన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులను పూర్తిచేయాలని రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్, నల్లగొండ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ జె. శ్రీనివాస్ , ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంటును తనిఖీ చేశారు.2014 లో 38 కోట్ల రూపాయలతో ఈ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ మంజూరు అయిందని, ఇప్పటివరకు పనులు పూర్తి కాకపోవడం బాధాకరమని అన్నారు. పట్టణంలో దాదాపు 80 శాతం ఇండ్లు ఎన్‌టిపి కనెక్షన్లు కలిగి ఉన్నాయని, ముఖ్యంగా వెంకటేశ్వర కాలనీ, రాఘవేంద్ర కాలనీ లాంటి అన్ని కాలనీలకు ఎస్టీపి కనెక్షన్ ఉందని, తక్కిన ఇండ్లకు కూడా ఎన్‌టిపి కనెక్షన్లు ఇస్తామని ,అందువలన రానున్న 25, 30 రోజుల్లో ఎస్ టి పి నిర్మాణం పూర్తిచేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను పూర్తి చేయడంతో పాటు, చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయాలని, మొక్కలు నాటించాలని, టైల్స్, పెయింటింగ్ వంటి వాటన్నింటినీ ఏర్పాటు చేయాలని చెప్పారు.మంత్రి వెంట జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, ఆర్‌డిఓ అశోక్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి ,పబ్లిక్ హెల్త్,మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు,మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ అధికారులు, తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

## ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి: మంత్రి

ప్రజాపక్షం/నల్లగొండ : తెలుగు సంవత్సరాది శ్రీ విశ్వావసునామ సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.మామిడి తోరణాలు, పాడిపంటలు, ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో తెలంగాణ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.రేషన్ కార్డున్న ప్రతీ తెలంగాణ బిడ్డకు సన్న బియ్యం అందించే సంక్షేమ కార్యక్రమం, ఉగాది పండగ సందర్భంగా నేడు సూర్యాపేటలో ప్రారంభించుకోబోతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.ఆరు గ్యారెంటీలు, రైతు రుణ మాఫీ అమలు చేస్తూ పరిశ్రమల స్థాపన, ఉద్యోగ నియామకాలు, చక్కటి రహదారుల నిర్మాణంతో ప్రగతి దిశగా పరుగులుపెడుతున్న తెలంగాణ రాష్ట్రం ఈ నూతన సంవత్సరంలో మరింత వేగంగా అభివృద్ధి బాట పట్టాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కోరుకున్నారు.జీవితం.. తీపి, కారం, ఉప్పు, పులుపు, వగరు, చేదు వంటి షడ్రుచుల సమ్మేళనమని సందేశాన్నిచ్చే ఉగాది పండగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

1500 మంది పోలీస్ సిబ్బంది : జిల్లా ఎస్‌పి నరసింహ



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : ఉగాది పర్వదినం రోజున సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో జరుగుతున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటనకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని సూర్యాపేట జిల్లా ఎస్.పి కె.నరసింహ్ శనివారం తెలిపారు. ఆదివారం ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు,మార్గాలను, సభాప్రాంగణాన్ని, పార్కింగ్ ప్రదేశాలను,హెలిప్యాడ్ ప్రదేశాలను పోలీసు అధికారులతో కలిసి ఎస్‌పి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1500 మంది సిబ్బందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, జిల్లా యంత్రాంగం,ఇతర శాఖల సిబ్బందితో సమన్వయం గా కలిసి పనిచేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి సభకు వచ్చే వారి వాహనాల వలన ఎటువంటి ఇబ్బందులు కలగకుండా,వాహనాల ట్రాఫిక్ జామ్ కాకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు. వాహనాల మళ్లింపు,వాహనాల పార్కింగ్ ప్రణాళికలు చేశామన్నారు. సభా ప్రాంగణానికి చేరుకునేలా అన్ని మార్గాల్లో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పోలీస్ వారు ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలలోనే వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు. మార్గం మధ్యలో పోలీస్ వారి సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా ఎస్పీ నాగేశ్వరరావు,డిఎస్‌పి శ్రీదర్‌రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ నాగభూషణం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇడికుడి పర్వతాచారి మృతి బాధాకరం

ప్రజాపక్షం/డిండి: డిండి మండలంలోని రహమంతాపూర్ గ్రామశాఖ సిపిఐ పార్టీ సినియర్ సభ్యులు, మాజీ వార్డు సభ్యులు ఇడికుడి పర్వతాచారి అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరం అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డిలు అన్నారు. శనివారం రహమంతాపూర్ గ్రామంలో పర్వతాచారి పార్ధివ దేహంపై సిపిఐ జెండాను ఉంచి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ పార్టీ సినియర్ సభ్యుడు పర్వతాచారి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారని అలాంటి వ్యక్తిని కోల్పోవడం పార్టీకి, కుటుంబానికి తీరని లోటు అని వారన్నారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్, సిపిఐ మండల కార్యదర్శి కనకాచారి, మండల సహాయ కార్యదర్శి శైలేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, శ్రీనయ్య, హుస్సేన్, శ్రీను, గ్రామశాఖ కార్యదర్శి శివ తదితరులు ఉన్నారు.



## బార్ అసోసియేషన్ నూతన కమిటీ



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా సన్నాయిల ఉమా మహేశ్వర్, ఉపాధ్యక్షులుగా వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా కర్నాటి సురేష్, సహాయ కార్యదర్శిగా యాదయ్య, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పుష్పలత, ట్రెజరర్‌గా శ్రీకాంత్, కమిటి సభ్యులుగా ఎర్ర కృష్ణ , గణేష్, శంకర్, జున్నిద్దయ్య ఎన్నికయ్యారని ఎన్నికల కమిషనర్ ఇడెం రవి, కిషన్‌లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమా మహేశ్వర్ కమిటి సభ్యుడు ఎర్ర కృష్ణ జంబావ్‌లను దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ న్యాయవాద వృత్తి సమాజ సేవలకు అంకితమైనదని అన్నారు. ఉమా మహేశ్వర్ నాయకత్వంలో బార్ అసోసియేషన్ మరింత బలంగా పనిచేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, శ్రీధర్‌గౌడ్, రామస్వామి, నిరంజన్, రాంసింగ్, న్యాయవాదులు ఆంజనేయులు, గౌరీ శంకర్, రామశంకర్, లోహిత్ రెడ్డి, జగదీష్, రియాజుద్దీన్, ఇంద్రవరప్రసాద్ తదతరులు ఉన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

ఎమ్మెల్సీ శంకర్ నాయక్



ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ : కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు పోతుందని ఎమ్మెల్సీ, డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర సన్నాక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవ డానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, సంవిధాన్ కార్యక్రమం తీసుకొచ్చారని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆనాడు అణగారిన వర్గాలకు రిజర్వేషన్, రాజకీయ ప్రాముఖ్యత కల్పించాడని అన్నారు.అంబేద్కర్ భారత రాజ్యాంగం తోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతలను అవమానిస్తుందని ఆరోపించారు.బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జైశ్రీరామ్ నినాదంతో మతతత్వం పేరుతో బాగా వేయాలని చూస్తుందని విమర్శించారు. మోడీ, అమిత్ షా భారత రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండించాలన్నారు. ఆనాడు స్వాతంత్రం కోసం పోరాడింది కాంగ్రెస్ పార్టీనేని పేర్కొన్నారు. మతతత్వంతో పాలన సాగిస్తే ప్రజల భవిష్యత్తుకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సంజీవ్ ముదిరాజ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరీ రమేష్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, మాజీ ఎంపీపీ పోలగోని సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టులు ముందంజ

ప్రజాపక్షం/మోటకొండూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టులు ముందుంటారని యాదాద్రి భువనగిరి జిల్లా సి పి ఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన శుక్రవారం రాత్రి మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డి గూడెంలో ముత్తిరెడ్డి గూడెం సిపిఐ గ్రామ శాఖ మహాసభ కామ్రేడ్ పశువుల నరసింహ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి కంచర్ల మల్లయ్య అధ్యక్షతన నిర్వహించగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ ,మండల కార్యదర్శి గాధగాని మాణిక్యం పాల్గోని మాట్లాడుతూ గ్రామ సమస్యలపై సిపిఐ పోరాటాలు చేయాలని, సిసి రోడ్డు పనులు గాని అండర్ డ్రైనేజ్ గాని వీధిలైట్లు గాని మంచి నీరు ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలకు ఇబ్బంది అయ్యే పనులు ఏవైనా సరే వాటిపై కమ్యూనిస్టు పార్టీ ముందుండి పరిష్కరించాలని అన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. గ్రామ శాఖ కార్యదర్శిగా పసుల నరసింహ, సహాయ కార్యదర్శులు మచ్చ పాండు, కంచర్ల మల్లయ్య, వీరితోపాటు తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులు బొడుగేసుదర్శన్, మంచాల రాధమ్మ, మంచాల పద్మ, దేవల బాలరాజు, మంచాల అనసూయ దుశెట్టి, అండాలు ఆడెపు నర్సింహులు, మంచాల సుగుణ ఎన్నుకోవడం జరిగింది. పాల్గొన నాయకులు సిపిఐ మండలసహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, శివమ్మ, బండి అనసూయ, కలమ్మ తదితరులు పాల్గొన్నారు.





## రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ప్రజాపక్షం/తుర్కపల్లి: రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు.తుర్కపల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో పాటుగా, ఇంచార్జి బొజ్జ సంధ్య రెడ్డి ముఖ్యఅతిథిలుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ భారతదేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చి75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడంమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ఒక్కొకటి అమలుపరుస్తూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం అందజేసిన పథకాలను కూడా కొనసాగిస్తుందన్నారు. కానీ టిఆర్‌ఎస్ నాయకులు పింక్ మీడియా,బీజేపీ నాయకులు సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వం చేస్తున్న పనులను ఓర్వలేక వ్యతిరేకమైన దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అండెం సంజీవ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి,మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి,నాయకులు శంకర్ నాయక్,భాస్కర్ రెడ్డి,పలుగుల శ్రీనివాస్,భాస్కర్ నాయక్,ఎలుగల రాజయ్య, పట్టు నాయక్,శ్రీనివాస్ యాదవ్,సోన్నాయిల రఘు,నిఖిల్ గౌడ్,నర్సింహులు, దేవరుప్పల ఐలయ్య,వెంకటేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## సాగునీరు ఇస్తామని పంటలు ఎండబెడతారా?

తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ గౌరీశంకర్

ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి: రబి పంట సాగుకు విడతలవారిగా ఎస్‌ఆర్‌ఎస్‌పి కాల్వల సాగునీరు అందిఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు నీరు ఇవ్వకుండా రైతుల పంటలను ఎండబెట్టడం ఏమిటని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. శనివారం సూర్యాపేట నియోజకవర్గంలోని చివ్వెంల, పెన్ పహాడ్ మండలాల పరిధిలో ఎస్‌ఆర్‌ఎస్‌పి రెండవ దశ కాల్వల పరిధిలో వరి పంట సాగు చేసి నీరు అందక ఎండిపోయి పంటలను బిసి కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర, ప్రముఖ సీనియర్ జర్నలిస్టు టంకశాల అశోక్‌లతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు చెందిన నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలకు నీరు రాకుండా అడ్డుకొని కోదాడ నియోజకవర్గానికి ఎక్కువగా నీరు తరలించుకుపోవడంతో ఈ ప్రాంతంలో వరి పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ. 30వేల నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ బిసి కమిషన్ సభ్యులు ఉపేంద్ర, ప్రముఖ సీనియర్ జర్నలిస్టు టంకశాల అశోక్‌లు మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంలో సాగునీరు లేక ఎండిపోతున్న విషయాన్ని తెలుసుకున్న తాము క్షేత్ర స్థాయిలో అధ్యాయనం చేసేందుకు చివ్వెంల, పెన్ పహాడ్ మండలాల్లో పర్యటించినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రం లో ఉన్న పరిస్థితులు తిరిగి పునఃరావృతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



## పిడుగుపాటు మృతులకు రూ.6 లక్షల నష్టపరిహారం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో గత ఐదేళ్లలో పిడుగుపాటు, అగ్నిప్రమాదాల కారణంగా మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని విడుదల చేసింది. ఈమేరకు ఆయా జిల్లా కలెక్టర్లకు సమాచారం పంపించి బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందేలా విపత్తు నిర్వహణ విభాగం ఆదేశాలు జారీ చేసింది. పిడుగు పాటుతో మృతి చెందిన వారి ఒక్కో కుటుంబానికి ఆరు లక్షల రూపాయిల చొప్పున, అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు నాలుగు లక్షల చొప్పున నష్టపరిహారం అందిస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బాధిత కుటుంబాలకు ఈ పరిహారం త్వరిత గతిన అందించాలని మంత్రి ఆదేశించారు. ఇదేగాక హైదరాబాద్‌లోని రుబీహోటల్ అగ్నిప్రమాద ఘటనలో మృతి చెందిన 8 మంది కుటుంబాలకు రూ. 32 లక్షల రూపాయిలను ప్రభుత్వం మంజూరు చేసింది.





























































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com